# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 191 | హైదరాబాద్ | మంగళవారం 20-01-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

ట్రంప్ వ్యాఖ్యల ఎఫెక్ట్..
రికార్డు స్థాయికి చేరిన పసిడి, వెండి

## స్విట్జర్లాండ్‌లో భారత రాయబారితో
# సీఎం చంద్రబాబు బృందం భేటీ

- ఏపీకి స్విస్ పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రధానంగా చర్చ
- టెక్నాలజీ, ఫార్మా రంగాల్లో భాగస్వామ్యానికి ఆహ్వానం
- విద్యా సంస్థల మధ్య సహకారంపైనా కీలక చర్చలు
- ఇండియా-EFTA ఒప్పందంతో ఏపీకి ప్రయోజనమని లోకేశ్ ధీమా

11లో





11లో

## తిరుమలలో రథసప్తమికి
# విస్తృత ఏర్పాట్లు

- ఈ నెల 25న రథసప్తమి వేడుకలు
- సూర్య భగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని
- ఏడు వేర్వేరు వాహనాలపై విహరించనున్న వేంకటేశ్వర స్వామి


11లో

## హిందువులపై దాడులు..
## స్పందించిన బంగ్లాదేశ్ ప్రభుత్వం

- వాటిలో మతపరమైన ఉద్దేశాలు లేవంటూ ప్రకటన
- చాలా వరకు నేరపూరిత స్వభావం కలిగినవారు చేసినవేనన్న బంగ్లాదేశ్
- 645 ఘటనల్లో 71 మతపరమైనవని వెల్లడి

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్
- ఈ నెల 17 ఉదయం నుంచి 18 సాయంత్రం వరకు కాల్పులు
- మృతుల్లో నలుగురు మహిళా మావోయిస్టులు


11లో


11లో

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం.. హరీశ్ రావుకు నోటీసులు

- రేపు ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని సిట్ నోటీసులు
- జూబ్లీహిల్స్‌లోని పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలన్న సిట్

## టీం 11 ముఖం చూసి
# ఎవరైనా పెట్టుబడులు పెడతారా?

- జ్యూరిచ్ లో తెలుగు డయాస్పొరా సమావేశం
- సీఎం చంద్రబాబుతో పాటు పాల్గొన్న మంత్రి నారా లోకేశ్
- ఏపీకి రావొద్దని ఏడుపుగొట్టు టీం కంపెనీలకు ఈమెయిల్స్ పెడుతోందని విమర్శలు
- అర్థమైందా రాజా అంటూ పరోక్ష వ్యాఖ్యలు

11లో





11లో

## యూఏఈ అధ్యక్షుడికి, ఆయన కుటుంబానికి
# అపురూపమైన కానుకలు ఇచ్చిన ప్రధాని

- భారత్‌కు చేరుకున్న యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్
- విమానాశ్రయానికి వెళ్లి స్వయంగా స్వాగతించిన ప్రధాని మోదీ
- భారతీయ సంప్రదాయ ఉయ్యాలతో పాటు ప్రత్యేక కానుకల బహూకరణ
- "నా సోదరుడు" అంటూ సోషల్ మీడియాలో ప్రధాని మోదీ పోస్ట్
- ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చలు

# హిందూ పండుగలూ కలుషితం!

తెలుగు నేలపై ఆధ్యాత్మికత పేరుతో ఒక వింతైన ధోరణి కొనసాగుతోంది. దశాబ్దాలుగా సాగుతున్న మత మార్పిళ్లు ఇప్పుడు సరికొత్త వేషధారణను అద్దుకున్నాయి. ఒకప్పుడు నిశ్శబ్దంగా సాగే ఈ ప్రక్రియ, ఇప్పుడు అచ్చంగా హిందూ ధర్మంలోని ఆచారాలను కాపీ చేస్తూ సాగుతుండటం తీవ్ర చర్చకు దారితీస్తోంది. అటు క్రైస్తవం తన మూలాలను వదులుకుంటోందా, లేక ఇటు హిందూ సంప్రదాయాలను తనలో కలిపేసుకుని భ్రమకు గురి చేస్తోందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మత ప్రచారం కోసం హిందూ ధర్మ మూలాలను వాడుకోవడం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది.సాధారణంగా ఏ మతానికైనా కొన్ని ప్రత్యేక గుర్తులు, ఆచారాలు ఉంటాయి. కానీ ప్రస్తుతం క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో అభిషేకాలు చేయడం, కుంకుమలు దిద్దడం, వ్రతాలు నిర్వహించడం వంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. అంతటితో ఆగక, అయ్యప్ప స్వామి మాల లాగా ప్రత్యేక దీక్షలు పట్టడం, సంక్రాంతి పండుగ వేళ ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టి హరిదాసుల వేషధారణతో వేడుకలు జరపడం వంటివి సాధారణమయ్యాయి. ఇది ఆయా మతాల సిద్ధాంతాలకు పూర్తిగా విరుద్ధమైనప్పటికీ, ప్రజలను ఆకర్షించడానికి ఇదొక వ్యూహంగా మారుతుండటం ఆందోళనకరం. బలవంతపు మత మార్పిళు ఒక ఎత్తు అయితే, ఇటువంటి సంకరణం ద్వారా సామాన్య ప్రజలను గందరగోళానికి గురి చేయడం మరో ఎత్తు. ఎవరి మతాన్ని వారు ఇష్టపూర్వకగా అనుసరించడం రాజ్యాంగం కల్పించిన హక్కు. కానీ, ఒక మతంలోని గుర్తులను మరో మతం అరువు తెచ్చుకుని, తమ ఉనికిని కప్పిపుచ్చుకుంటూ మార్పిడిలను ప్రోత్సహించడం అనైతికమే. ఇది కేవలం ఆధ్యాత్మిక అంశం మాత్రమే కాదు, భవిష్యత్తులో సామాజిక అస్థిరతకు, సాంస్కృతిక విధ్వంసానికి దారితీసే ప్రమాదం ఉంది. ఓ రకంగా ఇది హిందూత్వంపై జరుగుతున్న దాడే అనుకోవచ్చు.ప్రజల నమ్మకాలను గౌరవించడం అంటే వారి మూలాలను చెరిపివేయడం కాదు. మతం మారిన వ్యక్తి తన పాత సంప్రదాయాలను వదులుకోలేకపోతే అది మానసిక స్థితిని ప్రతిబింబిస్తుంది, కానీ వ్యవస్థాకృతంగా పాస్టర్లు ఇలాంటి ప్రయోగాలు చేయడం వెనుక పెద్ద కుట్ర ఉందన్న విమర్శలు వస్తున్నాయి. మేడ్చల్ జిల్లాలోని నాగారంలో ఉన్న జ్యోతి డీ అడిక్షన్ రిహాబిలిటేషన్ సెంటర్ ను పరిశీలిస్తే.. ఇక్కడ చుట్టూ జనావాసాలు, మధ్యలో ఓ బూత్ బంగ్లాలాంటి భవనం.. చుట్టూ వ్యూకటర్స్.. ఈ భవనంలో ఏం జరుగుతుందో.. ఎవరికీ తెలిసే అవకాశం లేదు. కానీ ఇక్కడ సుమారు 40 మందికి పైగా మద్యానికి బానిసలైన వారికి చికిత్స జరుగుతోంది. చికిత్స అనేకంటే.. అక్రమ నిర్బంధం అని చెప్పాలి. మద్యానికి బానిసైన వ్యక్తిని అమాంతం నిర్బంధించి తీసుకువెళ్లడం ఇల్లీగల్ డీ అడిక్షన్ రీహాబిలిటేషన్ సెంటర్లలో ఒక పార్టు మాత్రమే. దీని కోసం ఆవారా.. గూండా గ్యాంగ్ లను ఉపయోగిస్తారు. చికిత్సలు అందించాలంటే వైద్య నిపుణులు, సైకియాట్రిస్టులు, సైకాలజిస్టులను నియమించాలి. ఒకరిద్దర్ని పెట్టుకొని మిగితా వారిని అర్హతలే లేకున్నా నడిపిస్తున్నారు. బాధితుల నుంచి ఒక్కో సెషన్ రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు.మద్యానికి బానిసైన వినాయక్ నగర్ కు చెందిన కృష్ణ (52)ను రెండు నెలల జ్యోతి డీ అడిక్షన్ సెంటర్ లో చికిత్స కోసం చేర్పిస్తే.. అందులో వంట మనిషి కయ్యూం ఆదివారం కృష్ణ పై విచక్షణారహితంగా దాడి చేసి చంపేయడం కలకలం రేపింది. తాగుడు మాన్పించే ఈ కేంద్రంలో వంట మనిషి కయ్యూం మద్యం తాగి వచ్చి ఆ మత్తులో చికిత్స పొందుతున్న బాధితులను కొడుతుంటారని వారు వాపోతున్నారు. బాధిత కుటుంబాల నుంచి రూ. లక్షల్లో ఫీజు వసూలు చేసి చిత్రహింసలకు గురి చేయడం.. ఇలాంటి కేంద్రాలు ఏపీ ప్రాంతాల్లో ఎన్ని ఉన్నాయో.. వైద్య ఆరోగ్యశాఖ వద్ద సమాచారం లేకపోవడం గమనార్హం.ఆల్కహాల్, మత్తుకు బానిసలైన వారి వల్ల వారికే కాదు.. కుటుంబానికి.. సమాజానికి కూడా నష్టం జరుగుతోంది. అసాంఘిక శక్తులుగా మారే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అందుకే ఇలాంటి వారిని మత్తు నుంచి బయటకు తీసుకువచ్చేందుకు.. డీ అడిక్షన్ రీహాబిలిటేషన్ సెంటర్లలో వీరికి ట్రీట్మెంట్ చేస్తారు. అయితే మత్తుకు బానిసైన వారిని ఒక్కసారిగా ఆ అలవాటు నుంచి దూరం చేస్తే.. మానసిక సమస్యలకు దారి తీస్తుంది. కాళ్లు, చేతులు, వణుకుతుండడం.. ప్రేలాపనలు.. పిచ్చిగా ప్రవర్తించడం వంటివి చేస్తుంటారు. వీరికి తొలుత డీటాక్సిఫికేషన్ చికిత్స అందించాలి. యాంటి క్రేవింగ్ మందులు అందిస్తూ.. కౌన్సిలింగ్, మోటివేషన్ థెరపీ అందించాలి.డీ అడిక్షన్ రీహాబిలిటేషన్ కేంద్రాల్లో చికిత్స పేరుతో బలవంతంగా మత మార్పిడిలకు పాల్పడుతున్నారని జ్యోతి సెంటర్ లో చికిత్స పొందుతున్న బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు ఓ మతానికి చెందిన గ్రంథం చదవాలని, ఆ మతానికి చెందిన పాటలు పాడాలని తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని వాపోతున్నారు. ఒకవేళ డైలీ గ్రంథం, పాటలు పాడని వారి పై అకారణంగా దాడులు చేస్తుంటారని, భోజనం కూడా పెట్టరని వారు పేర్కొంటున్నారుఆధ్యాత్మికత అనేది ఆత్మకు శాంతిని ఇవ్వాలి కానీ, ఇలాంటి వింత పోకడలతో సమాజంలో విభజన తీసుకురాకూడదు. ఇప్పటికైనా మేధావులు, మత పెద్దలు దీనిపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. అసలైన భక్తికి, ఆకర్షించే ప్రలోభాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించకపోతే మన సంస్కృతి మసకబారే ప్రమాదం ఉంది.

# జనసేన గూటికి సుచరిత



గుంటూరు, జనవరి 19 (భారత శక్తి):

ఏపీలో రాజకీయాలు విచిత్రంగా మారుతున్నాయి.కూటమి అధికారంలోకి వచ్చి 19 నెలలు అవుతోంది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపడేందుకు చేయని ప్రయత్నం అంటూ లేదు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఆ పార్టీలో ఉన్న చాలామంది నేతలు కూటమి పార్టీల్లో చేరారు. అయితే ఇటీవల ఆ చేరికలు తగ్గుముఖం పట్టాయి. అయితే సంక్రాంతి తర్వాత చాలామంది వైసిపి నేతలు పార్టీకి గుడ్ బై చెబుతారని ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోని మహిళా నేతలకు ప్రాధాన్యత తగ్గినట్లు వార్తలు వస్తున్నాయి. అందుకే వారు పార్టీకి గుడ్ బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు టాక్ నడుస్తోంది. ముఖ్యంగా గుంటూరు జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి పార్టీకి రాజీనామా చేస్తారని పొలిటికల్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీఆవిర్భావం నుంచి జగన్ వెంట అడుగులు వేస్తున్న చాలామంది నేతలు ఉన్నారు. అటువంటి వారిలో గుంటూరు జిల్లాకు చెందిన మేకతోటి సుచరిత ఒకరు. దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆమెకు ఎంతగానో ప్రోత్సాహం అందించారు. జడ్పిటిసి సభ్యురాలిగా అవకాశం ఇచ్చారు. 2009లో ఆమె తొలిసారిగా గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహంతోనే అసెంబ్లీలో అడుగు పెట్టారు. అందుకే ఆయన అకాల మరణంతో కుమారుడు జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేశారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. అయితే ఉప ఎన్నికల్లో మరోసారి విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా రెండోసారి పోటీ చేసి ఓడిపోయారు. 2019లో మూడోసారి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచేసరికి జగన్మోహన్ రెడ్డి తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. 2024 ఎన్నికల్లో నాలుగో సారి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు మేకతోటి సుచరిత

కొంతకాలంగా పొలిటికల్ గా సైలెంట్ గా ఉన్నారు సుచరిత మొన్నటి ఎన్నికల్లో ప్రత్తిపాడు బదులు తాడికొండ నుంచి పోటీ చేశారు. అది ఎంత మాత్రం ఆమెకు అంగీకారం కాదు. ఎందుకంటే 2009 నుంచి ఆమె ప్రత్తిపాడు నుంచి పోటీ చేస్తూ వచ్చారు. 2019లో అదే నియోజకవర్గంలో నుంచి గెలిచేసరికి జగన్ మంత్రివర్గంలో హోం మంత్రి పదవి అందుకున్నారు. కానీ విస్తరణలో భాగంగా రెండునర ఏళ్ళకే మంత్రి పదవి పోగొట్టుకున్నారు. అయితే తనను మంత్రివర్గం నుంచి తొలగించడం పై అసంతృప్తికి గురయ్యారు. పార్టీకి దూరమవుతారని కూడా ప్రచారం నడిచింది. అయినా సరే పార్టీలో కొనసాగుతూ వచ్చారు. కానీ జగన్మోహన్ రెడ్డి ఆమెను ప్రత్తిపాడు నుంచి తాడికొండ కు మార్చారు. అప్పట్లో కూడా ఆమె అసంతృప్తికి గురైనట్లు వార్తలు వచ్చాయి. అయితే గత 19 నెలల కాలంలో ఆమె యాక్టివ్ గా మారింది తక్కువ. అయితే వైసీపీలో ఉంటే తనకు రాజకీయ భవిష్యత్తు లేదని ఆమె భావిస్తున్నట్లు సమాచారం. అందుకే జనసేనలో చేరేందుకు ఆమె సిద్ధపడుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. సంక్రాంతి తర్వాత ఆమె జనసేన లో చేరడం ఖాయమని టాక్ నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

# ఇచ్ఛాపురం కోసం మాస్టర్ ప్లాన్

శ్రీకాకుళం, జనవరి 19, (భారత శక్తి):

వైసీపీ ఎన్ని రకాలుగా విశ్వ ప్రయత్నాలు చేస్తున్నా..ఇచ్ఛాపురంలో వైసీపీ జెండా ఎగరడం లేదు. అయితే నేతల గ్రూపుల గోలనే దీనికి కారణమంటూ చెప్పుకొస్తారు సిక్కోలు వైసీపీ లీడర్లు. ఇచ్ఛాపురం నుంచి బెందాళం అశోక్ టీడీపీ హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొందుతూ వస్తున్నారు.టీడీపీ ఆవిర్భావం తర్వాత ఇచ్ఛాపురం నియోజకవర్గం ఆ పార్టీకి కంచుకోటగా నిలుస్తోంది. అంతకుముందు కూడా కాంగ్రెసేతర అభ్యర్థులే ఎక్కువగా అక్కడ గెలుస్తూ వచ్చారు. వైసీపీ ఆవిర్భావం తర్వాత కాంగ్రెస్ ఓటు బ్యాంకు వైసీపీవైపు మళ్లింది. కానీ టీడీపీ టీడీపీ ఓటు బ్యాంకు మాత్రం ఆ పార్టీకే ఉంది.ఫ్యాన్ పార్టీ ఆవిర్భావం తర్వాత ఇచ్ఛాపురం నుంచి 2014లో వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన నర్తు రామారావు ఓటమి చెందగా..2019లో పిరియా సాయిరాజ్‌ను పోటీకి దింపింది వైసీపీ. అతను కూడా ఓటమి చెందడంతో 2024 సార్వత్రిక ఎన్నికల ముందు సాయిరాజ్‌ను సమన్వయకర్తగా తప్పించి ఆ బాధ్యతలను ఆయన సతీమణి పిరియా విజయమ్మకు అప్పజెప్పారు. 2024 ఎన్నికల్లో విజయమ్మకి కూడా ఓటమి తప్పలేదు. దీంతో హ్యాట్రిక్ కొట్టారు బెందాళం అశోక్.ఈ సారి ఇచ్ఛాపురంలో ఎలాగైనా పాగా వేయాలని అధినేత జగన్ పట్టుదలతో ఉన్నారని చెప్పుకుంటున్నారు వైసీపీ నేతలు. వచ్చే ఎన్నికల్లో ఇచ్ఛాపురం నుంచే వైసీపీ విజయ ఢంకా మోగించాలని పార్టీ నేతలకు టార్గెట్ ఫిక్స్ చేశారట వైసీపీ పెద్దలు. దానికి అనుగుణంగానే గేమ్ ప్లాన్ మారుస్తున్నారట. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో జనాభా పరంగా రెడ్డిక సామాజిక వర్గంతో పాటు యాదవ, కళింగ, అగ్నికుల క్షత్రియ వర్గాల ఓటర్లు ఎక్కువగా ఉంటున్నారు.

అయితే గత రెండుసార్లు..కళింగ సామాజిక వర్గానికి చెందిన పిరియా సాయిరాజ్ కుటుంబానికే ఎమ్మెల్యే టికెట్ కేటాయించారు జగన్. రెండో సామాజిక వర్గం అయిన యాదవ్‌కు ఎమ్మెల్సీని ఇచ్చారు. అయినప్పటికీ నేతల మధ్య పొసగడం లేదు. గ్రూపు రాజకీయాలు రోజు రోజుకు పెరుగుతూనే ఉన్నాయి..తప్ప తగ్గడం లేదు. దీంతో మరో కొత్త నేతకు అవకాశం ఇచ్చారంటున్నారు అక్కడ క్యాడర్. సీనియర్ నేతలను పక్కన పెట్టి..గత ప్రభుత్వ హయాంలో రెడ్డిక కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేసిన శ్యాంప్రసాద్ రెడ్డికి..ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారంటున్నారు.ఇచ్ఛాపురం వైసీపీ బాధ్యతలు శ్యాంప్రసాద్ రెడ్డికి ఇవ్వడం వెనుక పెద్ద స్కెచ్చే ఉందనే చర్చ జరగుతుంది. సిక్కోలు జిల్లాలో..ఎమ్మెల్యేగా ఉన్న బెందాళం అశోక్ కళింగ సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో గత రెండు సార్లు కూడా కళింగ సామాజిక వర్గానికి చెందిన పిరియా సాయిరాజ్ దంపతులను బరిలో దించింది. అది పెద్దగా వర్కౌట్ అవ్వలేదు.దీంతో నియోజకవర్గంలో అధిక జనాభా కలిగిన రెడ్డిక సామాజికవర్గంపై ఫోకస్ పెట్టిందట వైసీపీ. రెడ్డిక వర్గం డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా ఉండటంతో..ఈ సారి వైసీపీ పెద్దల ప్లాన్ వర్కౌట్ అవుతుందనే అంచనాలున్నాయట. ఇప్పటికే యాదవ సామాజిక వర్గానికి చెందిన కీలక నేత నర్తు రామారావుకి ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టారు.దీంతో రెడ్డిక, కళింగ, యాదవ సామాజిక వర్గాలు తమకి కలిసి వస్తాయన్న లెక్కల్లో వేసుకుంటున్నారట ఫ్యాన్ పార్టీ లీడర్లు. అయితే గ్రూప్ రాజకీయాలకు పెట్టింది పేరుగా ఉన్న ఇచ్ఛాపురం వైసీపీలో శ్యాంప్రసాద్ రెడ్డి ఎలా నెగ్గుకు వస్తారనేది చర్చనీయాంశంగా మారింది. అందరినీ ఒక్కతాటిపైకి తీసుకొస్తే తప్ప విజయం అంత ఈజీ కాదని పొలిటికల్ వర్గాల్లో చర్చ నడుస్తుంది. మరి వైసీపీ కొత్త స్కెచ్ ఎంతవరకు సక్సెస్ అవుతందో చూడాలి మరి.

## ఎదురు కాల్పులలో ఆరుగురు మావోయిస్టులు మృతి

రాయ్ పూర్ జనవరి 19, (భారత శక్తి):

ఛత్తీస్గఢ్లోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసు బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు సమాచారం. నిఘావర్గాల సమాచారం మేరకు, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు సున్నం చంద్రయ్య, పశ్చిమ సబ్ జోనల్ బ్యూరో ఇన్ఛార్జి పాపారావు, నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా ఉన్నారని బలగాలు ఆపరేషన్ చేపట్టాయి.

## చేనులో అగ్ని ప్రమాదం

అదిలాబాద్ జనవరి 19, (భారత శక్తి):

ఆదిలాబాద్ జిల్లా బోరజ్ మండలం తర్నం వద్ద ఆదివారం సాయంత్రం ఓ చేనులో నిల్వ చేసిన 100 ప్లాస్టిక్ పైపులకు అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ పోల్ కింద ఉన్న పైపులకు షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పు అంటుకొని భారీగా మంటలు చెలరేగాయి. స్థానికులు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు

## పెన్నానదిలోకి దూకిన మహిళ

సిద్ధవటం జనవరి 19, పెన్నానదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ సురక్షితంగా ప్రాణాలతో బయటపడింది. మండల కేంద్రమైన సిద్ధవటం హైలెవెల్ వంతెన పైనుండి ఆదివారం సాయంత్రం కడప నగరంలోని ఎర్రముక్కపల్లి గ్రామానికి చెందిన శిరీష అనే మహిళ వంతెనపై నుండి పెన్నానదిలోకి దూకి ఆత్మహత్యానికి పాల్పడింది.

# జేసీ వర్సెస్ కేతిరెడ్డి...



అనంతపురం, జనవరి 19, (భారత శక్తి):

ఎవ్వరికీ భయపడే ముచ్చటే లేదు. ఎట్లైతే గట్లాయె. ఏడికైతే గాడికాయే. బట్ వన్ కండీషన్. నీ ఫ్యామిలీ..నా ఫ్యామిలీనే తేల్చుకుందాం..అంటూ తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి సవాల్ చేశారు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి. రాయలసీమ పౌరుషంపై జేసీ ప్రభాకర్‌రెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరించిన పెద్దారెడ్డి..డేట్ టైం ఫిక్స్ చెయ్ అంటూ..బాలయ్య సినిమాలోని పాపులర్ మాస్ డైలాగ్‌ను రిపీట్ చేశారు.దీంతో తాడిపత్రిలో మళ్లీ రాజకీయ వేడి రాజుకుంటుంది. అటు జేసీ ఫ్యామిలీ ఇటు కేతిరెడ్డి పెద్దారెడ్డి హైవోల్టేజ్ పొలిటికల్ ఫైట్‌కు దిగుతున్నారు. ఇదంతా రాయలసీమ పౌరుషం మీద డిబేట్ అంటున్నారు. నేను రెడీ అంటే నేను రెడీ అంటూ..మీసాలు మెలేస్తున్నారు. లేటెస్ట్‌గా రాయలసీమ పౌరుషంపై తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నానని కేతిరెడ్డి పెద్దారెడ్డి స్పష్టం చేశారు. అంతే కాదు ఎక్కడైనా ఎప్పుడైనా తాను చర్చకు రెడీ అంటూ బిగ్ సౌండ్ చేశారు పెద్దారెడ్డి.తాడిపత్రిని గత మూడు దశాబ్దాలుగా జేసీ ఫ్యామిలీ పాలిస్తే..తాను ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్నానని..రెండు పాలనలపై చర్చకు సిద్ధమంటూ ఛాలెంజ్ చేస్తున్నారు కేతిరెడ్డి. డేట్ టైం మీరే ఫిక్స్ చేయండి అని జేసీ ప్రభాకర్ రెడ్డికే చాన్స్ ఇచ్చారు. అంతేకాదు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తాడిపత్రిలో అయినా లేక రాయలసీమ జిల్లాల్లో ఎక్కడైనా తాను చర్చకు రెడీగా ఉన్నాను అని ప్రతి సవాల్ చేశారు పెద్దారెడ్డి.జేసీ ఫ్యామిలీ పాలనలో మాజీ ఎమ్మెల్యేగా తనకే స్వేచ్ఛగా తిరిగే అవకాశం లేదని పెద్దారెడ్డి అంటున్నారు. తాను నియోజకవర్గంలోకి అడుగు పెట్టకుండా జేసీ ప్రభాకర్‌రెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని పాలిస్తున్నారని ఫైర్ అవుతున్నారు. అలాంటి జేసీ ప్రభాకర్‌రెడ్డి రాయలసీమ పౌరుషం అంటూ తనకు సవాల్ విసరడం మీద తాను పాజిటివ్‌గానే రియాక్ట్ అవుతున్నానని..బహిరంగ చర్చకు తాను ఎప్పుడూ సిద్ధమే అని కేతిరెడ్డి ప్రకటించారు.అయితే ఓపెన్ డిబేట్‌కు ఓ కండీషన్ పెట్టారు పెద్దారెడ్డి. బహిరంగ చర్చకు జేసీ కుటుంబం, తన కుటుంబం మాత్రమే హాజరు కావాలని పెద్దారెడ్డి షరతు పెట్టారు. రెండు కుటుంబాల సమక్షంలోనే ఎవరి పాలన ఎలా ఉందనేది తేల్చుకుందామని అంటున్నారు. తాను ఎవరికీ దేనికీ భయపడేవాడిని కానని అంటున్న పెద్దారెడ్డి..దేఖ్ లేంగే అంటూ సవాల్ విసిరారు.గత కొన్ని రోజులుగా తాడిపత్రి చాలా సెన్సిటివ్ ఏరియాగా మారిపోయింది.

ఎన్నికల రిజల్ట్ తర్వాత..అక్కడ రాజకీయ వేడి ఇంకా రాజుకుంది. ఆ తర్వాత కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి రాకుండా పోలీసులు అడ్డుకోవడం..మరింత రచ్చకు దారితీసింది. ఈ క్రమంలోనే కోర్టుకెళ్లి ఆర్డర్స్ తెచ్చుకుని పోలీస్ బలగాల మధ్య పెద్దారెడ్డి తాడిపత్రిలోకి ఎంట్రీ ఇవ్వడం ఇంకా హాట్ టాపిక్ అయింది.ఇక అప్పటి నుంచి జేసీ ఎబ పెద్దారెడ్డి అన్నట్లుగా..సినిమాలో క్లైమాక్స్ రేంజ్‌లో పాలిటిక్స్ హీటెక్కుతున్నాయి. ఇద్దరు నేతలు సవాళ్లు, ప్రతి సవాళ్లు చేసుకోవడంతో తాడిపత్రి ఫైట్ నెక్ట్స్ లెవల్‌కు చేరుకుంటుంది. పెద్దారెడ్డి కామెంట్స్‌పై జేసీ ఎలా రియాక్ట్ అవుతారో.? బిగ్ డిబేట్‌కు సిద్ధపడుతారో.? లేక డైలాగ్‌వార్‌కే పరిమితం అవుతారో చూడాలి మరి.

# పట్టు కోల్పోతున్నారా...

కడప, జనవరి 19,(భారత శక్తి):

పులివెందుల అంటేనే ఒకప్పుడు వైఎస్ కుటుంబానికి అడ్డా అనే మాట రాజకీయాల్లో బలంగా వినిపించేది. వరుస విజయాలతో ఈ నియోజకవర్గం వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కి అత్యంత బలమైన కంచుకోటగా నిలిచింది. అయితే రాజకీయాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. కాలం మారితే పరిస్థితులు కూడా మారతాయన్న మాట ఇప్పుడు పులివెందులలో స్పష్టంగా కనిపిస్తోంది. తాజాగా తెలుగుదేశం పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండటంతో ఇక్కడి రాజకీయ వాతావరణం పూర్తిగా మారుతున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఇటీవలి కాలంలో పులివెందుల నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు గణనీయంగా పెరిగాయి. ఒకప్పుడు జగన్‌తో కలిసి నడిచిన నాయకులే ఇప్పుడు పార్టీకి దూరమవుతున్నారు. గత జెడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలవడం ఈ మార్పులకు ఆరంభంగా మారింది. ఆ తర్వాత దశలవారీగా పలువురు ముఖ్య నేతలు టీడీపీ వైపు చూస్తున్నారు. బయటకు పెద్దగా హడావుడి లేకపోయినా, చాపకింద నీరు మాదిరిగా టీడీపీ ప్రభావం గ్రామగ్రామానికీ విస్తరిస్తోందనే అభిప్రాయం వినిపిస్తోంది. ప్రత్యామ్నాయంగా బలమైన పార్టీగా టీడీపీ మాత్రమే కనిపిస్తుండటం కూడా ఈ వలసలకు కారణమని చెబుతున్నారు. ఇతర పార్టీల ప్రభావం పెద్దగా లేకపోవడంతో అసంతృప్త నేతలు సూటిగా టీడీపీ గూటికే చేరుతున్నారు. ఈ క్రమంలో వేంపల్లి ప్రాంతానికి చెందిన వైసీపీ నేత, జగన్‌కు సన్నిహితుడిగా పేరున్న చంద్రశేఖర్ రెడ్డి టీడీపీ కండువా కప్పుకోవడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఆయనతో పాటు వందలాది మంది కార్యకర్తలు కూడా సైకిల్ పార్టీ వైపు అడుగులు వేయడం వైసీపీకి షాక్‌లా మారింది. ఒకప్పుడు జగన్ కోసం ప్రాణం ఇస్తామని చెప్పిన నేతలు కూడా పార్టీని వీడటం వైసీపీ పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోంది. ఇదే సమయంలో టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి చేసిన ప్రకటనలు కూడా కీలకంగా మారాయి. కొత్తగా వచ్చే వారికి పార్టీ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, ఎవరినీ బలవంతంగా రప్పించబోమని, కానీ స్వచ్ఛందంగా వస్తే మాత్రం ఆహ్వానిస్తామని ఆయన స్పష్టం చేశారు. దీంతో అసంతృప్త వైసీపీ నేతలు టీడీపీ వైపు చూస్తున్నారని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఇక ఓటు బ్యాంకు విషయంలోనూ మార్పు సంకేతాలు కనిపిస్తున్నాయని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఒకప్పుడు ప్రతి ఇంట్లో వైసీపీ మాట వినిపించేదని, ఇప్పుడు ఆ స్థాయి ఉత్సాహం కనిపించడం లేదని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పులివెందులలో సమర్థంగా అమలవుతున్నప్పటికీ, ప్రజల్లో రాజకీయ అభిరుచులు మారుతున్నాయన్న భావన బలపడుతోంది. రాబోయే మునిసిపల్ ఎన్నికల నాటికి ఈ ప్రభావం మరింత స్పష్టంగా బయటపడే అవకాశముందని అంచనా వేస్తున్నారు. మొత్తం మీద వైఎస్ జగన్‌కు బలంగా నిలిచిన పులివెందుల రాజకీయంగా క్రమంగా డైల్యూట్ అవుతోందన్న చర్చ ఇప్పుడు జోరుగా సాగుతోంది.

# కోట్ల ఫ్యామిలీ దూరమేనా

కర్నూలు, జనవరి 19, (భారత శక్తి):

టీడీపీ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి పార్టీ అధినాయకత్వంపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఆయన గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారు. పార్టీ అధినాయకత్వాన్ని కలిసే ప్రయత్నం కూడా కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి చేయడం లేదట. దీంతో డోన్ నియోజకవర్గంలో మాత్రమే కాదు కర్నూలు జిల్లాలో కోట్ల మౌనంపై అనేక ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి. మాజీ ముఖ్యమంత్రి కుమారుడు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ముందు వరకూ యాక్టివ్ గా తిరిగిన ఆయన ఎమ్మెల్యే అయిన తర్వాత మాత్రం పూర్తిగా నిరాశలో మునిగిపోయారు. కర్నూలు జిల్లాలో కోట్ల కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. అదే సమయంలో కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యుడిగా ఒక వెలుగు వెలిగారు.

..2024 ఎన్నికలకు ముందు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి తన కుటుంబంతో కలసి టీడీపీలో చేరారు. తన తండ్రి సుదీర్ఘకాలం కొనసాగిన కాంగ్రెస్ పార్టీని వదిలేసి ఆయన టీడీపీ కండువా కప్పుకున్నారు. రాష్ట్ర విభజనకు కారణమైన కాంగ్రెస్ కు రాష్ట్రంలో పుట్టగతులు లేవని భావించిన ఆయన ఆ నిర్ణయం తీసుకున్నారని అంటారు. వైసీపీలోకి వెళ్లడం ఇష్టంలేక టీడీపీలోకివచ్చారు. కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి రాకతో కర్నూలు జిల్లాలో టీడీపీకి అదనపు బలం చేకూరినట్లయింది. అయితే దే సమయంలో తనకు శత్రువుగా భావించే కేఈ కృష్ణమూర్తి కూడా రాజకీయంగా రిటైర్ అయ్యారు. కానీ కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి మాత్రం ఎమ్మెల్యే సీటును అయిష్టంగానే తీసుకున్నారు.

గెలిచిన తర్వాత మంత్రి పదవి వస్తుందని ఆశిస్తే, తన రాజకీయ అనుభవమంత వయస్సు లేని టీజీ భరత్, బీసీ జనార్ధన్ రెడ్డి మంత్రి కావడం ఆయనను కుదురునివ్వకుండా చేస్తుందంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి తాను కూడా రాజకీయంగా వైదొలగాలని కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి నిర్ణయించుకున్నట్లు సమాచారం. అవసరమైతే తన సతీమణిని రాజకీయాల్లో కొనసాగించాలని, తాను మాత్రం రాజకీయాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు ఆయన సన్నిహితుల వద్ద పదే పదే ప్రస్తావిస్తున్నారట. తాను ఇక ఏ ఎన్నికల్లో పోటీ చేయబోనని కుటుంబంలోని ముఖ్యులతో పాటు సన్నిహితులకు కూడా కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి చెబుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం డోన్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్నా అక్కడికే పరిమితమయిన కోట్ల ఇక రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదంటున్నారు. రాజకీయాలు ఇక తనకు పనికి రావని కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి సన్నిహితుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట. మరి కోట్ల నిర్ణయం ఎలా ఉంటుందన్నది చూడాలి.

# ఏపీలో సర్ ప్రక్రియ..

విజయవాడ, జనవరి 19, (భారత శక్తి):

ఆంధ్రప్రదేశ్ లో ఈ ఏడాది ఏప్రిల్?మే మధ్యలో ఓటర్ల సమగ్ర సర్వే నిర్వహించేందుకు ఎన్నికల యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ ప్రక్రియ ద్వారా 2004 నుంచి ఇప్పటివరకు ఉన్న ఓటర్ల జాబితాలను పూర్తిగా సవరించనున్నారు. మరణించిన వారు, వలస వెళ్లిన వారు, చిరునామా మార్చుకున్న వారి పేర్లను జాబితాల నుంచి తొలగించడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశ్యం. అయితే ఈ ఓటర్ల జాబితాల సవరణ వ్యవహారం దేశవ్యాప్తంగా ఇప్పటికే పెద్ద చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. అధికార పార్టీలకు అనుకూలంగా ఉన్న ఓట్లు కొనసాగిస్తూ, వ్యతిరేక పార్టీలకు చెందిన ఓట్లను తొలగిస్తున్నారన్న ఆరోపణలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఈ విమర్శలు ఉన్నప్పటికీ కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను కొనసాగిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ సర్వేను ఏప్రిల్ నుంచి ప్రారంభించి కేవలం 60 రోజుల వ్యవధిలో పూర్తిచేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నిర్ణయాన్ని భారతీయ జనతా పార్టీ), తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నేతలు స్వాగతిస్తున్నారు. ఓటర్ల జాబితాలు శుద్ధిగా ఉండాలంటే ఈ తరహా సర్వే అవసరమేనని వారు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ అంశంపై వైసీపీ తీవ్ర సందేహాలు వ్యక్తం చేస్తోంది. గత ఎన్నికల అనంతరం ఈవీఎంల అనుమానాలు వ్యక్తం చేసిన పార్టీ, ఇప్పుడు ఎన్నికల సంఘం పనితీరుపై కూడా ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ సర్ ప్రక్రియ తమ పార్టీకి నష్టం కలిగించేలా ఉండొచ్చన్న ఆందోళన వైసీపీ నేతల్లో కనిపిస్తోంది. పారదర్శకంగా ఈ సర్వే నిర్వహించకపోతే న్యాయపోరాటానికి వెళ్తామంటూ పలువురు నేతలు టీవీ చర్చల్లో హెచ్చరికలు కూడా చేస్తున్నారు. అయితే ఇప్పటికే ఇతర రాష్ట్రాల నుంచి ఈ అంశంపై పలు పిటిషన్లు సుప్రీంకోర్టు లో పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ఎన్నికల సంఘం మాత్రం తన విధానాన్ని అమలు చేస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో వైసీపీ చేపట్టే న్యాయపోరాటం కోర్టుల వరకే పరిమితమయ్యే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఈ ప్రక్రియను ఆపడం అంత సులభం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాజకీయంగా మరో కీలక చర్చ కూడా తెరపైకి వచ్చింది. సర్ ప్రక్రియ ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్న వాదన వినిపిస్తోంది. తమిళనాడు లో కొనసాగుతున్న సర్వేలో దాదాపు కోటి మంది ఓటర్లను జాబితాల నుంచి తొలగించినట్లు సమాచారం. అలాగే బీహార్ లో గతంలోనే సుమారు 64 లక్షల ఓట్లు తొలగించారన్న గణాంకాలు బయటకు వచ్చాయి. ఈ ఉదాహరణలను చూస్తే, ఆంధ్రప్రదేశ్‌లో ఎంతమంది ఓటర్లు తొలగించబడతారన్నది ఆసక్తికరంగా మారింది. ఇలా జరిగితే అది వైసీపీకి భారీ రాజకీయ నష్టాన్ని తెచ్చిపెట్టే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలే బహిరంగంగా అంగీకరిస్తున్నారు. ముఖ్యంగా తమకు బలంగా ఉన్న ఓటు బ్యాంక్‌పై ఈ సర్వే ప్రభావం పడుతుందన్న భయం కనిపిస్తోంది. మొత్తంగా చూస్తే, ఓటర్ల సర్వే ప్రక్రియ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో రానున్న రోజుల్లో మరింత వేడి పెంచే అంశంగా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# టీడీపీలో ఏం జరుగుతోంది...

విజయవాడ, జనవరి 19, (భారత శక్తి):

ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలని చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారు. కానీ ఆయన శ్రమను ప్రజలు గుర్తిస్తున్నారు కానీ ఎమ్మెల్యేలు మాత్రం గుర్తించడం లేదు. ఎక్కువ మంది శాసనసభ్యులు తరచూ వివాదాల్లో చిక్కుకుంటున్నారు. పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా మారారు. ఎమ్మెల్యేల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటూ హెచ్చరికలు చేస్తున్నప్పటికీ వారి వ్యవహార శైలిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేలు నిజంగా దోపిడీకి దిగుతున్నారన్న విమర్శలు సొంత పార్టీ కార్యకర్తల నుంచే వినిపిస్తున్నాయి. గతంలో ప్రధాన మీడియా ద్వారా వచ్చే విమర్శలు.. ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా వస్తున్నాయి. ఇటీవల మంగళగిరి కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి అందిన నివేదిక మేరకు దాదాపు 48 మంది ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేదని, ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదని స్పష్టం చేసింది. అయితే వారిని చంద్రబాబు హెచ్చరించినట్లుగా వార్తలు వచ్చినప్పటికీ ఎమ్మెల్యే పనితీరు మాత్రం గాడిన పడలేదన్నది వాస్తవం. ఎందుకంటే ప్రతి పనికీ పర్సంటేజీలు. ప్రతి కార్యక్రమంలో అవినీతి. సొంత పార్టీ నేతలను కూడా వారు వదలకుండా దోపిడీకి తెరతీస్తున్నారన్న విమర్శలున్నాయి. చంద్రబాబు చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్ల, లోకేశ్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఎమ్మెల్యేలు కొందరు నిర్భీతిగా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ప్రచారం పార్టీలోనే జరుగుతుంది. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని చిన్నిల మధ్య తలెత్తిన వివాదంలోనూ ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొలికపూడి శ్రీనివాసరావు ఎంపీపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. అయినా సరే ఆయనను పిలిచి మందలించిన సందర్భం లేదు. అలాగే అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్ ప్రసాద్ విషయంలో కానీ, ఉత్తరాంధ్ర జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేల పనితీరుపై అక్కడి కార్యకర్తలే నేరుగా ఆరోపణలు చేస్తున్నారు. అయినా పార్టీ నాయకత్వం పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఎమ్మెల్యేల పనితీరుతో పార్టీ బాగా డ్యామేజీ అయింది. ఇక రానున్న కాలంలో ఇలాంటి మెతక వైఖరిని అవలంబిస్తే మాత్రం ఖచ్చితంగా వచ్చే ఎన్నికల్లో టీడీపీ కి నష్టం తప్పదన్న సంకేతాలు ఆ పార్టీ కార్యకర్తల నుంచే వినిపిస్తున్నాయి.

## తిరుపతిలో వైసీపీ నాయకులపై కేసు నమోదు

తిరుపతి జనవరి 19, (భారత శక్తి):

తిరుపతి జిల్లా వైసీపీ నాయకులపై కేసు నమోదైంది. మాజీ సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజున మేకను బలిచ్చారని సర్పంచ్ గిరిని కేవిబి పురం పోలీసులు అరెస్ట్ చేశారు. గిరిపై అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు. శనివారం గిరిని అరెస్టు చేసేందుకు వచ్చిన పోలీసులను గ్రామస్తులు, వైసీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. రాత్రి శ్రీకాళహస్తి కోర్టులో హాజరు పరచగా.. రిమాండ్ను శ్రీకాళహస్తి కోర్టు జడ్జి తిరస్కరించారు. దాంతో బెయిల్పై విడుదల చేశారు.

## వినుకొండ:నిద్రిస్తున్న వ్యక్తి పై కత్తితో దాడి

వినుకొండ జనవరి 19, (భారత శక్తి):

వినుకొండలో ఆదివారం దారుణ ఘటన చోటుచేసుకుంది. డిగ్రీ కళాశాల సమీపంలోని పద్మావతి నగర్లో నివసిస్తున్న ఉలవలపూడి రవికిరణ్ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో తెల్లవారుజామున గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు దిండుతో ముఖం నొక్కి, కత్తితో దాడి చేశారు. కేకలు వేయడంతో వారు పారిపోయారు.

# బౌల్ ఆఫ్ అన్నపూర్ణ ట్యాగ్ మిస్..

విజయవాడ, జనవరి 19, (భారత శక్తి):

సంక్రాంతి పండుగ వేళ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేష్ గారు సోషల్ మీడియా వేదికగా విశ్లేషించారు. ఒకప్పుడు భారతదేశానికే అన్నపూర్ణగా నిలిచిన ఆంధ్రప్రదేశ్, నేడు వరి ఉత్పత్తిలో పొరుగు రాష్ట్రం తెలంగాణ కంటే వెనుకబడిపోవడంపై ఆయన గణాంకాలతో సహా ఆత్మపరిశీలన చేయాలని కోరారు.

పదేళ్లలో తలకిందులైన లెక్కలు

గత దశాబ్ద కాలంలో వరి ఉత్పత్తిలో రెండు రాష్ట్రాల మధ్య వ్యత్యాసం భారీగా పెరిగిందని పీవీ రమేష్ గారు ఎత్తి చూపారు. 2015లో: ఆంధ్రప్రదేశ్ 74.9 లక్షల టన్నుల ఉత్పత్తితో అగ్రస్థానంలో ఉండగా, తెలంగాణ ఉత్పత్తి కేవలం 30.5 లక్షల టన్నులు మాత్రమే ఉండేది.

2025లో: పదేళ్ల తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆంధ్రప్రదేశ్ ఉత్పత్తి 73.4 లక్షల టన్నులకు స్వల్పంగా తగ్గగా, తెలంగాణ ఉత్పత్తి 168.8 లక్షల టన్నులకు పెరిగింది.

తెలంగాణ దూకుడు.. ఏపీ స్తబ్దత

పదేళ్ల క్రితం ఏపీ కంటే సగం లోపు ఉత్పత్తి ఉన్న తెలంగాణ, నేడు ఐదు రెట్లు వృద్ధి సాధించి దేశానికే ధాన్యాగారంగా ఎదిగిందని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో ఏపీలో స్వల్ప క్షీణత నమోదు కావడం విచారకరమని, ఇది రైతుల శ్రమ లోపం కాదని, ప్రభుత్వాల విధానపరమైన నిర్ణయాల లోపమని ఆయన విశ్లేషించారు. తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు, పక్కా ప్రణాళికలు ఆ రాష్ట్రాన్ని ముందుకు నడిపితే, ఏపీలో నాయకత్వ పటిమ, అమలులో వేగం తగ్గడం ఈ స్థితికి కారణమని పేర్కొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకు ముప్పు

ఆంధ్రప్రదేశ్ లో వ్యవసాయ రంగం వాటా 30 శాతానికి పైగా ఉండటంతో పాటు, 50 శాతానికి పైగా ప్రజలకు ఇదే జీవనాధారమని, ఇంతటి కీలక రంగం కునారిల్లడం రాష్ట్ర భవిష్యత్తుకే ముప్పు అని ఆయన హెచ్చరించారు. కేవలం నినాదాలతో సరిపెట్టకుండా, ఈ సంక్రాంతికి నూతన సంకల్పంతో ఏపీ తన సముచిత స్థానాన్ని తిరిగి దక్కించుకోవాలని పిలుపునిచ్చారు.

# పాపం... శీనన్న

విశాఖపట్టణం, జనవరి 19, (భారత శక్తి):



విశాఖకు చెందిన మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ ఎక్కడ ఉన్నారన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. ఆయన వైసీపీకి రాజీనామా చేసి ప్రస్తుతం తన వ్యాపారాలను చూసుకుంటున్నారని మాత్రం చెబుతున్నారు. రాజకీయాలకు మాత్రం దూరంగా ఉంటున్నారు. రాజకీయాల్లోకి వేగంగా దూసుకు వచ్చి పార్లమెంటు సభ్యుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా అయిన అవంతి శ్రీనివాస్ అంతే స్పీడ్ తో రాజకీయాల నుంచి బ్రేక్ ఇవ్వడంపై చర్చ జరుగుతంది. వైసీపీకి మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ పార్టీకి రాజీనామా చేసిన తర్వాత ప్రస్తుతం రాజకీయంగా ఖాళీగానే ఉన్నారు. ఆయన తన విద్యాసంస్థలను చూసుకోవడానికే పరిమితయ్యారు. అయితే ఆయన వైసీపీకి రాజీనామా చేసి నెలలు గడుస్తున్నా ఏ పార్టీలో చేరలేదు. ఆయన పార్టీలో చేరాలనుకున్నప్పటికీ ఇప్పటికే విశాఖ ప్రాంతంలో అధికార పార్టీలో నేతలు ఎక్కువ కావడంతో పాటు ఆయనను చేర్చుకుంటే లేనిపోని తలనొప్పులు వస్తాయని భావించి ఏ పార్టీ కూడా ఆయనను దరిచేరనివ్వకపోవడంతోనే సమయం కోసం వెయిట్ చేస్తున్నారంటున్నారు. ఆర్థికంగా, సామాజికవర్గ పరంగా బలమైన నేతగా ఉన్న అవంతి శ్రీనివాస్ జనసేనలో చేరాలనుకున్నప్పటికీ అక్కడ ఎంట్రీ దొరకలేదు. ఇక టీడీపీ నుంచి వైసీపీలోకి వెళ్లడంతో ఆయనను చేర్చుకోవడంపై స్థానిక టీడీపీ నాయకత్వం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అందుకే అవంతి శ్రీనివాస్ ఇప్పుడు మన టైం బాగాలేదని భావించి రాజకీయాలకు దూరంగా ఉన్నారంటున్నారు. విశాఖ కార్పొరేటర్ గా ఉన్న తన కుమార్తె ను కూడా వైసీపీ మేయర్ పై అవిశ్వాసం తీర్మానం సందర్భంగా రాజీనామా చేయించారు. అయినా సరే అవంతి శ్రీనివాస్ ను మాత్రం ఎవరూ నమ్మడం లేదు. ఆయన మళ్లీ తమ పార్టీలోకి వస్తే రాజకీయంగా ఇబ్బందులే తప్ప అనవసరమన్న అభిప్రాయానికి వచ్చినట్లుంది.. వైసీపీకి రాజీనామా చేసిన తర్వాత అవంతి శ్రీనివాస్ జనసేనలో చేరేందుకు ప్రయత్నించారట. అయితే అక్కడ నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదని తెలిసింది. అవంతి శ్రీనివాస్ చేరికకు విశాఖ జనసేన నేతలతో పాటు రాష్ట్ర స్థాయి నేతలు కూడా అభ్యంతరం తెలిపారు. దీంతో ఆయన చేరికకు రెడ్ సిగ్నల్ పడటంతో ఇక అవంతి శ్రీనివాస్ ఖాళీగానే కూర్చున్నారు. సమయం వచ్చినప్పుడు వారే పిలుస్తారులే అన్న ధీమాతో ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కాకపోయినా మళ్లీ పార్లమెంటు సభ్యుడిగానైనా పోటీకి అవకాశం దక్కుతుందని ఆయన భావిస్తున్నారు. మరి చూడాలి ఏం జరుగుతుందో?

# ఫిరాయింపు ఎమ్మెల్యేల రివర్స్ ఫిరాయింపులు

హైదరాబాద్, జనవరి 19, (భారత శక్తి):

తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇందులో మెజారిటీ ఎమ్మెల్యేలు తాము ఇప్పటికీ బీఆర్ఎస్ సభ్యులమేనని స్పీకర్‌కు నివేదించడం, చట్టపరమైన చిక్కుల నుంచి తప్పించుకోవడానికే కాకుండా, క్షేత్రస్థాయిలో మారుతున్న రాజకీయ సమీకరణాలకు కూడా అద్దం పడుతోంది. కేవలం సాంకేతికంగానే కాకుండా, రాజకీయంగా కూడా వీరు కాంగ్రెస్ వైఖరితో విసిగిపోయి మళ్లీ సొంత గూటికి చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కాంగ్రెస్‌లో చేరడం తాను చేసిన ఒక తప్పటడుగు అని ఆయన బహిరంగంగానే పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తన నియోజకవర్గానికి గానీ, వ్యక్తిగతంగా తనకు గానీ కనీసం వెంట్రుక వాసి కూడా ప్రయోజనం కలగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మూడుసార్లు తనను ఎమ్మెల్యేగా గెలిపించిన గులాబీ జెండా పట్ల కృతజ్ఞతగా ఉండాలని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులనే గెలిపించాలని ఆయన తన అనుచరులకు పిలుపునివ్వడం రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. మరోవైపు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కూడా ఇదే తరహా ధోరణిని ప్రదర్శిస్తున్నారు. గతంలోనే ఆయన కాంగ్రెస్‌లో చేరిన కొద్ది రోజులకే తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరినట్లుగా ప్రచారం చేయించుకున్నారు. తాను ఎప్పుడూ బీఆర్ఎస్‌ను వీడలేదని, కేవలం అభివృద్ధి పనుల నిమిత్తమే ముఖ్యమంత్రిని కలిశానని ఆయన స్పష్టం చేస్తున్నారు. స్పీకర్ ముందు కూడా తాము పార్టీ మారలేదని వాదించడం ద్వారా, అనర్హత వేటు నుంచి తప్పించుకోవడమే కాకుండా, కాంగ్రెస్ పార్టీలో తమకు దక్కుతున్న ప్రాధాన్యతపై అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలు మళ్లీ బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారనేది స్పష్టమవుతోంది. ఈ పరిణామాలు అధికార కాంగ్రెస్ పార్టీకి మింగుడుపడని అంశాలుగా మారాయి.

# ఇక ఇండియాలనే రాఫెల్స్..

ముంబై జనవరి 19, (భారత శక్తి):

భారత్ మరోసారి ఫ్రాన్స్‌తో రక్షణ ఒప్పందం కుదుర్చుకునే దిశగా అడుగులు వేస్తోంది. రక్షణ మంత్రిత్వ శాఖ మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం కింద భారత వైమానిక దళం కోసం 114 రాఫెల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల తయారీకి ఆమోదం తెలిపింది. దాదాపు రూ. 3.24 లక్షల కోట్ల అంచనా వ్యయంతో




కూడిన ఈ ఒప్పందం ప్రపంచంలోనే అతిపెద్ద ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ ఒప్పందాలలో ఒకటిగా నిలవనుంది. ఈ క్రమంలో రాఫెల్ ఫైటర్ జెట్‌లు భారతదేశంలో తయారైతే, వాటిని ఇతర దేశాలకు విక్రయించవచ్చుతాజా నివేదికల ప్రకారం, ఫ్రాన్స్‌లోని డసాల్ట్ ఏవియేషన్ తర్వాత రాఫెల్ ఫైటర్ జెట్‌ల కోసం భారత్‌ను రెండవ గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చాలని భావిస్తోంది. అంటే, భారతదేశంలో తయారు చేసే ఫైటర్ జెట్స్ భారత వైమానిక దళం అవసరాలకు మాత్రమే పరిమితం కావు. ఇక్కడ తయారు చేసిన యుద్ధ విమానాలను అంతర్జాతీయ ఎగుమతి ఆర్డర్‌లను పూర్తి చేయడానికి కూడా ఉపయోగించవచ్చు.మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లోని ఓఎఁఉంఔ ప్రత్యేక ఆర్థిక జోన్ (ాఇఇ)లో ప్రత్యేక రాఫెల్ ఫైనల్ అసెంబ్లీ లైన్ ఏర్పాటు చేయనుంది. ఈ సౌకర్యం సంవత్సరానికి 24 ఫైటర్ జెట్‌లను తయారు చేస్తుందని ప్రస్తుతానికి భావిస్తున్నారు. పూర్తి యుద్ధ విమానాల ఎగుమతిలో నియంత్రణ లేదా దౌత్యపరమైన అడ్డంకులు ఎదురైనా భారతదేశం నిర్వహణ, మరమ్మత్తు, ఓవరాల్ ఎగుమతుల ద్వారా ప్రయోజనం పొందనుంది. రాఫెల్ ఫైటర్ జెట్స్ ఉపయోగించే దేశాలకు భారతదేశం ప్రాంతీయ ఓఖీ హబ్‌గా అభివృద్ధి కానుంది. భారతదేశంలో రాఫెల్ ఫైటర్ జెట్‌లను తయారు చేయడంలో అతిపెద్ద ప్రయోజనం స్వదేశీ ఆయుధాలు, మన వ్యవస్థలను అనుసంధానం చేయడం. భారతదేశంలో తయారు చేసిన రాఫెల్‌లో భారత క్షిపణులు, అంటే ఎక్స్‌ట్రా బియాండ్ విజువల్ రేంజ్ ఎయిర్ టు ఎయిర్ మిసైల్స్ వంటివి అమర్చుతారు. ఇది ఒక ప్రత్యేకమైన ఇండియన్ రాఫెల్ వేరియంట్‌ను సృష్టిస్తుంది. రాఫెల్ ఫైటర్ జెట్ ప్రధాన మేధో సంపత్తి హక్కులు ఫ్రాన్స్ వద్దే ఉంటాయని మీకు తెలుసా. మేక్ ఇన్ ఇండియా ఫ్రేమ్‌వర్క్ కింద భారత రాఫెల్ ప్రోగ్రామ్‌లో దాదాపు 60% స్వదేశీకరణను ఆశిస్తున్నారు. ఈ చర్య తరువాత, రాఫెల్ తయారీ భారతదేశాన్ని ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను ఎగుమతి చేసే దేశాల ఎలైట్ క్లబ్‌లో చేర్చుతుందని కేంద్రం ప్లాన్ చేసింది. ఇది భారతదేశ రక్షణ దౌత్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది, వేలాది మందికి ఉపాధిని కూడా అందిస్తుంది.

# 10 అంతస్థులు దాటితే అంతే

హైదరాబాద్, జనవరి 19, (భారత శక్తి):

హైదరాబాద్ నగరాభివృద్ధి దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రియల్ ఎస్టేట్ రంగాన్ని నేరుగా ప్రభావితం చేసేలా టీడీఆర్ విధానంలో కీలక మార్పులు చేస్తూ పురపాలక శాఖ జీవో నెం. 16ను విడుదల చేసింది. చెరువులు, నదుల పరిరక్షణతో పాటు భూసేకరణను వేగవంతం చేయడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సవరించిన నిబంధనలు ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరించిన తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో అమలులోకి రానున్నాయి. ఈ పరిధిలోని 300 డివిజన్లలో ఇకపై జరిగే నిర్మాణాలు కొత్త టీడీఆర్ నిబంధనలకు లోబడి ఉండాల్సి ఉంటుంది. నగరంలో హైరిస్ భవనాల నిర్మాణాన్ని నియంత్రించేలా ప్రభుత్వం కీలక షరతును విధించింది. ఇకపై 10 అంతస్తులు దాటే ప్రతి భవనానికి టీడీఆర్ తప్పనిసరి కానుంది. 11వ అంతస్తు నుంచి పై అంతస్తుల వరకు నిర్మించే మొత్తం విస్తీర్ణంలో 10 శాతానికి సమానమైన టీడీఆర్ సర్టిఫికెట్లు బిల్డర్లు సమర్పించాల్సి ఉంటుంది. దీంతో ఇప్పటివరకు మార్కెట్‌లో వినియోగం లేక నిల్వగా ఉన్న టీడీఆర్ బాండ్లకు డిమాండ్ పెరగనుంది. భూమిని ప్రభుత్వానికి ఉచితంగా అప్పగించే బిల్డర్లకు ప్రత్యేక రాయితీలు కూడా ఈ జీవోలో పొందుపరిచారు. సెట్‌బ్యాక్ నిబంధనల్లో, భవన ఎత్తు పరిమితుల్లో సడలింపులు కల్పిస్తూ వారిని ప్రోత్సహించనున్నారు. దీని ద్వారా భూసేకరణ ప్రక్రియ సులభతరం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. చెరువులు, నదుల పరిరక్షణకు సంబంధించి భూముల స్వాధీనంపై కూడా ప్రభుత్వం ఆకర్షణీయమైన విధానాన్ని ప్రకటించింది. ఎఫ్‌టీఎల్ పూర్తిస్థాయి నీటి మట్టం పరిధిలో ఉన్న పట్టా భూములకు 200 శాతం టీడీఆర్, చెరువుల బఫర్ జోన్లలో ఉన్న భూములకు 300 శాతం టీడీఆర్, బఫర్ వెలుపల అభివృద్ధి పనుల కోసం భూములు సేకరిస్తే 400 శాతం టీడీఆర్ ఇవ్వాలని నిర్ణయించింది. ఒక ఎకరాకు మించి భూసేకరణ జరిగితే ఆ ప్రతిపాదనను ప్రభుత్వం నేరుగా పరిశీలించనుంది.



మూసీ నది పరీవాహక ప్రాంతం, నగరంలోని చెరువుల సుందరీకరణ పనులకు భూ యజమానుల నుంచి ఎదురవుతున్న అడ్డంకులను తొలగించడమే ఈ విధాన మార్పుల లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. గతంలో ప్రభుత్వం జారీ చేసిన దాదాపు 10 వేల కోట్ల రూపాయల విలువైన టీడీఆర్ సర్టిఫికెట్లు మార్కెట్‌లో పేరుకుపోయి వాటి ధర గణనీయంగా పడిపోయింది. దీంతో భూ యజమానులు టీడీఆర్‌కు బదులుగా నగదు పరిహారం కోరుతూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. ఇప్పుడు పెద్ద భవనాల నిర్మాణానికి టీడీఆర్ తప్పనిసరి చేయడంతో బిల్డర్లు వాటిని కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీంతో టీడీఆర్ మార్కెట్ మళ్లీ కదలికలోకి రావడంతో పాటు, ప్రభుత్వంపై నగదు పరిహారం భారం తగ్గనుంది. ఫలితంగా నిధుల కొరతతో నిలిచిపోయిన రోడ్ల విస్తరణ పనులు, మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులు వేగం అందుకునే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# క్రిషాంక్‌కు కలిసి రాని కాలం

హైదరాబాద్, జనవరి 19,(భారత శక్తి):


భారత రాష్ట్ర సమితి రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని చలాయించింది. రెండు పర్యాయాలు కూడా ప్రతిపక్షాన్ని తొక్కి అవతలపడేసింది. ఇతర పార్టీల్లో ఉన్న ఎమ్మెల్యేలను ఆపరేషన్ ఆకర్ష్ ద్వారా చేర్చుకుంది. 2023లో మాత్రం భారత రాష్ట్ర సమితి పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో వ్యతిరేకమైన ఫలితం వచ్చింది. హ్యాట్రిక్ సాధించాలని కలలు గన్న గులాబీ పార్టీకి చుక్కెదురైంది.ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉంది గులాబీ పార్టీ. పార్టీ అధికారం లేకపోయినప్పటికీ.. సోషల్ మీడియా మాత్రం బలంగా ఉంది. గులాబీ పార్టీ సోషల్ మీడియాను ఈ స్థాయిలో బలోపేతం చేసిన వ్యక్తుల్లో క్రిషాంక్ కచ్చితంగా ఉంటారు. ఈయన కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అల్లుడు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిగా తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. అనేక పర్యాయాలు జైలుకు కూడా వెళ్లి వచ్చారు. గులాబీ పార్టీకి కీలకమైన సమాచారం అందించడంలో ఈయన దిట్ట అని చెబుతుంటారు. క్రిషాంక్ కంటోన్మెంట్ ప్రాంతం నుంచి ఎమ్మెల్యేగా గెలవాలని భావిస్తున్నారు. 2023లో టికెట్ లభిస్తుందని అనుకున్నప్పటికీ అవకాశం రాలేదు. అప్పుడు గులాబీ పార్టీ సాయన్న కుమార్తెకు అవకాశం ఇచ్చింది. సాయన్న కుమార్తె చనిపోవడంతో.. మళ్లీ క్రిషాంక్ కు టికెట్ ఇస్తారని ప్రచారం జరిగింది. కానీ, ఈసారి కూడా రిక్త హస్తమే మిగిలింది. దీంతో క్రిషాంక్ ఎమ్మెల్యే ఆశలు నెరవేరలేదు.ప్రస్తుతం గులాబీ పార్టీలో సోషల్ మీడియాను ముందుండి నడిపిస్తున్నారు క్రిషాంక్. అయితే ఆయన ఎంతో శ్రమ పడుతున్నప్పటికీ.. గులాబీ పార్టీలో కొంతమంది వ్యక్తులు ఆయనను నాయకుడిగా చూడడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు క్రిషాంక్ కు టికెట్ లభించలేదు. అప్పుడు ఆయన మామ సర్వే సత్యనారాయణకు టికెట్ ఇచ్చారు. దీంతో దానిని కారణంగా చూపి క్రిషాంక్ గులాబీ పార్టీలో చేరారు. అక్కడ కూడా ఆయనకు




అవకాశం లభించడం లేదు. సికింద్రాబాద్ నగరానికి సంబంధించి గులాబీ పార్టీని పర్యవేక్షిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్.. కంటోన్మెంట్ ఏరియా కు గులాబీ పార్టీకి సంబంధించి కొత్త బాధ్యులు వస్తారని ప్రకటించారు. ఆ సమావేశానికి క్రిషాంక్ ను పిలవలేదు. క్రిషాంక్ ఆశల మీద తలసాని శ్రీనివాస్ యాదవ్ నీళ్లు చల్లుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్రిషాంక్ పార్టీ కోసం తీవ్రంగా కష్టపడుతున్నారు. అనేక కేసులను ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాలలో దాడులకు కూడా గురయ్యారు. ఈ పరిణామాలు క్రిషాంక్ ను ఆవేదనకు గురి చేస్తున్నాయని అతడి అభిమానులు అంటున్నారు. ఆయన చేస్తున్న పోరాటానికి గుర్తింపు ఏ మాత్రం లభించడం లేదని అభిమానులు వాపోతున్నారు. కేటీఆర్ తో బలమైన బంధం ఉన్నప్పటికీ.. క్రిషాంక్ ను పార్టీ అధిష్టానం ఎందుకు గుర్తించడం లేదో అర్థం కావడం లేదు. కేటీఆర్ మీద సంపూర్ణ విశ్వాసంతో ఉన్నానని అనేక సందర్భాలలో క్రిషాంక్ చెప్పారు. క్రిషాంక్ కు కూడా కేటీఆర్ హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. దీనికి తోడు తలసాని శ్రీనివాస్ యాదవ్ కంటోన్మెంట్ విషయంలో వేలు పెట్టడంతో అసలు క్రిషాంక్ రాజకీయ భవిష్యత్తు ఏమిటో అర్థం కావడం లేదు.

# అంగన్వాడి భవన నిర్మాణం, గ్రామపంచాయతీ భవనం కోసం 32 లక్షల రూపాయల నిధులు మంజూరు:మాజీ శాసనసభ్యులుజి విట్టల్ రెడ్డి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 19 (భారత శక్తి): కుబీర్ మండలంలోని ఓల్డ్ సావులి గ్రామానికి నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం 20 లక్షల రూపాయల నిధులు మరియు నూతన అంగన్వాడీ భవన నిర్మాణం కోసం 12 లక్షల రూపాయల నిధులు మొత్తం 32 లక్షల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని మాజీ శాసనసభ్యులు గారు తెలిపారు. నిధులు మంజూరు యొక్క ప్రొసీడింగ్ కాపీని గ్రామ సర్పంచ్ కు అందజేయడం జరిగింది. నిధులు మంజూరు చేసి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మరియు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కి ముధోల్ నియోజకవర్గం ప్రజల తరఫున మాజీ శాసనసభ్యులు జి విట్టల్ రెడ్డి.ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుబేర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గోనెలు కళ్యాణ్ మరియు గ్రామ సర్పంచ్ సాయి ఉన్నారు.



# ఎమ్మెల్యే చేతుల మీదుగా టిడిప క్యాలెండరు ఆవిష్కరణ

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జనవరి 19 (భారత శక్తి): తెలంగాణ డయాగ్నస్టిక్స్ అసోసియేషన్( టిడిఏ) క్యాలెండర్ ను ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మద్దెల రమేష్, జిల్లా కార్యదర్శి షేక్ పారూక్, జిల్లా నాయకులు రాఘవాచారి, దావూద్ , అశోక్ ,సురేష్, పరమానందం , రవి మరియు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఘనపురపు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



# ప్రారంభమైన పులుల లెక్కలు...

మహబూబ్ నగర్, జనవరి 19 (భారత శక్తి):

పులుల లెక్క, మొత్తం అటవీ జీవవైవిధ్యాన్ని అంచనా వేయడానికి అటవీ శాఖ సిద్ధమైంది. ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ 2026ను నిర్వహించడానికి సన్నాహాలు పూర్తి చేసింది. రాష్ట్రంలో పులులు, వాటి ఆహారమైన శాఖాహార జంతువులను కూడా లెక్కిస్తారు.ఈ కార్యక్రమంలో భాగంగా 25 వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉన్న 3,053 అటవీ ప్రాంతాలలో క్షేత్రస్థాయి డేటా సేకరణ జరుగుతుంది. ఈ సర్వేలో టైగర్ రిజర్వ్ ఫారెస్ట్, వన్యప్రాణుల అభయారణ్యాలు, అభయారణ్యాలు, ఇతర అటవీ ప్రాంతాలు ఉంటాయి. తెలిసిన పులుల కదలిక జోన్‌లపై మాత్రమే కాకుండా.. వాటి ఆవాసాలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తారు. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ, వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఈ లెక్కింపు జరుగుతుంది.శిక్షణ పొందిన అటవీ శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు ట్రాన్సెక్ట్ లైన్లు వేయడం ద్వారా, టైగర్ పగ్‌మార్క్‌లు, స్కాట్ నమూనాలు, స్క్రాచ్ మార్క్‌లు వంటి సంకేతాలను నమోదు చేయడం ద్వారా క్షేత్రస్థాయి సర్వేలను నిర్వహిస్తారు. అటవీ నివాస పరిస్థితులు, మానవ కార్యకలాపాల ప్రభావంపై డేటాను కూడా మొబైల్ అప్లికేషన్‌లను ఉపయోగించి సేకరిస్తారు.ఈ కార్యక్రమంలో 1,129 మంది వాలంటీర్లు నమోదు చేసుకున్నారని అధికారులు తెలిపారు. చిచిఈ, ఊఋఎఊూ, యానిమల్ వారియర్స్, డెక్కన్ బర్డర్స్, ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ వంటి ప్రభుత్వేతర సంస్థలు దాదాపు 430 మంది శిక్షణ పొందిన సభ్యులతో ఈ కార్యక్రమానికి మద్దతు ఇస్తున్నాయి. అటవీ విభాగాల అవసరాల ఆధారంగా జిల్లా వారీగా వాలంటీర్లను నియమించారు. శాఖాపరమైన పర్యవేక్షణలో డేటా సేకరణలో సహాయం చేస్తారు. సేకరించిన డేటాను కెమెరా ట్రాపింగ్, శాస్త్రీయ విశ్లేషణతో కూడిన తదుపరి దశలలో పులుల సంఖ్య, ఇతర వన్యప్రాణుల స్థితిని సమగ్రంగా అంచనా వేయడానికి ఉపయోగిస్తారు.పులి అడుగులు, చెట్లకు గోకే గుర్తులు, మలం ఆధారంగా వాటి ఆచూకీ తెలుసుకుంటారు. ఇందుకోసం టెక్నాలజీని వాడుతారు. ఇప్పటిదాకా పులుల సంఖ్యపై కచ్చితమైన సమాచారం లేదు. దీంతో వాటి సంరక్షణ చర్యలు ఇబ్బందులు అయ్యేవి. తాజాగా పులుల గణనతో ఆ సమస్య తీరనుంది.రాబందును పట్టించిన జీపీఎస్‌మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం బహిరన్ దిబ్బ గ్రామ శివారులో ఒక రాబందు కనిపించింది. నిజానికి రాబందులు కనిపించడం అరుదు కదా. దీంతో గ్రామస్థుల్లో భయం మె?దలైంది. ఆకాశం నుంచి అకస్మాత్తుగా వచ్చిన ఈ పక్షిని చూసిన జనాలు ఆలోచనల్లో పడ్డారు. ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఇక ఆ పక్షి కాళ్లకు స్టిక్కర్లు, నంబర్లు, చిన్న పరికరాలు ఉండటంతో ఆశ్చర్యంగా చూశారు.అయితే కొందరు యువకులు పరికరాలను చూసి ఏదైనా గూఢచారి పక్షి కావొచ్చు అని అనుమానం వ్యక్తం చేశారు. మరికొందరైతే గ్రామానికి ఏదైనా కీడు జరుగుతుందని కూడా మాట్లాడుకున్నారు. ఈ రాబందుకు సంబంధించిన విషయం సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. ఈ విషయం అటవీ శాఖ అధికారులకు కూడా తెలిసింది. దీంతో వారు రంగంలోకి దిగారు.దీనిపై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వికాస్ క్లారిటీ ఇచ్చారు. దేశంలో అంతరించిపోతున్న రాబందుల జాతిని కాపాడేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంరక్షణ ప్రాజెక్టును అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే.. రాబందుల కదలికలు, నివాస ప్రాంతాలు, ఆహార లభ్యత లాంటి అంశాలను అధ్యయనం చేసేందుకు వాటి కాళ్లకు జీపీఎస్ ట్రాకర్లు, గుర్తింపు ట్యాగులు అమర్చుతున్నారన్నారు. ఈ రాబందులు దేశవ్యాప్తంగా ఎక్కడ తిరిగినా.. వాటి లొకేషన్‌ను వైల్డ్ లైఫ్ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు.ఈ టెక్నాలజీ ద్వారా రాబందుల సంఖ్యను పెంచేందుకు అవసరమైన శాస్త్రీస సమాచారం సేకరిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. రాబందుల రక్షణ అందరి బాధ్యత అని చెప్పారు. ఈ పక్షులకు హాని కలిగించినా.., పట్టుకునేందుకు ప్రయత్నించినా.. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్థులు ఎలాంటి భయం లేకుండా రాబందును పట్టించుకోకుండా వెళ్లాలని చెప్పారు.

# ట్రాఫిక్ చక్రబంధనం నుంచి బయటకు ఎలా...

హైదరాబాద్, జనవరి 19 (భారత శక్తి):

తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో సైబర్ నేరాలను, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మాదకద్రవ్యాల సరఫరాను




ఉక్కుపాదంతో అణచివేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రస్తుతం, ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టారు. ఆ దిశగా యువ ఐపిఎస్ అధికారులకు ఆ బాధ్యతలను అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లతో పాటు కొత్తగా రూపుదిద్దుకుంటున్న 'ఫ్యూచర్ సిటీ' పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ వ్యవస్థను బలోపేతం చేయడం ఈ బదిలీల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.జిల్లాల్లో అదనపు ఎస్పీలుగా సమర్థవంతంగా పనిచేస్తున్న యువ అధికారులను ఎంపిక చేసి, వారికి నగరంలో ట్రాఫిక్ డిసిపిలుగా పోస్టింగులు ఇచ్చారు. ఈ బదిలీల్లో భాగంగా కొత్తగూడెం ఆపరేషన్స్ అదనపు ఎస్పీగా ఉన్న అవినాష్ కుమార్ ను హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపి-1 (ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లు) గానూ, ఉట్నూరు అదనపు ఎస్పీగా ఉన్న కాజల్ ను హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపి-2 (గోల్కొండ, జూబ్లీహిల్స్ జోన్లు) గానూ నియమించారు. అదేవిధంగా జగిత్యాల అదనపు ఎస్పీ ఎస్. శేషాద్రిని రెడ్డిని సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి-2 (కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లు) బాధ్యతల్లోకి తీసుకురాగా, భువనగిరి అదనపు ఎస్పీ కనకాల రాహుల్ రెడ్డికి మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ డిసిపి-1 బాధ్యతలు అప్పగించారు.ములుగు జిల్లా ఆపరేషన్స్ అదనపు ఎస్పీగా పనిచేస్తున్న శివం ఉపాధ్యాయను ప్రతిష్ఠాత్మక 'ఫ్యూచర్ సిటీ' కమిషనరేట్ ట్రాఫిక్ డిసిపిగా నియమించడం విశేషం. రైల్వేస్ డిఐజి హోదాలో ఉన్న జి. చందనా దీప్తిని ఫ్యూచర్ సిటీ అడ్మిన్ మరియు ట్రాఫిక్ అదనపు సీపీగా నియమించగా, హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపిగా ఉన్న బికే రాహుల్ హెగ్డేను అదే కమిషనరేట్ లో ట్రాఫిక్ డిసిపి-3 (చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్లు) గాను, సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపిగా ఉన్న జి. రంజన్ రతన్ కుమార్ ను అక్కడే ట్రాఫిక్ డిసిపి-1 (శేర్లింగంపల్లి జోన్) గాను ప్రభుత్వం బదిలీ చేసింది.అదేవిధంగా, రాష్ట్రవ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా వంటి అక్రమాలను అడ్డుకునేందుకు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్‌లో డిఐజి గా అభిషేక్ మహంతిని నియమించారు. తద్వారా సహజ వనరుల లూటీని అరికట్టడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా కఠిన చర్యలు చేపట్టనున్నారు. మొత్తంగా చూస్తే, తాజా ఐపిఎస్ అధికారుల బదిలీల్లో అటు అనుభవానికి, ఇటు యువత ఉత్సాహానికి సమ ప్రాధాన్యం కల్పిస్తూ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది.

# మద్యం డబ్బులు చెల్లించండి డిస్టలరీస్ వార్నింగ్

హైదరాబాద్, జనవరి 19, (భారత శక్తి):

తెలంగాణ ప్రభుత్వం నుంచి రావాల్సిన వేల కోట్ల రూపాయల బకాయిలు ఇప్పుడు రాష్ట్ర పారిశ్రామిక ప్రతిష్టను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వేదిక 2026 దావోస్ సదస్సు మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో, మద్యం తయారీ పరిశ్రమల సంఘాలు రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరికలు జారీ చేశాయి. సుమారు రూ. 3,900 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించకపోతే, రాష్ట్రానికి వచ్చే కొత్త పెట్టుబడులు ఆగిపోవడమే కాకుండా, ప్రస్తుతం ఉన్న ఇన్వెస్టర్ల నమ్మకం కూడా సన్నగిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశాయి.(బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా , కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బెవరేజెస్ కంపెనీస్) సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశాయి. తెలంగాణ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ తమకు రూ. 3,900 కోట్లు చెల్లించాల్సి ఉందని, అందులో రూ. 900 కోట్లు ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించాయి. డియాజియో, పెర్నోడ్ రికార్డ్, యునైటెడ్ బ్రూవరీస్ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులు ఈ బకాయిల అంశంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు."రాష్ట్ర ఖజానాకు మద్యం రంగం భారీగా ఆదాయాన్ని సమకూరుస్తుంది. ఒప్పందం ప్రకారం 45 రోజుల్లో చెల్లింపులు చేయాల్సి ఉండగా, నెలల తరబడి జాప్యం చేయడం వల్ల సరఫరా గొలుసు దెబ్బతింటుంది. ఇది ఉద్యోగాలపై కూడా ప్రభావం చూపుతుంది" అని ఈ మూడు సంఘాలు పేర్కొన్నాయి.తెలంగాణలో పారిశ్రామిక పెట్టుబడులు గత ఏడాదితో పోలిస్తే సగానికి పైగా పడిపోయాయి. 2023-24లో రూ. 28,100 కోట్లుగా ఉన్న పెట్టుబడులు, 2024-25 నాటికి రూ. 13,730 కోట్లకు పడిపోవడం గమనార్హం. బకాయిల చెల్లింపులో జాప్యం కూడా ఇందుకు ఒక కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.మరోవైపు, తెలంగాణ ఎక్సైజ్ ఆదాయం గత పదేళ్లలో నాలుగు రెట్లు పెరిగింది. 2013-14లో రూ. 9,000 కోట్లుగా ఉన్న ఆదాయం, 2023-24 నాటికి రూ. 38,000 కోట్లకు చేరుకుంది. కేవలం అక్టోబర్ 2025లోనే లైసెన్స్ ఫీజుల ద్వారా ప్రభుత్వం రూ. 3,000 కోట్లు వసూలు చేసింది. ఇంత భారీ ఆదాయం వస్తున్నా, సరఫరాదారులకు బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని కంపెనీలు ప్రశ్నిస్తున్నాయి."ముఖ్యమంత్రిని 2024 జూలైలో కలిసినప్పుడు మూడు నెలల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ 2025 జనవరి నాటికి మళ్లీ చెల్లింపులు ఆగిపోయాయి. ఇది చాలా క్లిష్టమైన పరిస్థితి" అని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఒక మద్యం కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణలో బీర్ మార్కెట్‌లో 70 శాతం వాటా కలిగిన యునైటెడ్ బ్రూవరీస్ ఇప్పటికే కు సరఫరా నిలిపివేసింది. పెరిగిన ముడిసరుకు ఖర్చులకు అనుగుణంగా ధరలు సవరించకపోవడం, పాత బకాయిలు పేరుకుపోవడంతో కార్యకలాపాలు నిర్వహించడం భారంగా మారిందని సంస్థ తెలిపింది. పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకలో పన్నుల పెంపు వల్ల సేల్స్ తగ్గిన నేపథ్యంలో, మద్యం కంపెనీలకు తెలంగాణ కీలక మార్కెట్. కానీ ఇక్కడి చెల్లింపుల జాప్యం వారిని అయోమయంలో పడేస్తోంది.వెంటనే లైసెన్స్ వేలం ద్వారా వచ్చిన నిధులతో బకాయిలు చెల్లించి, ఇన్వెస్టర్లలో భరోసా నింపాలని పరిశ్రమ వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

# అటు ఎండ ఇటు చలి



హైదరాబాద్, జనవరి 19 (భారత శక్తి):

తెలంగాణలో వింత వాతావరణం నెలకొంది. పగటిపూట ఎండలు మండిపోతుంటే.. రాత్రిళ్లు చలి వణికిస్తోంది. ఆదిలాబాద్‌లో 34.3 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు.. తిర్యాణిలో 7 డిగ్రీలకు పడిపోయాయి. రానున్న మూడు రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ విభిన్న వాతావరణంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణుల సూచన.తెలంగాణ రాష్ట్రంలో వింత వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు పగటిపూట భానుడు తన ప్రతాపాన్ని చూపుతుంటే.. మరోవైపు రాత్రి సమయాల్లో చలి పులి పంజా విసురుతోంది. గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలో సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఇక్కడ సాధారణం కంటే 4.2 డిగ్రీలు అధికంగా నమోదై.. 34.3 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో కూడా పగటి పూట ఎండ తీవ్రత సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు పెరగడం విశేషం. జనవరి మూడవ వారంలోనే ఈ స్థాయిలో ఎండలు ఉండటం చూస్తుంటే.. రాబోయే వేసవి కాలం ఎంత తీవ్రంగా ఉ ండబోతుందోనన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది.పగటిపూట ఎండలు మండిపోతుంటే.. రాత్రి నుంచి ఉదయం వరకు మాత్రం చలి వణికిస్తోంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో అత్యల్పంగా 7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే ఆదిలాబాద్‌లోని భీంపూర్, సంగారెడ్డి జిల్లా కోహీర్, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువగానే నమోదయ్యాయి. రాష్ట్రంలోని దాదాపు 13 జిల్లాల్లో చలి తీవ్రత పెరిగి ఉష్ణోగ్రతలు 2 నుంచి 5.4 డిగ్రీల వరకు తగ్గుముఖం పట్టాయి.వాతావరణ శాఖ సూచనల ప్రకారం.. రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. అయితే పగటిపూట ఆకాశం నిర్మలంగా ఉండటం వల్ల సూర్యరశ్మి నేరుగా భూమిని తాకి పగటి ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణమవుతోంది. రాత్రిపూట గాలిలోని తేమ శాతం తగ్గడం వల్ల చలి తీవ్రత అధికంగా ఉ ంటోంది. ఈ భిన్న వాతావరణం వల్ల ప్రజలు ఆరోగ్య సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# మేడారం టిక్కెట్స్ ఫిక్స్...

వరంగల్, జనవరి 19 (భారత శక్తి):

మేడారం సమ్మక్క?సారక్క జాతరకు వెళ్లే భక్తుల కోసం తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి వెళ్లే టిక్కెట్ చార్జీలను ఖరారు చేసింది. హైదరాబాద్ నుంచి రూ.600 నుంచి రూ.1,110 వరకు.. వరంగల్ నుంచి రూ.250 నుంచి రూ.500 వరకు చార్జీలు నిర్ణయించింది. అలాగే భూపాలపల్లి, ఖమ్మం, గోదావరిఖని, కొత్తగూడెం వంటి ప్రాంతాల నుంచి కూడా ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కొనసాగుతుందని ఆర్టీసీ స్పష్టం చేసింది.మేడారం సమ్మక్క?సారక్క జాతరకు వెళ్లే భక్తుల కోసం తెలంగాణ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి రెండేళ్లకోసారి జరిగే ఈ మహా జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని తగ్గించడంతో పాటు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించేందుకు ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఇప్పటికే వివిధ ప్రాంతాల వేల సంఖ్యలో బస్సులను మేడారానికి తరలించగా.. తాజాగా దీనికి అనుగుణంగా వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి వెళ్లే బస్సుల టిక్కెట్ చార్జీలను ఖరారు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.హైదరాబాద్, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, భూపాలపల్లి, ఏటూరునాగారం, ఖమ్మం, గోదావరిఖని, కొత్తగూడెం వంటి ప్రాంతాల నుంచి మేడారానికి ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి తీసుకువచ్చింది. బస్సుల రకాన్ని బట్టి చార్జీలు నిర్ణయించారు. హైదరాబాద్ నుంచి ప్రయాణించే వారికి సూపర్ లగ్జరీ, రాజధాని, డీలక్స్, ఎక్స్‌ప్రెస్, సాధారణ, గరుడ ప్లస్ బస్సులు నడపనున్నారు. వీటికి టిక్కెట్ ధరలు రూ.600 నుంచి రూ.1,110 వరకు ఉంటాయి.అలాగే వరంగల్, హనుమకొండ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది భక్తులు మేడారానికి వెళు ండటంతో అక్కడి నుంచి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వరంగల్, హన్మకొండ నుంచి టిక్కెట్ చార్జీ రూ.250 నుంచి రూ.500 వరకు నిర్ణయించారు. భూపాలపల్లి నుంచి రూ.230 నుంచి రూ.300 వరకు, మహబూబాబాద్ నుంచి రూ.360 నుంచి రూ.410 వరకు చార్జీలు ఉంటాయి. ఖమ్మం నుంచి రూ.480, గోదావరిఖని నుంచి రూ.400, కొత్తగూడెం నుంచి రూ.350 చార్జీగా నిర్ణయించారు. కరీంనగర్ నుంచి మేడారానికి వెళ్లే బస్సుకు రూ.390గా నిర్ణయించారు.ముఖ్యంగా 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కొనసాగుతుందని తెలంగాణ ఆర్టీసీ స్పష్టం చేసింది. భక్తుల సౌకర్యార్థం అదనపు బస్సులు, ప్రత్యేక సిబ్బంది, భద్రతా చర్యలు కూడా చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. జాతరకు వెళ్లే భక్తులు ముందస్తుగా ప్రణాళిక చేసుకొని ప్రయాణించాలని సూచించారు.



మహిళల శక్తితో మేడారం

సమ్మక్క సారక్క దేవతల జాతరకు వేళయింది..ఈసారి జాతర చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా చిత్ర విచిత్రాలు ఆశ్చర్య పరుస్తున్నాయి.. ఈసారి జాతర పూర్తిగా నారీమణుల పెత్తనంలోనే సాగనుంది.. పూర్తిగా మహిళల చేత ట్రస్ట్ బోర్డ్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేశారు.. మంత్రి సీతక్క వినూత్న ఆలోచనతో పూర్తిగా అతివల చేత అమ్మల జాతర జరిపించేందుకు సిద్ధమయ్యారు.. చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, 11 మంది డైరెక్టర్లు 1 ఎక్స్ అఫీషియ సభ్యులతో కలిసి మొత్తం 14 మందితో మేడారం ఉ త్సవ కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయించారు..ఓరుగల్లు పేరు చెప్పగానే రాని రుద్రమదేవి పౌరుషం గుర్తుకొస్తుంది.. నారీమణుల నవశాఖానికి ఓరుగల్లు ఆడబిడ్డల పౌరుషాన్ని చిహ్నంగా భావిస్తారు.. సమ్మక్క సారక్క దేవతలను వీరవనితలుగా.. ధీరత్వానికి.. పౌరుషానికి.. ప్రతీకలుగా కొలుస్తారు.. పాలకుల ప్రయోగంతో ఓరుగల్లు స్త్రీ శక్తికి చిహ్నంగా నిలుస్తుంది.. ఇప్పటికే వరంగల్ ఉ మ్మడి జిల్లా అంతా అతివల పాలనలోనే కొనసాగుతుంది.. తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ లో ఇద్దరు మహిళా మంత్రులు ఉ ండగా ఆ ఇద్దరు కొండా సురేఖ, సీతక్క వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందినవారే కావడం విశేషం?వీళ్ళిద్దరు మాత్రమే కాదు.. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు గా డాక్టర్ కడియం కావ్య, వరంగల్ మేయర్ గా గుండు సుధారాణి ప్రజా ప్రతినిధులుగా కొనసాగుతున్నారు.. వరంగల్ కలెక్టర్ గా సత్యశారదాదేవి, హనుమకొండ కలెక్టర్ గా స్నేహ శబరిష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా చాహత్ వాజ్ పాయ్, వరంగల్ సెంట్రల్ జోన్ పోలీస్ కమిషనర్ గా సరిత స్త్రీ శక్తిని చాటుతున్నారు.తాజాగా నవశకానికి నాంది పలికిన మంత్రి సీతక్క మేడారం జాతరలో ఓ వినూత్న ప్రయత్నం చేశారు.. మేడారం జాతర ఉత్సవ కమిటీ పగ్గాలు మహిళలకే కట్ట బెట్టారు.. చైర్ పర్సన్ గా ఇరుప స్వరూపతో పాటు మరో 12 మంది మహిళా డైరెక్టర్లు, ఒకరు ఎక్స్ అఫీషియా సభ్యుడి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అతివల బాధ్యతల స్వీకరణ ప్రమాణస్వీకారం కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు.. ధీరత్వానికి ప్రతీకగా కొలబడే సమ్మక్క సారక్క దేవతలే నారీమణులకు స్ఫూర్తి అంటున్న మంత్రి సీతక్క.. ఈసారి పూర్తిగా మహిళల చేతుల మీదుగా జాతర బాధ్యతలు నిర్వహించడం ఓ వరంగా భావిస్తున్నారు.. సమ్మక్క సారక్క దేవతల స్ఫూర్తితో జాతర నిర్వహణలో స్త్రీ శక్తిని చాటుతామన్నారు..రాష్ట్రంలో ఎక్కడా.. ఎప్పుడు కని విని ఎరుగని విధంగా పూర్తిగా మహిళలకే పరిపాలన పగ్గాలు అప్పచెప్పి..ఇంత పెద్ద జాతర నిర్వహణ వారి భుజస్కందాలపై పెట్టడం చర్చగా మారింది.. శ్రీ శక్తిని నిరూపించుకునే గొప్ప అవకాశం లభించిందని తమకు లభించిందనీ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిటీ చైర్ పర్సన్ తో సహ డైరెక్టర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు..మేడారం జాతర చరిత్రలో ఇప్పటికే అనేక అద్భుతాలు అబ్బుర పరుస్తుండగా.. తాజాగా నారీమణుల చేతికి పరిపాలన పగ్గాలు అప్ప చెప్పడం మరింత చర్చగా మారింది.. ఇంతపెద్ద జాతర నిర్వహణ బాధ్యతలు వారి భుజాలపై వేసుకున్న అతివలు సమ్మక్క సారక్క స్ఫూర్తితో సక్సెస్ చేస్తారని ఆశిద్దాం.

# ఖమ్మం జిల్లాలో రెండో జాతీయ రహదారి

ఖమ్మం, జనవరి 19(భారత శక్తి):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మరో జాతీయ రహదారి మంజూరైంది. ఈ రహదారి అందుబాటులోకి వస్తే కొత్తగూడెం నుండి హైదరాబాద్‌కు ప్రయాణ దూరం 40 కిలోమీటర్లు తగ్గుతుంది. ఇల్లెందు, మహబూబాబాద్, తొర్రూరు మీదుగా గౌరెల్లి జంక్షన్ వరకు ఈ రహదారిని నిర్మించనున్నారు. ఇందుకోసం ఇల్లెందు, టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లోని సుమారు 4.85 హెక్టార్ల భూసేకరణకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న రెండు వరుసల రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులకు రవాణా రంగంలో ఒక గొప్ప శుభవార్త అందుతోంది. జిల్లా మీదుగా మరో సరికొత్త జాతీయ రహదారి రాబోతోంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను పారిశ్రామిక కేంద్రమైన కొత్తగూడెంతో అనుసంధానించే జాతీయ రహదారి 930పీ నిర్మాణ పనుల్లో ఇప్పుడు కీలక ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తూ కేంద్ర జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ తాజాగా గెజిట్ (3డీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది జిల్లా ప్రగతికి సరికొత్త బాటలు వేయనుంది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండా వెళ్లే రెండో జాతీయ రహదారిగా ఇది నిలవనుంది. ఇల్లెందు మరియు కొత్తగూడెం మధ్య ఉన్న మూడు మండలాల్లోని సుమారు 4.85 హెక్టార్ల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇల్లెందు మండలంలోని సుదిమళ్ల, టేకులపల్లి మండలంలోని బేతంపూడి, గొల్లపల్లి మరియు లక్ష్మీదేవిపల్లి మండలంలోని కారుకొండ వంటి గ్రామాల్లో భూసేకరణ జరగనుంది. ఈ భూములకు సంబంధించి మార్కెట్ విలువ ప్రకారం రైతులకు త్వరలోనే నష్టపరిహారం చెల్లించనున్నారు.ప్రస్తుతం కొత్తగూడెం నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే ఖమ్మం లేదా సూర్యాపేట మీదుగా వెళ్లాల్సి వస్తోంది. కానీ ఈ కొత్త జాతీయ రహదారి 930పీ అందుబాటులోకి వస్తే.. ఇల్లెందు, మహబూబాబాద్, తొర్రూరు, వలిగొండ మీదుగా నేరుగా హైదరాబాద్‌లోని గౌరెల్లి జంక్షన్‌ను చేరుకోవచ్చు. దీనివల్ల దాదాపు 40 కిలోమీటర్ల దూరం తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా గణనీయంగా ఆదా అవుతుంది.ఈ రహదారి కేవలం ప్రయాణికులకే కాకుండా.. పారిశ్రామిక రవాణాకు వెన్నెముకగా మారుతుంది. జిల్లాలో ఉన్న మైనింగ్, యంత్రాల రవాణా సులభతరమవుతుంది. అలాగే, హైదరాబాద్ నుండి భద్రాచలం వెళ్లే భక్తులకు కూడా ఇది సులభమైన ప్రత్యామ్నాయ మార్గంగా నిలుస్తుంది.

# మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా విలేజ్ హెల్త్ క్లినిక్ లు: గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**నందివాడలో రూ.36లక్షలతో ఎ.ఊ.అ భవనానికి శంకుస్థాపన**

**నందివాడ మండలంలో రూ.1.80 కోట్లతో..విలేజ్ హెల్త్ క్లినిక్ లు నిర్మిస్తున్నాం:**

**భవనాల నిర్మాణానికి స్వచ్ఛందంగా దాతలు ముందుకు వచ్చి సహకరించడం శుభ పరిణామం**

**భవన నిర్మాణాలను త్వరగతిన పూర్తిచేసి.... హెల్త్ క్లినిక్స్ సేవలు ప్రజలకు అందుబాటులోకి తెస్తాం**

నందివాడ మండలం జనవరి19: (భారత శక్తి):

గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా.... కూటమి ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్స్ ఏర్పాటు చేస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో హెల్త్ క్లినిక్స్ సేవలు చేస్తున్నామన్నారు.

మండల కేంద్రమైన నందివాడ గ్రామంలో రూ.36 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న... విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులకు కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము భూమి పూజ నిర్వహించి సోమవారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా భవన నిర్మాణానికి 6 సెంట్లు స్థలాన్ని దాతృత్వంగ అందించిన వేములపల్లి కాశి వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే రాము అభినందించారు.

అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.... మండలంలో ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో ఐదు హెల్త్ క్లినిక్ లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే నాలుగు క్లినిక్ ల నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయని, వాటిని త్వరగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే రాము అన్నారు.

గ్రామాల్లో ఈ క్లినిక్ ల ఏర్పాటు ద్వారా ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ అవుతాయన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ఇలాంటి మంచి కార్యక్రమాలకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, సహకరించడం శుభపరిణామం అన్న ఎమ్మెల్యే రాము, స్థలదాతలకు ధన్యవాదాలు చెప్పారు.

గతంలో ఎన్నడూ లేనివిధంగా నందివాడ మండలంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. గ్రామాల సమగ్ర అభ్యున్నతే లక్ష్యంగా... నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే రాము ఉద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్డబ్ల్యుసి చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, మండల టిడిపి అధ్యక్షుడుదానేటి సన్యాసిరావు, టిడిపి నాయకులు ఆరీకేపూడి రామశాస్త్రి, సీతయ్య,ప్రభాకర్ రెడ్డి, సల్మాన్ రాజ్,యేసుపాదం, మసిముక్కు వేణు, మురళి, ఉప్పల వెంకటేశ్వరరావు,ఆఅ యేసు బాబు,అంజిరెడ్డి, బాబిరెడ్డి, సుంకర శ్రీను, సతీష్, భద్రం, లక్ష్మీపతి, నందివాడ గ్రామ నాయకులు దారం శ్రీనివాసరావు, నిమ్మకూరు జోలయ్య, ఏడుకొండలు, అశోకు, నేరుసు నాగరాజు, వీర్ల లోకేష్, మందపాటి నాగరాజు, యాదయ్య, వెయ్యల నాగయ్య, ఓఖఆూ మల్లీశ్వరి, ఆఇ రవి, ంఇ ఖఫీ రవి, డాక్టర్ జాయిస్. మంజుష, డాక్టర్ స్ఫూర్తి సింధూశా, తదితరులు పాల్గొన్నారు.

# 1380 కోట్లతో 81 సోలార్ గ్రామాల ఏర్పాటుకు చర్యలు: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

## –సోలార్ రూఫ్ టాప్ ద్వారా గ్రామస్తులకు ఆదాయం
## –పంట పొలాల్లో మిగిలిన గడ్డి కాల్చొద్దు

ఖమ్మం బ్యూరో, భారత శక్తి, జనవరి 19: పైలెట్ ప్రాజెక్టు క్రింద రాష్ట్ర ప్రభుత్వం 1380 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా 81 సోలార్ గ్రామాల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకున్నదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.



డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోమవారం బోనకల్ మండలంలోని రావినూతల మోడల్ సోలార్ గ్రామాన్ని ఎన్.పి.డి.సి.ఎల్. సీఎండి వరుణ్ రెడ్డి, రెడ్కో సీఎండి ఏ. శరత్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలిసి ప్రారంభించి గ్రామస్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా లిడిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూలి గ్రామంలో ఉన్న ప్రతి ఇంటిపై ప్రభుత్వం పూర్తి ఖర్చు భరిస్తూ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసి ఉత్పన్నమైన విద్యుత్తును సొంత అవసరాలకు వినియోగించుకుంటూ, మిగిలింది గ్రిడ్ కు విక్రయించడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టు క్రింద 1380 కోట్ల ఖర్చుతో 81 సోలార్ గ్రామాలను తీసుకోవడం జరిగిందని, ఖమ్మం జిల్లాలో 27 గ్రామాలు ఉండగా, అందులో బోనకల్ మండలంలో ఉన్న అన్ని 22 గ్రామాలను 306 కోట్లతో పైలెట్ ప్రాజెక్ట్ క్రింద ఎంపిక చేశామని అన్నారు. 24 కోట్ల రూపాయలతో రావినూతల గ్రామంలో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి సోలార్ రూఫ్ టాప్ సంవత్సరానికి 14 వేల యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేస్తుందని, అవసరమైన విద్యుత్ మనం వినియోగించు కొని, మిగిలినది గ్రిడ్ కు అమ్ముకుంటే ప్రభుత్వం యూనిట్ కు 2 రూపాయల 57 పైసల చొప్పున చెల్లించడం జరుగుతుందని అన్నారు. గతంలో ప్రజలు విద్యుత్ బిల్లులు చెల్లించేవారని, నేడు అదే విద్యుత్ శాఖ ప్రజలకు నగదు చెల్లించేలా పథకాన్ని రూపొందించామని అన్నారు. ఈ పథకాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని, అవసరం మేరకు మాత్రమే కరెంట్ వాడుకుంటూ మిగిలిన విద్యుత్తు అమ్మడం ద్వారా ఆదాయం పొందాలని డిప్యూటీ సీఎం సూచించారు. బోనకల్ మండలంలో ప్రతి రైతుకు వ్యవసాయ పంప్ సెట్ లు కూడా సోలార్ ద్వారా నడిచేలా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. పంట ఉత్పత్తితో పాటు విద్యుత్ ఉత్పత్తి ద్వారా కూడా రైతులు ఆదాయం పొందేలా చర్యలు చేపట్టామని అన్నారు. సోలార్ పంప్ సెట్ ను షెడ్ లా కూడా ఉపయోగ పడుతుందని అన్నారు. పంట పొలాల్లో మిగిలిపోయిన గడ్డిని కాల్చి వేయడం వల్ల పర్యావరణం కలుషితం అవుతుందని, రైతులు ఎవరు దయచేసి పొలాలకు నిప్పు పెట్టవద్దని డిప్యూటీ సీఎం విజ్ఞప్తి చేశారు. పర్యావరణ కాలుష్యం వల్ల మన జీవనానికి ప్రమాదం ఏర్పడుతుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, రాష్ట్ర హస్త కళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, విద్యుత్ శాఖ ఎసచవతీతీచ ఇనుగుర్తి శ్రీనివాసా చారి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్:సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 19 :

అధికారంలోకి రావడానికి ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ మోసం చేసిందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సంగారెడ్డి మున్సిపల్ ఇంచార్జ్ రాజనర్సితో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ బాకీ కార్డును ఈ సందర్భంగా ఆవిష్కరించి ప్రభుత్వాన్ని విమర్శించారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కింది అన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు పథకాలను నిర్వీర్యం చేసిందన్నారు. అభివృద్ధి అంటే ఒకరోజు జరిగేది కాదని అది నిరంతర ప్రక్రియని అన్నారు. గత బిఆరచవతీతీచస్ ప్రభుత్వ హయాంలో ప్రతి వార్డులో కోట్ల రూపాయల వరకు అభివృద్ధి పనులను చేసినట్లు గుర్తు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో పేదల సంక్షేమం కోసం విప్లవాత్మకమైన చారిత్రాత్మకమైన నిర్ణయాలు తీసుకుందని ఆయన స్పష్టం చేశారు. ఎన్ని అబద్ధాలు చెప్పినా ప్రజలు నమ్ముతారు అని రేవంత్ రెడ్డి బహిరంగంగానే చెప్పిన విషయం ప్రజలకు గుర్తుండాలన్నారు. అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్ గా రేవంత్ రెడ్డి మారారని తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనపై



రెండేళ్లలోనే ప్రజల్లో విశ్వాసం కోల్పోయింది అన్నారు. మళ్లీ వచ్చేది బీఆరచవతీతీచస్ సర్కారేనన్నారు. రేవంత్ రెడ్డి మాటల మారిగా మారారని చేతలు మాత్రం లేవని ఏదేవా చేశారు. 26 నెలల్లో అభివృద్ధిని విస్మరించి కేవలం కేసీఆర్ కేటీఆర్ హరీష్ రావులపై విమర్శలు చేస్తూ కాలం వెళ్ళదీశాడన్నారు. ఇక మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గతంలో పట్టాలు ఇచ్చిన అధికారంలో ఉండి కూడా పొజిషన్ చూపడం లేదని విమర్శించారు. మోసపూరిత కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగు చెందారని ప్రజలకు ఏది మంచి ఏది చెడో తెలుసని వారెప్పుడు టిఆరచవతీతీచస్ పక్షానే అండగా ఉంటారని స్పష్టం చేశారు.

# గ్రేటర్ హైదరాబాద్ వీరశైవ లింగాయత్ బలిజ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వాలే శెట్టి క్రాంతి నియామకం

పటాన్చెరు, భారత శక్తి ప్రతినిధి, జనవరి 19:

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం రామచంద్రపురం పట్టణానికి చెందిన వాలే శెట్టి క్రాంతి గ్రేటర్ హైదరాబాద్ రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఉపాధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర సంఘం గౌరవ అధ్యక్షుడు సంగమేశ్వర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించిన సంగం రాష్ట్ర అధ్యక్షుడు దినేష్ పాటిల్, ప్రధాన కార్యదర్శి రాజప్ప, సెంట్రల్ కమిటీ సభ్యులు శెట్టి శివకుమార్ లకు ఈ సందర్భంగా క్రాంతి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వీరశైవ లింగాయత్ సమాజ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని క్రాంతి స్పష్టం చేశారు.



# మహిళా శక్తికి దర్పణం : ఐకేపీ డైరీ ఆవిష్కరణలో షబ్బీర్ అలీ

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 19: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం ప్రగతి పథంలో పయనిస్తుంది. ఇందుకు ఐకేపీ (ఇందిరా క్రాంతి పథం) సంఘాల కృషి వెలకట్టలేనిది” అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ కొనియాడారు. కామారెడ్డి పట్టణంలోని కళాభారతిలో ఏర్పాటు చేసిన ఐకేపీ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, గతంలో మహిళలు కేవలం గడప దాటడానికే ఇబ్బంది పడేవారని, కానీ ఇందిరమ్మ స్ఫూర్తితో వచ్చిన ఐకేపీ ద్వారా నేడు మహిళలు స్వయం ఉపాధితో లక్షల రూపాయల టర్నోవర్? చేస్తున్నారని ఆయన గుర్తుచేశారు. మీరు కేవలం గృహిణులు కాదు, కుటుంబానికి వెన్నెముకగా నిలుస్తున్న ఆర్థిక యోధులు అని ఆయన ప్రశంసించారు.

తెలంగాణ ప్రభుత్వం మహిళా సంఘాల బలోపేతానికి కట్టుబడి ఉందని, గతంలో ప్రకటించిన హామీల అమలుకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన తెలిపారు. పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ సౌకర్యాల కల్పనలో మహిళలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.



ఐకేపీ సిబ్బంది గ్రామగ్రామాన తిరిగి మహిళలను సంఘటితం చేస్తున్న తీరు అభినందనీయమన్నారు. ఈ డైరీ, క్యాలెండర్ కేవలం తేదీల కోసం మాత్రమే కాకుండా, ఈ ఏడాదిలో ఐకేపీ సాధించబోయే విజయాలకు సూచికగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

కామారెడ్డి తన సొంత గడ్డని, ఇక్కడి ప్రజల కోసం, ముఖ్యంగా మహిళల సంక్షేమం కోసం ఎంతైనా కష్టపడతానని ఆయన ఉద్వేగంగా మాట్లాడారు.

ఐకేపీ కార్యాలయాల భవన నిర్మాణాలు, పెండింగ్?లో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# అర్జీలను ప్రత్యేక శ్రద్ధ తో పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

వైఎస్ ఆర్ కడప,జనవరి 19(భారత శక్తి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలనిఅర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారుసోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వారి తో పాటు జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా, డి ఆర్ ఓ విశ్వేశ్వర నాయుడువివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోందన్నారు ఈవేదిక ద్వారా అంతే అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని, అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలనన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకం గా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరి గా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలనుపరిష్కరించాలన్నారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు. పిజిఆరచవతీతీచస్ లో రీ ఓపెన్ అయిన



అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలని, జిల్లా అధికారులకు అందిన అర్జీలను పరిష్కరించేందుకు సమయం కేటాయించి సమీక్ష చేయాల న్నారు..అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు: కాసినాయన మండలం వద్దమాను గ్రామం కు చెందిన చంద్రశేఖర్ ఊర్లో ఉన్న మా భూమిని ఆక్రమించుకొని ఆన్లైన్ ఎక్కించుకున్నారని వాటిని రద్దుచేసి ఆ భూమిని సర్వే చేయించి మాకు ఇప్పించాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కారక వేదికలో అర్జీని సమర్పించారు. కడప చిన్న చౌకు కు చెందిన కె. పద్మావతీ దేవి తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని కోరుతూ సోమవారం అర్జీని సమర్పించారు. పెండ్లిమర్రి మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన బి. నాగరాజు తనకు వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని అర్జీని సమర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఇఓ ఓబుళమ్మ, డి.ఆర్.డి.ఏ. పి.డి. జి.రాజ్యలక్ష్మి ఎంప్లాయిమెంట్ మరియు టూరిజం శాఖ అధికారి సురేష్ కుమార్,మెప్మా పిడి కిరణ్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంధుల జీవితాలకు వెలుగునిచ్చిన మేధావి...

## అంధుల ఆరాధ్య దైవం “లూయిస్ బ్రెయిలీ”.

ఒక్క నిముషం కళ్ళు మూసుకొని చుట్టూ చూస్తే అంతా అగమ్యగోచరంగా ఉంటుంది...మరి జీవితాంతం కళ్ళు లేక చుట్టుఉన్న అందాలను చూడలేక తమకున్న అందత్వాన్ని దూషించుకుంటు ఉన్న అందులెందరో...ఇలాంటి వారందరు నిరాశా... నిస్పృహలతో కృంగిపోకుండా... అంధుల కోసం... మహోన్నతమైన కృషి చేయ జన్మించిన అంధుల ఆరాధ్య దైవం,గురువు లూయిస్ బ్రెయిలీ. ”రవి గాంచని చోట కవి గాంచు” అంటే సూర్యకాంతి పడని ప్రతి భాగములో కూడా కవి చూడగలడని ఒక సామెత. కవి తన ఊహా సూక్ష్మదృష్టితో సృష్టిలోని అందాలను, నిగూఢమైన విషయాలను, ప్రకృతి అందాలను అందరికి చూపించగలడు . ఇలా వచ్చిన విషయాలన్నీ అక్షర రూపంలో ఉంటాయి. ఈ విజ్ఞానాన్ని మనం మన అమూల్యమైన కన్నులతో చూసి,చదివి హృదయానందాన్ని పొందగలము. దురదృష్ట వశాత్తు కొందరు, విధివంచనకు గురై మరికొందరు అంధులుగా ఉన్నారు. ఈ సృష్టి అందాలను చూడలేని నిర్భాగ్యులూ ఉన్నారు. ఇలాంటి వారందరూ నిరాశానిస్పృహలతో కృంగిపోకుండా, వారి విజ్ఞాన జీవితాలకు దిక్సూచిలా,మహోన్నత గురువులా ఈ నేల పైన జన్మించిన మహా మేధావి లూయీ బ్రెయిలీ. లూయీ బ్రెయిలీ ఒక ఫ్రెంచ్ విద్యావేత్త. బ్రెయిలీ లిపి సృష్టికర్త. 1809 సంవత్సరం జనవరి 4 వ తేదీన లో “పారిస్” దగ్గర లోని “క్రూవే” గ్రామంలో “మోనిక్ బ్రెయిలీ, సైమన్ రెనె బ్రెయిలీలకు” లూయిస్ బ్రెయిలీ జన్మించాడు. తండ్రి చేసే పనిని అనుకరిస్తూ పొరపాటున ఒక కంట్లో ఇనుప చువ్వగుచ్చుకున్నాడు. కొద్ది రోజుల్లోనే మరో కన్నును కూడా కోల్పోయి నాలుగేండ్లు నిండేసరికి పూర్తి గుడ్డివాడిగా అయ్యాడు. 1784 సంవత్సరంలో “స్పెయిన్” దేశానికి చెందిన “ఫ్రాన్సిస్కో లూకాస్” అక్షరాలను చెక్కమీద ఉబ్బెత్తుగా ఉండేటట్లు రూపొందించి,అంధులకు చదవడానికి అనుకూలంగా మార్చాడు. లూకాస్ కనుగొన్న ఉబ్బెత్తు అక్షరాల ద్వారా అంధులకు విద్యను నేర్పే పాఠశాలను 1784వ సంవత్సరంలో పారిస్‌లో “వాలెంటైన్ హ్యూ” ప్రారంభించారు. ఈ పాఠశాలలో లూయీ బ్రెయిలీ ని చదువు కొరకు చేర్పించారు. ఆ పాఠశాలలో చేరిన అతి తక్కువ కాలంలోనే “లైన్‌టైప్” పద్ధతిలో విశేష ప్రతిభను ప్రదర్శించాడు బ్రెయిలీ. ఆ ప్రతిభ వల్ల 17 సంవత్సరాల వయసులోనే, తను విద్యాభ్యాసం చేసిన పాఠశాలలోనే “ప్రొఫెసర్‌గా” నియమించబడ్డాడు. అంధులకు చదువు చెప్పాలంటే వారికి పుస్తకాలు కావాలి. కానీ కంటితో వారు చూడలేరు. స్మర్శ తప్ప మరో మార్గంలో వారు స్వయంగా చదువకోలేరు. అందుచేత మామూలు ప్రింటింగు పద్ధతినికాక, ఎత్తుగా ఉబ్బివుండే విధంగా అక్షరాలుఉన్న పుస్తకాలు మాత్రమే ఉండాలి. ఈ విషయాన్ని గుర్తెరిగి,పగలు విద్యార్ధులకు పాఠాలు బోధిస్తూ, రాత్రి అంధులు తేలికగా చదవగలిగే, రాయగలిగే లిపి తయారీకై కృషిచేసాడు. అంధులకు అప్పటివరకు రాయడం కొరకు మరియు చదవడం కొరకు ఉన్న విధానాలు సులభంగా లేవని గుర్తించడం వల్ల వారికి అనుకులైన విధానం కొరకు అహర్నిశలు కృషి చేశాడు. అప్పటి వరకు ఉన్న ప్రింటింగు విధానం స్పర్శపై ఎక్కువగా ఆధారపడి వుండాలని గ్రహించి,ఆ అక్షరాలు నున్నగా కాకుండా చుక్కలు చుక్కలుగా ఉంటే బాగుంటుందని భావించాడు. గీతలు గీతలు గా కాకుండా, చుక్కలు చుక్కలుగా వుంటే చదవటం సులభం అవుతుందని బ్రెయిల్ గుర్తించాడు.1821 లో “ఛార్లెస్ బార్బియర్ “ అనే



సైనికాధికారి, తన సైనికులు చీకటిలో కూడా తాను పంపిన సమాచారం గుర్తించేందుకు “12 ఉబ్బెత్తు చుక్కలతో”” రహస్య సంకేత లిపిని తయారు చేసాడు. దీని గురించి తెలుసుకున్న బ్రెయిలీ 12 చుక్కలకు బదులుగా 6 చుక్కల ద్వారా అవసరమైన రీతిలో వాటిని పేర్చుతూ అక్షరాలను, పదాలను అంకెలను, సంగీత చిహ్నాలను రూపొందించాడు. అందుల కోసం చాలా సులువైన విధానము కనుగొనాలనే సంకల్పంతో మరింత కృషి చేశాడు బ్రెయిలీ. 20 సంవత్సరాల యువకుడైన బ్రెయిల్ తన నూతన పద్ధతిని విజయవంతంగా ప్రకటించగలిగాడు. మరో 5 సంవత్సరాల పరిశోధనలో బ్రెయిల్ తన పద్ధతిలో సంపూర్ణత సాధించాడు. “ఆరు చుక్కలను” వివిధ రకాలుగా ఉపయోగించడం వల్ల బ్రెయిలీ “మొత్తం అక్షరాలను” రూపొందించాడు. ఇది అందులకు పెద్ద సంచలన, మంచి మార్పుగా మారింది. ఆరుపాయింట్లు వివిధ రకాలుగా వాడి మొత్తం ఇంగ్లీషు అక్షరాలన్నీ పలికేటట్లు మార్పుచేయడంలో విజయమ సాధించాడు. ఒక చుక్కనుండి ఆరు చుక్కలలోనే మొత్తం అక్షరాలన్నీ తయారు చేయడములో బ్రెయిలీ కృషి అమోఘం. ఈ విధంగా మొత్తం భాషకు 250 గుర్తులు ఈ “ఆరు” చుక్కలలో బ్రెయిల్ రూపొందించాడు. ఈ రకంగా రూపొందిన విధానములో అంధులు ఇతరుల సహాయం లేకుండా వ్రాయగలరు, చదవగలరు. అంధులకు ఉపయోగకరమైన లిపిని రూపొందించిన బ్రెయిలికి, బ్రెయిలి మరణం తర్వాత మాత్రమే అధిక ప్రాచుర్యం లభించింది . సంగీతాన్ని కూడా బ్రెయిలీ లిపిలో వ్రాయడం అతని నైపుణ్యానికి నిదర్శనం. ప్రపంచ వ్యాప్తంగా బ్రెయిలీ లిపికి గుర్తింపు వచ్చి అంగీకరించినా, అమెరికా మాత్రం1916లోనే దానిని ఆమోదించింది. ఈ నిరంతర శ్రమవల్ల 1851 లో “క్షయ” వ్యాధికి గురై “1852 జనవరి 6న” అంధులందరికి వెలుగునందించిన లూయిస్ బ్రెయిలీ మరణించారు. అనంతరం బ్రెయిలీ శిష్యులు తమ గురువు గారు రూపొందించిన “లిపికి” గుర్తింపునివ్వాలని పోరాటం చేయగా, అతని లిపికి అధికార గుర్తింపునిచ్చి బ్రెయిలీని తమ దేశపు ముద్దుబిడ్డగా కొనియాడింది “ఫ్రాన్స్”. ఈ రోజు ప్రపంచములోని అంధులకు అన్ని రకాల పుస్తకాలు, పత్రికలు బ్రెయిలీ లిపిలోనే వస్తున్నాయి. అందుకే అంధుల మనసుల్లో, వారి మునివేళ్లలో చిరకాలం జీవిస్తూనే ఉంటాడు బ్రెయిలీ. బ్రెయిలీ “మరణ శతాబ్ది” సందర్భంగా 1952లోఅతని అస్తికలను పారిస్‌లో “పాంథియన్‌లోకి” మార్చి “విశిష్ఠ వ్యక్తిగా” అతనిని గౌరవించారు. బ్రెయిలీ 200 జన్మదినో త్సవం సందర్భంగా 2009లో ప్రపంచవ్యాప్తంగా బ్రెయిలి చేసిన కృషిని గూర్చి ప్రచారం చేసి వారి గొప్పతనాన్ని తెలియచేసారు. బెల్జియం, ఇటలీ దేశాలు బ్రెయిలీ బొమ్మతో రెండు “యూరోల” నాణాన్ని విడుదల చేశాయి. మన భారతదేశం బ్రెయిలీ గౌరవార్థం “2 రూపాయల నాణాన్ని” అతని బొమ్మతో విడుదల చేసింది. అదే విధంగా అమెరికా కూడా ఒక “డాలరు” నాణాన్ని విడుదలచేసింది. ఒక వ్యక్తి ఆ దేశములో మాత్రమే గొప్పవాడయ్యే అవకాశం ఉంది. కానీ బ్రెయిలీ అందించిన అద్భుత ప్రక్రియకు విశ్వవ్యాప్త గుర్తింపు రావడం అపూర్వం. అంధులకు విద్యాదానం చేసిన మహనీయుడు బ్రెయిలీ, అంధులకే కాక ప్రజలందరికీ చిరస్మరణీయుడు..

గడప రఘుపతిరావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయఅవార్డు గ్రహీత. 9963499282

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



బూర్గంపాడు, జనవరి 19 (భారతశక్తి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల పంపిణీ

?రైతులకు సాగు ఖర్చు తగ్గించి, దిగుబడిని పెంచే ఉద్దేశంతో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, ఇతర ఆధునిక వ్యవసాయ పనిముట్లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సాంప్రదాయ పద్ధతులతో పాటు ఆధునిక యంత్రాలను వినియోగించుకోవడం ద్వారా రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి రైతుకు సబ్సిడీ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న కూలీల కొరతను అధిగమించేందుకు ఈ యాంత్రిక పరికరాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. సబ్సిడీపై పరికరాలు అందుకున్న రైతులు ఎమ్మెల్యేకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ ఆవిష్కరణలతో అభివృద్ధి దిశగా కొత్త భవిష్యత్తు వైపు పయనిస్తున్న భారత్

## – దేశ అభివృద్ధికి సాంకేతికతే వెన్నుదన్ను
## – జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి, భారత్ శక్తి ప్రతినిధి, జనవరి 19 :



నేటి విద్యార్థులు తమ ఆవిష్కరణలు, సృజనాత్మక ఆలోచనలతో భవిష్యత్‌లో దేశ అభివృద్ధికి దోహదపడే రేపటి శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. రామచంద్రపురం మండలం కొల్లూరు గాడియం ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్ లో ఏర్పాటు చేసిన దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శన?2026 ను శనివారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య , టీజీఐసీ చైర్పర్సన్ నిర్మల జయప్రకాష్ రెడ్డి, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్, విఐటిఎం డైరెక్టర్ సాదు భాస్కర్, విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ తరహా వైజ్ఞానిక ప్రదర్శనలనునిర్వహిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుండి వచ్చిన విద్యార్థులు తమ రాష్ట్రాలకు ప్రతినిధ్యం వహిస్తూ పాల్గొనడం గర్వకారణ

మన్నారు. ప్రతి విద్యార్థి తన విజ్ఞానం, ఆలోచనలతో దేశ భవిష్యత్తును నిర్మించే ప్రతినిధిగా ఎదగాలని ఆకాంక్షించారు. సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు ప్రదర్శిస్తున్న పలు శాస్త్రీయ ప్రయోగాలు వారి సృజనాత్మకతకు నిదర్శనమని తెలిపారు. నేటి పిల్లలు ప్రశ్నించే మనస్తత్వంతో శాస్త్రీయ ఆలోచనలతో ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు.

భారతదేశ అభివృద్ధిలో శాస్త్రీయ ఆవిష్కరణల పాత్ర అత్యంత కీలకమని, భవిష్యత్ భారత్ శాస్త్రసాంకేతికత ఆధారంగా ముందుకు సాగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్?2047' విజన్ లో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

అనుభవాత్మక విద్య ద్వారా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని, ఇది కేవలం పాఠశాలలకే కాకుండా పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటీఐలు, అడ్వాన్స్డ్ ట్రైనింగ్ సెంటర్ల వరకు విస్తరించాలన్నారు. ఈ తరహా సైన్స్ ఫెయిర్లు విద్యార్థుల్లో నేర్చుకునే తపనను పెంపొందిస్తాయని తెలిపారు.

ప్రదర్శనలో పాల్గొన్న ప్రతి విద్యార్థి ప్రతి ఎగ్జిబిట్‌ను పరిశీలించి, నేర్చుకుని, అనుభవం పొందాలని సూచించారు.

నేటి విద్యార్థులు చేస్తున్న చిన్న చిన్న ఆవిష్కరణలే రేపటి భారతదేశానికి మార్గనిర్దేశం చేసే గొప్ప శాస్త్రవేత్తలను తీర్చిదిద్దుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీజీఐసీ చైర్పర్సన్ నిర్మల జయప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు వైజ్ఞానికంగా ముందంజలో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అన్ని వసతులతో కూడిన విద్యా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేశ అభివృద్ధికి సాంకేతికతే వెన్నుదన్నుగా నిలుస్తుందని, విద్యార్థులు శాస్త్రీయ నైపుణ్యాలు పెంపొందించుకుని మరింత ఎదగాలని సూచించారు. విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ మాట్లాడుతూ, ఎస్సీఆర్టీ, విఐటిఎం, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం సహకారంతో ఈ వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో ఇండివిడ్యువల్, గ్రూప్, టీచర్లకు సంబంధించిన 199 ఎగ్జిబిట్లు, అలాగే 24 ఎన్జీఓల సైన్స్ స్టాళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 400 మందికి పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొంటుండగా, ప్రతిరోజూ సుమారు 4 వేల మంది పాఠశాల విద్యార్థులు ఈ ప్రదర్శనను వీక్షించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అంతకుముందు వివిధ పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, కార్పొరేటర్ పుష్ప నగేష్, అడిషనల్ కలెక్టర్ పాండు, గాడియం స్కూల్ ప్రిన్సిపల్ కీర్తి రెడ్డి, సీఈఓ రామకృష్ణారెడ్డి, విద్యాశాఖ ఆర్జేడీలు సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్ నాయక్, జూరీ సభ్యులు,డీఈఓ వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, గైడ్ టీచర్లు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్‌పై కఠిన చర్యలు

## రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి: సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. ప్రవీణ్ కుమార్.




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో జనవరి 19 (భారతశక్తి) భైంసా రూరల్ డ్రంక్డ్రైవ్ కారణంగా రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని భైంసా రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం నిర్వహించిన "అరైవ్ అండ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రంకెన్ డ్రైవ్ కేవలం నేరమే కాకుండా, ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో పడేసే చర్య అని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని, వేగ నియంత్రణ పాటించాలని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను తగ్గించవచ్చని చెప్పారు. యువత ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసులు చేపడుతున్న రోడ్డు భద్రత చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు, వాహనదారులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 75 దరఖాస్తులు, సంబంధించిన అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 19: సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో 75 అర్జీలను స్వీకరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు.

ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీలను అర్జీదారుల నుండి స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు ఇస్తూ తక్షణమే స్పందించి పరిష్కరించాలని తెలిపారు.

ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమొహన్ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్ డి ఓ వీణ, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి

## -పోలీస్ అధికారులంతా బాధ్యతగా పనిచేయాలి
## -ఎస్పీ రోహిత్ రాజు
## -శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలి
## -నేర సమీక్షా సమావేశంలో జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, (భారతశక్తి)జనవరి 19: రాబోయే మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులందరూ బాధ్యతగా తమ విధులు నిర్వర్తించాలని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. సోమవారం

జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలోని పోలీసు అధికారులతో సోమవారం నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల నియమావళిని అనుసరించి పటిష్టమైన ప్రణాళికను తయారు చేసుకోవాలని సూచించారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై ఉక్కుపాదం మోపాలని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు ర్యాలీలు, సభలకు అనుమతి తీసుకోవడం తప్పనిసరని, ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి×

జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్లో ఉన్న పలు కేసుల ఫైళ్లను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. న్యాయాధికారులతో సమన్వయంతో కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు. ప్రజలు సైబర్ క్రైమ్స్ బారిన పడి తమ డబ్బును కోల్పోకుండా, నిత్యం అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. రౌడీ షీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి రవాణా, మట్కా పేకాట, కోడి పందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి హాట్ స్పాట్స్ నందు నిత్యం పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్- అలివ్ కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఫోక్సో కేసుల్లోని నిందితులకు త్వరితగతిన శిక్ష పడేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డిఎస్పి చంద్రభాను, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, సైబర్ క్రైమ్స్ డిఎస్పీ అశోక్, సిఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.


# ఫిబ్రవరి 1న ఓపెన్ ఆక్షన్ క్రికెట్ టోర్నీ

## టోర్నీ బ్రోచర్, ట్రోఫీ ని ఆవిష్కరించిన డిఎస్పీ



మణుగూరు, జనవరి 19 (భారతశక్తి): లక్ష్మీ మెమోరియల్ సీజన్ 2 ,ఓపెన్ ఆక్షన్ క్రికెట్ టోర్నీ వచ్చే నెల ఒకటో తేదీ నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో.. టోర్నీ బ్రోచర్, ట్రోఫీ ని సోమవారం మణుగూరు డిఎస్పీ వంగా రవీందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని తద్వారా చెడు వ్యసనాలకు దూరంగా ఉండొచ్చన్నారు. ఎటువంటి వివాదాలకు తావు ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో టోర్నీలు నిర్వహించుకోవాలని కోరారు. మణుగూరు నేతాజీ క్రీడా మైదానంలో రెండోసారి వరుసగా జరిగే లక్ష్మీ ప్రీమియర్ లీగ్ టోర్నీ క్రీడా కారుల ఆక్షన్లు ఈ నెల 26 న ఉంటాయని.. టోర్నీలో ఆడే క్రీడాకారులు రూ,150 లు చెల్లించిన వారు వేలంలో పాల్గొనీటారన్నారని నిర్వాహకులు ఉమామహేశ్వరరావు, శశి కుమార్, నాగరాజు లు తెలిపారు. పన్నెండు నుండి పదహారు మాత్రమే ఫ్రాంచేసీలు ఉంటాయన్నారు. విన్నర్స్ కి ట్రోఫీతో పాటు రూ.30 వేలు, రన్నర్స్ కి ట్రోఫీతో పాటు రూ.20 వేల నగదు అందించనున్నామన్నారు. పూర్తి వివరాలకు 9949100250, 8866997333, 9505333271 నెంబర్లను సంప్రదించాలని ఉమ కోరారు. బ్రోచర్,ట్రోఫీ ఆవిష్కరణలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పిండిగ వెంకట్, కార్యదర్శి మార్తి శ్రీనివాసరావు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు వన్నం కృష్ణ మోహన్, సీనియర్ జర్నలిస్ట్ పొనగంటి కృష్ణలు పాల్గొన్నారు.

## 2,500 మంది ఆర్టిస్టులతో వందేమాతరం.. చాలా గర్వంగా ఉంది: కీరవాణి



ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత కీరవాణి అరుదైన అవకాశాన్ని అందుకున్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన 'వందేమాతరం' గేయాన్ని ఆయన కంపోజ్ చేయనున్నారు. ఈ గేయం 150 ఏళ్ల వార్షికోత్సవం నేపథ్యంలో జనవరి 26న జరగనున్న గణతంత్ర వేడుకలో కీరవాణి తన టీమ్‌తో కలిసి పాడనున్నారు. ఇది తనకెంతో గర్వకారణమని తెలుపుతూ ఆయన పోస్ట్ పెట్టారు. ''ఐకానిక్ గేయం వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జనవరి 26న జరగనున్న గణతంత్ర దినోత్సవంలో దీన్ని ఆలపించనున్నా. ఇది నాకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నా. భారతదేశంలోని నలుమూలల్లో ఉన్న 2,500 మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొననున్నారు. ఆరోజు కోసం ఎదురుచూస్తున్నాను'' అని కీరవాణి ఎక్స్ వేదికగా తెలిపారు. 2,500 మంది కళాకారులు పాల్గొంటారని చెప్పడంతో దీనిపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. 1885లో బంకించంద్ర ఛటర్జీ రచించిన ఈ గేయానికి గతేడాది నవంబర్ 7కు 150 ఏళ్లు పూర్తయిన విషయం తెలిసిందే. ఇక ప్రస్తుతం కీరవాణి 'వారణాసి' కోసం వర్క్ చేస్తున్నారు. రాజమౌళి దర్శకత్వంలో రానున్న ఈ సినిమాలో మహేశ్ బాబు, ప్రియాంక చోప్రా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. దీని గ్లోబ్‌ట్రాటర్ ఈవెంట్‌లోనూ కీరవాణి తన ప్రదర్శనతో ఆకట్టుకొని ప్రపంచం దృష్టిని ఆకర్షించారు.

## అలాగైతే స్పెషల్ సాంగ్స్ అయినా ఓకే: రష్మిక



వరుస సినిమాలతోనే కాదు.. వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తూ ప్రేక్షకులకు ఎప్పుడూ దగ్గరగా ఉంటారు నటి రష్మిక. తాజాగా ఆమె ఓ చిట్‌చాట్‌లో పాల్గొన్నారు. అభిమానులు అడిగిన ప్రశ్నలకు ఆసక్తికర సమాధానాలిచ్చారు. తనపై వచ్చిన రూమర్స్, తన సినిమాల గురించి పలు విషయాలను పంచుకున్నారు. ''నేను 2016 నుంచి ఇప్పటివరకూ ఒకేలా పని చేస్తున్నాను. ఎలాంటి భాషాపరమైన హద్దులు లేకుండా భిన్నమైన చిత్రాలను ఎంచుకుంటూ అలరిస్తున్నాను. ఇకపై కూడా అలానే ఉంటాను. అన్నిరకాల చిత్రాల్లో నటించాలని ఉంది. నేను హీరోయిన్‌ని. ప్రేక్షకులకు వినోదాన్ని పంచడమే నా పని. అందరికీ నచ్చే చిత్రాలు చేయడానికి ప్రయత్నిస్తుంటా. అందుకే కమర్షియల్, లవ్ స్టోరీ, స్త్రీ ప్రాధాన్యం ఉన్న చిత్రాలు.. ఇలా అన్నీ అంగీకరిస్తాను. కొందరికి ప్రేమ కథలు ఇష్టం.. మరికొందరికి కమర్షియల్ చిత్రాలంటే ఇష్టం. వాళ్లందరి కోసమే వైవిధ్యమైన కథలను ఓకే చేస్తుంటాను'' ''వ్యూస్‌తో డబ్బులు సంపాదించడం కోసం నెగెటివిటీ సృష్టించి కొందరు మనపై ఏదేదో రాస్తారు. వాళ్లకు నిజంగానే నాపై కోపం ఉండొచ్చు.. దానికి ఇంకాస్త యాడ్ చేసి రాస్తుంటారు. నిజాయతీగా చెప్పాలంటే అలాంటి వార్తలు కూడా ఎంతోమందిని పోషిస్తున్నాయి. పోనీలే.. వాళ్లను కూడా బతకనీ అని వదిలేస్తా. ఇండస్ట్రీలో ఉన్నవారికి నెగెటివిటీ కామన్. అందుకే అందరి పైనా వార్తలు వస్తూనే ఉంటాయి. ఏదోఒకరోజు ప్రజలకు నిజం తెలుస్తుంది అని అనుకుంటా. కానీ, ఇప్పటివరకూ ఎవరూ మారలేదు. ఒకప్పుడు రూమర్స్ విని ఎంతో బాధ పడేదాన్ని. ఇప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నా. జీవితంలో జరిగిన ప్రతి విషయం నుంచి ఏదోఒకటి నేర్చుకుంటూ ముందుకుసాగుతున్నా'' అని రష్మిక అన్నారు. ఇక తన గురించి వచ్చే రూమర్స్‌లో ఒక దానిపై రష్మిక స్పష్టతనిచ్చారు. ''ఇండస్ట్రీలో ఎక్కువ పారితోషికం తీసుకునే నటిని నేనే అని అందరూ అనుకుంటారు. అది అపోహ మాత్రమే. నేనేం హీరోని కాదు, ఎక్కువ తీసుకోవడానికి. అది నిజం అయితే బాగుండు అని నేనూ ఎదురుచూస్తున్నా. నేను ప్రత్యేక పాటల్లోనూ నటించడానికి సిద్ధంగా ఉన్నా. కాకపోతే ఆ చిత్రంలో నేనే హీరోయిన్ అయిఉండాలి. లేదంటే ఇండస్ట్రీలో ముగ్గురు దర్శకులు ఉన్నారు. వాళ్లు అడిగితే కచ్చితంగా లీడ్ రోల్ కాకపోయినా వాళ్ల సినిమాల్లో స్పెషల్ సాంగ్ చేస్తా'' అని చెప్పారు. ఆ దర్శకులు ఎవరో మాత్రం ఆమె చెప్పలేదు.

# సినిమా

## కమ్‌బ్యాక్



మన శంకర వరప్రసాద్ గారు మూవీతో మెగాస్టార్ చిరంజీవి రీసెంట్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఆ ఫ్యామిలీ ఎంటర్టైనర్ సంక్రాంతి కానుకగా థియేటర్స్‌లో రిలీజై బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్ల క్లబ్ వైపు పరుగులు పెడుతోంది. భోళాశంకర్ తర్వాత ఇప్పుడు మన శంకర వరప్రసాద్ గారు మూవీతో ఆయన కమ్ బ్యాక్ ఇచ్చినట్లయింది. ప్రస్తుతం ఆయన బాబీ కొల్లి దర్శకత్వంలో ఓ సినిమా మొదలుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో చిరు ఫుల్ మాస్ రోల్ లో కనిపించనున్నట్లు సమాచారం. ఇప్పటికే మెగాస్టార్ కు వాల్తేరు వీరయ్య మూవీతో మంచి హిట్ ఇచ్చిన బాబీ.. ఇప్పుడు అంతకుమించి ప్లాన్ చేస్తున్నాడని టాక్. అటు బాబీ కొల్లి మూవీ షూటింగ్ లో పాల్గొంటూనే.. ఇటు విశ్వంభర మూవీ పనులను చిరంజీవి పర్యవేక్షిస్తాడని తెలుస్తోంది. సోషియో ఫాంటసీ ప్రాజెక్ట్ గా రూపొందుతున్న విశ్వంభర గత ఏడాది సంక్రాంతికి రిలీజ్ కావాల్సి ఉండగా.. పనులు పూర్తికాకపోవడంతో వాయిదా పడింది. ప్రస్తుతం షూటింగ్ పూర్తయి పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి.

## బిగ్‌చాన్స్ మిస్



టాలీవుడ్‌లో నాలుగు దశాబ్దాలుగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న స్టార్ హీరో అక్కినేని నాగార్జున. రొమాంటిక్ హీరోగా మొదలై.. యాక్షన్, ఫ్యామిలీ, క్లాస్, మాస్‌తో పాటు ఇప్పుడు నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో కూడా ప్రేక్షకుల్ని అలరిస్తున్నాడు. ప్రస్తుతం తన 100వ సినిమా దిశగా అడుగులు వేస్తున్న విషయం తెలిసిందే. ఇలాంటి సమయంలో ఆయనకు సంబంధించిన ఓ ఆసక్తికర వార్త నెట్టింట వైరల్ అవుతోంది. బాలీవుడ్‌లో సంచలన విజయం సాధించిన ధురంధర్ సినిమాలో విలన్ పాత్ర కోసం మొదట నాగార్జుననే సంప్రదించారట. కథ, క్యారెక్టర్ బాగా నచ్చినప్పటికీ.. అదే సమయంలో ఆయన రజనీకాంత్ హీరోగా తెరకెక్కిన 'కూలీ', ధనుష్ నటించిన 'కుబేర' వంటి సినిమాల్లో నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో నటిస్తున్నాడు. ఈ రెండు సినిమాల షూటింగ్స్ ఒకేసారి జరగడంతో ధురంధర్ కు అవసరమైన డేట్స్‌ను అడ్జస్ట్ చేయడం కుదరక ఈ ప్రాజెక్ట్‌ను వదులుకోవాల్సి వచ్చిందట. దాంతో దర్శకుడు ఆదిత్య ధార్ చివరకు అక్షయ్ ఖన్నాను విలన్ పాత్రకు ఎంపిక చేశారని సమాచారం. అక్షయ్ ఖన్నా ఆ పాత్రకు పూర్తి న్యాయం చేశాడని విమర్శకులు ప్రశంసించినప్పటికీ.. ఒకవేళ నాగార్జున ఆ సినిమాలో కనిపించి ఉంటే మరింత పవర్‌ఫుల్‌గా ఉండేదని ఆయన అభిమానులు భావిస్తున్నారు. అందుకే ఇప్పుడు సోషల్ మీడియాలో నాగ్ మిస్ అయిన బిగ్ ఛాన్స్ అంటూ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.

## ఫుల్ జోష్






బాలీవుడ్ లో పార్టీ కల్చర్ గురించి ఇప్పుడే పరిచయం చేయాల్సిన పని లేదు. హిందీ పరిశ్రమలో పాశ్చాత్య ధోరణులు, అలవాట్ల గురించి ఇప్పటికే చాలా పెద్ద చర్చ సాగింది. ఇక జెన్ జెడ్ గురించి చెప్పేదేం ఉంటుంది? ఇలాంటి అలవాట్లలో యువ నటీనటులు ఇంకా స్పీడ్ గా ఉన్నారు. ఇప్పుడు బాలీవుడ్ నటి శ్వేతా తివారీ గారాల పట్టి పాలక్ తివారీ చేతిలో మందు గ్లాస్ తో చిల్ చేస్తూ కుర్రాళ్ల గుండెల్లో గుబులు పెంచేసింది. మరి ఈ బ్యూటీకి మద్యపానం అలవాటు ఉందా? అంటే గతంలో పలు ఇంటర్వ్యూల సందర్భంగా తాను మద్యం ముట్టనని చెప్పుకొచ్చింది. స్నేహితులతో పార్టీలకు వెళ్లినప్పుడు కూడా అందరూ డ్రింక్స్ తీసుకుంటే తను మాత్రం కేవలం సూప్ తాగుతూ ఎంజాయ్ చేస్తానని, ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడానికి ఇలాంటి అలవాట్లకు దూరంగా ఉంటానని చెప్పింది. కానీ తాజాగా చేతిలో మందు గ్లాస్ పట్టుకొని ఫోజులివ్వడమే కాకుండా.. జనవరి అంటూ సింపుల్ పదాన్ని జోడించింది. దీని అర్థం కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టగానే తాను ఫుల్ జోష్‌లోకి వెళ్లిపోయానని చెప్పడమే.

## 'జన నాయగన్'కు జరిగినట్లు ఏ సినిమాకీ జరగకూడదు: సుధా కొంగర





గత కొన్ని రోజులుగా విజయ్ నటించిన 'జన నాయగన్' ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా గురించి దర్శకురాలు సుధా కొంగర ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. విజయ్‌కు తాను వీరాభిమానినని చెప్పిన ఆమె.. ఈ సినిమాకు జరిగినట్లు దేనికీ జరగకూడదన్నారు. ''నేను విజయ్‌ను ఆరాధిస్తాను. అతడికి ఉన్న వీరాభిమానుల్లో నేను మొదటి వరుసలో ఉంటాను. ఆయనతో సినిమా చేయాలని కూడా గతంలో ప్లాన్ చేశాను. కొన్ని కారణాల వల్ల అది ముందుకుసాగలేదు. ఆయన నటించిన 'జన నాయగన్' మా 'పరాశక్తి'తో పాటు విడుదల కావాల్సిఉంది. మా చిత్రం ఆడియో లాంచ్‌లోనూ నేను దీని గురించి మాట్లాడాను. కావాలంటే 'పరాశక్తి'ని 200 సార్లు చూస్తాను. కానీ, విజయ్ 'జన నాయగన్'కు మాత్రం మొదటిరోజు మొదటి షోకు వెళ్తాను అని స్టేజ్ మీదనే చెప్పా. దాని విడుదల కోసం నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. రిలీజ్‌కు కొన్ని గంటల ముందు సెన్సార్ కారణంగా వాయిదా పడింది. అలా ఏ సినిమాకీ జరగకూడదు. ఆయన చిత్రంతో పోటీపడాలని మేం ఎప్పుడూ అనుకోలేదు. దేశంలోనే అతిపెద్ద స్టార్‌తో మేం ఎలా పోటీ పడతాం?.. అలా ఎవరూ చేయరు'' అని సుధా కొంగర అన్నారు. ఇక సుధా కొంగర దర్శకత్వంలో వచ్చిన 'పరాశక్తి'కూడా ఎన్నో వివాదాలను ఎదుర్కొంది. ఎట్టకేలకు జనవరి 10న ప్రేక్షకుల ముందుకువచ్చింది. అయితే, దీనిపై కొందరు ఉద్దేశపూర్వకంగా నెగెటివ్ రివ్యూలు ఇచ్చారని అందుకే ఆ చిత్రం అనుకున్న స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకోలేకపోయిందని ఆమె ఇటీవల అసహనం వ్యక్తంచేశారు.

# జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలి

* **కార్మిక వ్యతిరేక విధానాలు మోడీ ప్రభుత్వం విడనాడాలి**
* **విద్యుత్ సవరణ బిల్లు, విత్తన బిల్లులు కార్పొరేట్ శక్తులలాభాల కోసమే**
* **కార్పొరేట్ నియంతృత్వానికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెలో లక్షలాదిమంది రైతులు, కార్మికులు,వ్యవసాయ కార్మికులు పాల్గొనాలి**
* **అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధానకార్యదర్శి- బి.వెంకట్**




సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)జనవరి 19: అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలో అధికారంలోఉన్న బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ కూలీల నోటిలో మట్టి కొట్టేందుకు వి. బి.జి రాంజీ పేరుతో కొత్త బిల్లు తెచ్చిందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ఆరోపించారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఆయా సంఘాలు దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో నల్లాల బావి సెంటర్ నుండి కొత్త బస్టాండ్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కొత్త బస్టాండ్ సెంటర్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నరేంద్ర మోడీ సర్కార్ పాలనలో ప్రజా వ్యతిరేక రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ సమస్యలను పరిష్కరించాల్సింది పోయి కొత్త సమస్యలను తీసుకువస్తున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని రద్దుచేసి ఆ స్థానంలో విబి జి రామ్ జి అనే కొత్త చట్టాన్ని తీసుకువచ్చారని అన్నారు. పాత చట్టాన్ని మహాత్మా గాంధీ పేరును తొలగించడమే ప్రధాన ఉద్దేశంతో పలకడానికి వీలు లేనటువంటి హిందీ ఇంగ్లీష్ పదాలతో కూడిన వికాసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) అనే కొత్త చట్టాన్ని తీసుకువచ్చారని ఆరోపించారు .ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం కొరకు ఈ పథకంలో 100 రోజుల పనిని 125 రోజులకు పెంచుతున్నామని ప్రజలను నమ్మించడం కోసం 125 రోజులకు పెంచారని చెప్పారు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు 200 రోజుల పని దినాలు కల్పించాలని చాలా సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నారని అన్నారు. 125 రోజుల పని నోటిఫైడ్ ఏరియాలకు మాత్రమే వర్తిస్తుందని బిల్లులో పేర్కొందన్నారు .కేంద్ర ప్రభుత్వము గత చట్టంలో 90 శాతం నిధులు ఇవ్వాల్సి ఉంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం 10% మాత్రమే ఖర్చు చేసేది అన్నారు. కానీ ఉపాధి హామీ పనిని నిర్వీర్యం చేయడం కొరకు రాష్ట్రాలు 40 శాతం వాటా చెల్లించాలని ఈ చట్టంలో పొందుపరిచారని విమర్శించారు. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వకపోవడం వల్ల ఉపాధి హామీ పనులు ఆగిపోతాయన్నారు .ఈ విధంగా ఉపాధి హామీ చట్టం నిర్వీర్యం అవుతుందని చెప్పారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని పని దినాలను 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చారని దీని ద్వారా కార్మికుడు సంఘం పెట్టుకునే హక్కు నీ సమ్మె చేసే హక్కుని కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చిన నరేంద్ర మోడీ సర్కార్ రైతులు పెద్ద ఎత్తున సంవత్సర కాలంగా పోరాటం చేసి అనేకమంది అమరులై నరేంద్ర మోడీ మెడలు వంచి రెండు చేతుల క్షమాపణ చెప్పించిన ఘనత రైతు పోరాటందని అన్నారు.వెంటనే తప్పుడు చట్టాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దేశంలోని 40 కోట్ల మంది కార్మికుల హక్కులను కార్పొరేట్ యజమానుల పాదాల కింద నలిపివేయాలనే లక్ష్యంతో కేవందేళ్ల కార్మిక ఉద్యమాల ద్వారా సాధించుకున్న హక్కులను ఒక్క కలంతో తుడిచిపెట్టడమే లేబర్ కోడ్ల అసలైన ఉద్దేశమని అన్నారు. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌ను పక్కనపెట్టి, పార్లమెంట్‌లో ప్రతిపక్షాన్ని అణిచివేసి, ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతూ ఈ చట్టాలను ఆమోదింప జేయడం నియంతృత్వ పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ఫిక్స్డ్ టర్మ్ ఉపాధి పేరుతో శాశ్వత ఉద్యోగాల నాశనం, హైర్ అండ్ ఫైర్ విధానంతో ఉద్యోగభద్రతఅంతమొందింపు, కనీస వేతనాన్ని నిర్వచించకుండా కార్మికుడిని ఆకలిచావుకు నెట్టడం, ట్రేడ్ యూనియన్ హక్కులపై ఆంక్షలు, కాంట్రాక్టు-వలస కార్మికులపై నిర్బంధంలేని దోపిడీ, ఈఎస్ఐ, ఈపీఎఫ్, గ్రాట్యుటీ వంటి సాంఘిక భద్రతా చట్టాల నిర్వీర్యం, తనిఖీ వ్యవస్థ రద్దు చేసి యజమానుల సెల్ఫ్ సర్టిఫికేషన్‌కు చట్టబద్ధత కల్పించడం ద్వారా కార్మిక వర్గాన్ని పూర్తిగా నిరాధారులుగా మార్చడమే ఈ కోడ్ల లక్ష్యమని అన్నారు.మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల కోసం పాలన సాగిస్తూ కార్మికుల జీవితాలపై బుల్డోజర్లు నడుపుతోందని, లేబర్ కోడ్లు కార్మిక వర్గంపై బహిరంగ యుద్ధ ప్రకటనతో సమానమని స్పష్టం చేశారు. నాలుగు లేబర్ కోడ్ల రద్దు, పాత కార్మిక చట్టాల పునరుద్ధరణ, గౌరవప్రదమైన కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సాంఘిక భద్రత, ట్రేడ్ యూనియన్ హక్కుల సంపూర్ణ అమలే లక్ష్యంగా ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కుల,మత,వర్గ భేదాలు లేకుండా కార్మికులు, ఉద్యోగులు, ప్రజలంతా ఏకమై పాల్గొని కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు గట్టి రాజకీయ సమాధానం ఇవ్వాలని ప్రజానీకానికి పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ములకలపల్లి రాములు, మట్టి పెల్లి సైదులు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కొలిశెట్టి యాదగిరిరావు, కొప్పుల రజిత, దేవరం వెంకటరెడ్డి, మేరెడ్డి కృష్ణారెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు చెరుకు ఏకలక్ష్మి, ఎం రాంబాబు, సేలం శ్రీను, ఎలక సోమయ్య గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జంపాల స్వరాజ్యం, పోసనబోయిన హుస్సేన్, సోమపంగా జానయ్య, ఆరే రామకృష్ణారెడ్డి, ప్రజా సంఘాల నాయకులు మద్దెల జ్యోతి, వేల్పుల వెంకన్న, వల్లపు దాసు సాయికుమార్, పిండిగా నాగమణి, మిట్టపల్లి లక్ష్మి, చర్లపల్లి మల్లయ్య, దోసపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి అభివృద్ధికి నా తుదిశ్వాస వరకు పాటుపడతా : షబ్బీర్ అలీ

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 19: ఎమ్మెల్యే ధ్యాస ప్రోటోకాల్‌పైనే.. నా ధ్యాస అభివృద్ధిపైనే! కామారెడ్డి ప్రజల దాహార్తిని తీర్చడం కోసం గతంలోనే 120 కిలోమీటర్ల దూరం నుండి గోదావరి జలాలను తీసుకువచ్చాను. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ వ్యవస్థను నిర్వీర్యం చేసి మళ్లీ కామారెడ్డికి నీటి కష్టాలు తెచ్చింది" అని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ విమర్శించారు. కామారెడ్డి పట్టణంలోని 15వ వార్డులో రూ. 1.35 కోట్లతో సీసీ రోడ్లు, పార్కు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో షబ్బీర్ అలీ మాట్లాడుతూ, కామారెడ్డికి 25 ఏళ్ల వరకు నీటి కష్టాలు రాకుండా నేను ఎంతో కష్టపడి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమృత్ పథకం కింద రూ. 200 కోట్లు మంజూరు చేయించామని, దీనివల్ల రాబోయే 25 ఏళ్ల వరకు కామారెడ్డి పట్టణానికి తాగునీటి ఇబ్బందులు ఉండవని షబ్బీర్ అలీ స్పష్టం చేశారు. తాను ఎప్పుడూ పేరు కోసం పనిచేయలేదని, ప్రజల కష్టాలు తీర్చడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రోటోకాల్ రాజకీయాలపై విమర్శలు స్థానిక ఎమ్మెల్యే రమణారెడ్డిపై షబ్బీర్ అలీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గడిచిన రెండేళ్లుగా ఎమ్మెల్యే సహకారం కోసం వేచి చూశాను. కానీ ఆయనకు అభివృద్ధి కంటే ప్రోటోకాల్‌పైనే ఎక్కువ ధ్యాస ఉంది. అభివృద్ధి జరుగుతున్న చోట 14 గ్రామాలపై విజిలెన్స్ విచారణకు ఫిర్యాదు చేయడం ఆయన వైఖరికి నిదర్శనం" అని మండిపడ్డారు. అధికారులు శంకుస్థాపనల కోసం సమయం అడిగితే మహారాష్ట్ర, ఢిల్లీలో ఉన్నానని చెబుతూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కొడంగల్‌తో సమానంగా నిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి, ఆయన నియోజకవర్గం కొడంగల్‌కు ఇచ్చే నిధుల్లో



సగం అయినా కామారెడ్డికి ఇవ్వాలని కోరానని, దానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి కొడంగల్‌తో సమానంగా నిధులు ఇస్తామని హామీ ఇచ్చారని షబ్బీర్ అలీ వెల్లడించారు.

* **ప్రస్తుత అభివృద్ధి పనుల వివరాలు: ఇందిరా గాంధీ స్టేడియం: రూ. 9 కోట్లతో ఆధునీకరణ.**

వార్డుల అభివృద్ధి: పట్టణంలోని ప్రతి వార్డుకు రూ. 50 లక్షల చొప్పున మొత్తం రూ. 26 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పార్కుల నిర్మాణం. 15వ వార్డు: రూ. 1.35 కోట్లతో ప్రత్యేక అభివృద్ధి పనులు. ఆదివారం ప్రారంభించామని అన్నారు.

* **అభివృద్ధి చేసేవారికే పట్టం కట్టండి**

"ఇక్కడ ప్రజలు మాజీ సీఎం కేసీఆర్‌ను ఓడించారు, ప్రస్తుత సీఎంను మూడో స్థానంలో నిలిపారు. కానీ అభివృద్ధి మాత్రం ఆగదు. శిలాఫలకాలు వేయనివ్వకపోయినా, అడ్డంకులు సృష్టించినా కామారెడ్డిని అభివృద్ధి చేసి తీరుతా" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసే వారికే ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నిజామాబాద్ ఇన్‌ఛార్జ్ పదవిలో ఉన్నప్పటికీ, తన సొంత గడ్డ అయిన కామారెడ్డి అభివృద్ధి కోసం నిరంతరం తాపత్రయపడతానని షబ్బీర్ అలీ పునరుద్ఘాటించారు.

## దేశ సాంకేతిక, ఆర్థికాభివృద్ధికి ఊతమిస్తున్న డ్రోన్లు

* **ఐదు రోజుల బూట్ క్యాంప్ ప్రారంభోత్సవంలో సీ-డాక్ హైదరాబాద్ నిపుణుడు ప్రణయ్**



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 19 : మన దేశ సాంకేతిక, ఆర్థికాభివృద్ధిలో డ్రోన్ల ప్రాముఖ్యత పెరుగుతోందని, రక్షణ రంగంతో పాటు వ్యవసాయం, బట్వాడా (డెలివరీ), ఆరోగ్య సంరక్షణ, సర్వేలలో కూడా అవి కీలక భూమిక పోషిస్తున్నాయని సీడాక్ హైదరాబాదు ప్రాజెక్టు లీడర్ ఎం. ప్రణయ్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'అటానమస్ ఎయిర్ క్రాఫ్ట్ సిస్టమ్స్ & డ్రోన్ టెక్నాలజీస్'పై నిర్వహిస్తున్న ఐదు రోజుల (19 నుంచి 23వ తేదీ వరకు) బూట్ క్యాంపు ప్రారంభోత్సవంలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొన్నారు. మానవ రహిత ఎయిర్ క్రాఫ్ట్ సిస్టమ్స్ (యూఏఎస్) లేదా డ్రోన్, అనుబంధ సాంకేతికతలలో సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో MeitY's స్వయాన్ కార్యక్రమంలో భాగంగా ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఇందులో భాగంగా, అభివృద్ధి చెందుతున్న యూఏవీ సాంకేతికతలపై దృష్టి సారించిన సీడాక్ హైదరాబాదు, ఒక విస్తృతమైన ఆచరణాత్మక శిక్షణా కార్యక్రమాన్ని గీతంలో ఏర్పాటు చేసిందన్నారు.ఈ ఐదు రోజుల కార్యక్రమ లక్ష్యాలు, డ్రోన్ల వర్గీకరణ, అందులోని భాగాలు, చేయదగిన, చేయకూడని పనులు, వాడే విధానాలు, వినియోగించే సాంకేతిక పరిజ్ఞానంతో పాటు డ్రోన్ టెక్నాలజీ యొక్క ఔచిత్యాన్ని విద్యార్థులకు ప్రణయ్ వివరించారు. స్వయాన్ జాతీయ డ్రోన్ కార్యక్రమం, దాని కీలక ప్రయోజనాలు, కార్యకలాపాలు, అభ్యాస విధానం, శిక్షణ కార్యక్రమ వివరాలు, ఆశిస్తున్న ఫలితాలను ప్రణయ్ వివరించారు. ఆయనకు సీడాక్ ప్రాజెక్టు ఇంజనీరు టీ.ఏ.అశ్విన్, ప్రాజెక్టు అసోసియేట్ సి.మనీజలకు సహకరించారు.ఈ ఐదు రోజుల కార్యక్రమంలో డ్రోన్ సాంకేతికత, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నిబంధనలు, డ్రోన్ డైనమిక్స్, సెన్సార్లు, విడిభాగాలు, నియంత్రణ, ఆచరణాత్మక వినియోగం, భద్రత, ప్రతిఘటనలు, డ్రోన్ అసెంబ్లింగ్, ఫ్లయింగ్, డ్రోన్ సిమ్యులేషన్ సాధనాల యొక్క ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పిస్తారు. దీనిని విజయవంతంగా పూర్తిచేసిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను జారీచేస్తారు.ఈ శిక్షణ ముగిసే సమయానికి, విద్యార్థులు డ్రోన్లపై ప్రధాన భావనాత్మక అవగాహన, ఆచరణాత్మక సాంకేతిక నైపుణ్యాలు, పరిశ్రమలో వినియోగం, నియంత్రణలపై లోతైన అవగాహన, ఇతరులతో పరిచయాలు, మంచి కెరీర్ ను ఎంచుకునేందుకు తోడ్పడడంతో పాటు ఆవిష్కరణ, వ్యవస్థాపకతకు దారితీసేలా ప్రేరేపిస్తున్నారు.తొలుత, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి వక్తలను స్వాగతించగా, నిర్వాహకురాలు డాక్టర్ డి. అనిత వారిని విద్యార్థులకు పరిచయం చేశారు. సహ నిర్వాహకుడు డాక్టర్ సీహెచ్. ప్రవీణ్ కుమార్ ఈ క్యాంపును సమన్వయం చేస్తున్నారు.



## భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిపై అసత్యపు ఆరోపణలు మానుకోవాలి

* **రెండేళ్ల సమయంలో రూ.350 కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టాం..**
* **మరో రూ.150 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకి జీవో లు తీసుకొచ్చాం.**
* **అభివృద్ధిని చూసి ఓర్వలేకే కొందరు నేతల తప్పుడు ఆరోపణలు.**
* **రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు మీకు బుద్ధి చెప్పడం ఖాయం.. అన్ని వార్డుల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం.**
* **భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.**

భూపాలపల్లి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 19: భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిపై కొందరు కావాలని అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని,వాటిని తక్షణమే మానుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు. భూపాలపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, మరికొంత మంది ముఖ్య నేతలు మరియు మాజీ కౌన్సిలర్లతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... గడిచిన రెండేళ్ల సమయంలో భూపాలపల్లి మున్సిపాలిటీ లోని అన్ని వార్డుల్లో సుమారు రూ.350 కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. అదేవిధంగా, మరో రూ.150 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకి జీవో లు కూడా రెండు రోజుల కిందట తీసుకొచ్చామని తెలిపారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే కొందరు నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు మీకు బుద్ధి చెప్పి, 30 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించి, అత్యధిక మెజారిటీ ఇచ్చి గెలిపించుకోవడం ఖాయమన్నారు. మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సౌకర్యాలకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే అనేక పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంటే, మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. అభివృద్ధి పనులపై ఎవరికైనా సందేహాలు ఉంటే అధికారికంగా వివరాలు తెలుసుకోవచ్చని, కానీ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. భూపాలపల్లి పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే బాధ్యత తమదేనని, ప్రజలు రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించుకోవాలని కోరారు.



చైతన్యపురి కాలనీ సభ్యులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధిలో అన్నివిధాలా తోడు ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సొంటి చంద్రశేఖర్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు కృష్ణ మూర్తి, వైస్ ప్రెసిడెంట్ రఘునాథ రెడ్డి, శరత్ కుమార్, జనరల్ సెక్రటరీ రామారావు,కాలినీ సభ్యులు పద్మనాభ శాస్త్రి, కృష్ణయ్య,పవన్ కుమార్, అజయ్ పాల్, వెంకట రమణ, చంద్రకుమార్, పార్థ సారథి తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్, జనవరి 19 (భారత శక్తి):

# గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

* **పల్లెల్లో పర్యాటక అభివృద్ధితో ఆర్థిక ప్రగతి సాధ్యం**
* **గ్రామపంచాయితీ సర్పంచుల శిక్షణ తరగతుల్లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, (భారతశక్తి) జనవరి 19: గ్రామాల సమగ్ర అభివృద్ధిలో గ్రామపంచాయితీ సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, ప్రభుత్వం అందిస్తున్న నిధులను నియమ నిబంధనలకు అనుగుణంగా సక్రమంగా వినియోగించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సర్పంచులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయితీ సర్పంచుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కెఎస్ఎం ఓల్డ్ క్యాంపస్)లో ఏర్పాటు చేయగా, జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని మొత్తం 471 మంది గ్రామపంచాయితీ సర్పంచులకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని విడతల వారీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతులు ఈ నెల 19 నుండి 23 వరకు, ఫిబ్రవరి 03 నుండి 07 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. నేడు ప్రారంభమైన తొలి విడతలో భాగంగా జిల్లాలోని 14 మండలాలకు చెందిన 237 మంది నూతన గ్రామపంచాయితీ సర్పంచులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైందని అధికారులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులకు గ్రామ పాలన, పరిపాలన విధానాలపై సమగ్ర అవగాహన కల్పించడమే ఈ శిక్షణ కార్యక్రమాల లక్ష్యమన్నారు. శిక్షణలో భాగంగా పంచాయితీ రాజ్ చట్టం, గ్రామ పాలనలో పాటించవలసిన విధులు, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం, సర్పంచుల బాధ్యతలు, కర్తవ్యాలపై సవివరంగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గ్రామపంచాయితీలకు అందే వివిధ అభివృద్ధి పథకాల నిధులను సక్రమంగా వినియోగించుకుని, ప్రజల మౌలిక అవసరాలైన తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్, ఆరోగ్యం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సర్పంచులకు సూచించారు. గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అలాగే రోడ్లు, వీధిదీపాలు, విద్యుత్ స్తంభాలు, పబ్లిక్ టాయిలెట్లు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో



మౌలిక వసతులు సక్రమంగా ఉన్నాయా లేదా సర్పంచులు నిరంతరం పర్యవేక్షించాలని, చిన్నారులు, బాలింతలకు పోషకాహారం సముచితంగా అందుతున్నదీ లేనిదీ పరిశీలించాలని సూచించారు. అలాగే అక్షరాస్యత పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పోస్ట్ ఆఫీస్‌లో ఖాతా తెరిచి సంవత్సరానికి రూ.500 చెల్లిస్తే ఇన్సూరెన్స్ లభించే (ఎన్ఎస్పీఎస్) పథకంలో గ్రామస్తులు చేరేలా సర్పంచులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పథకం ద్వారా కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలో అంత్యక్రియల నిమిత్తం రూ.20,000 ఆర్థిక సహాయం లభిస్తుందని వివరించారు. జిల్లాలో అనేక అందమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నప్పటికీ సరైన ప్రచారం లేక అభివృద్ధికి దూరంగా ఉన్నాయని అన్నారు. ప్రతి సర్పంచ్ తమ గ్రామాల్లోని పర్యాటక ప్రదేశాలు, సహజ వనరులు, విశిష్టతలను విస్తృతంగా ప్రచారం చేస్తే అవి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెంది గ్రామాల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని తెలిపారు. సర్పంచులు కేవలం పంచాయితీ శాఖకే పరిమితం కాకుండా, గ్రామపంచాయితీలో జరిగే ప్రతి పనిలో అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని చొరవ తీసుకొని గ్రామాభివృద్ధికి నాయకత్వం వహించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే ప్రతి గ్రామంలో ఇప్పపువ్వు చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాలని, దీని ద్వారా లక్షల రూపాయల ఆదాయం వచ్చే అవకాశముందని తెలిపారు. పశుసంపద పెంపుదలతో పాటు మేత సంపద సృష్టి జరిగి ప్రభుత్వ సబ్సిడీలు కూడా లభిస్తాయని వివరించారు. గ్రామాల్లోని 18 నుంచి 20 సంవత్సరాల లోపు నిరుద్యోగ యువతపై ప్రత్యేక దృష్టి సారించి, జిల్లా యంత్రాంగం నిర్వహించే ఇంటర్వ్యూలు, ఉపాధి అవకాశాలకు వారిని ప్రోత్సహించాలని, యువతను ప్రయోజకులుగా మార్చే దిశగా సర్పంచులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డీపీఓ సుధీర్, శిక్షణ డీపీఓ అనూష, డీఎల్పీఓలు ప్రభాకర్, రమణ, టీజీఐఆర్డీ సెంటర్ హెడ్ సుభాష్‌చంద్ర గౌడ్, ట్రైనర్లు బన్సింగ్, రవీందర్ రెడ్డి, సునీల్ కుమార్, ముత్యాలరావు, హజ్‌రత్ వలి, ఏపీవో రంగ, ఎస్‌బీఎం రేవతి, డిటిఎం సందీప్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# నాలుగో తరగతి ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 19: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా సంఘం సంగారెడ్డి క్యాలెండర్ ను సోమవారం జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు జావిద్ ఆలీ, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రవి, కోశాధికారి శ్రీనివాస్, టీఎన్జీవో టౌన్ ప్రెసిడెంట్ వెంకటేశం, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎండి షరీఫ్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జే నాగరాజు, సహాయ అధ్యక్షులు పి అశోక్, కార్యవర్గ సభ్యులు, సంగారెడ్డి టౌన్ అధ్యక్షులు వి. పండరి, పి శ్రీకాంత్, జహీరాబాద్ తాలూకా అధ్యక్షులు ఏ దయాకర్, ఎండి ఎక్బాల్, ఏ శ్యామ్ రావు పటాన్చెరు తాలూకా అధ్యక్షులు ఎస్ ఆబెల్ కార్యదర్శి, జోగిపేట్ అధ్యక్షులు తాలూకా బి.హరీష్ కుమార్, మహమ్మద్ రఫీ కార్యదర్శి, నారాయణఖేడ్ అధ్యక్షులు తాలూకా నర్సింలు, జి .బాగన్న కార్యదర్శి, నాలుగో తరగతి జిల్లా సభ్యులు అందరు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

* **అట్టహాసంగా మహిళ శక్తి సంబురాలు**

మణుగూరు, జనవరి 19 (భారతశక్తి): ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని వేణు ఫంక్షన్ హాల్లో ఇందిరా మహిళ శక్తి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ అక్షర్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబనకు అనేక పథకాలు తీసుకొచ్చిందని, స్వయం ఉపాధి, బ్యాంకు లింకేజి రుణాలు, వడ్డీ లేని రాయితీ రుణాలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల మరమ్మతు చేయడంతో పాటు పలు కార్యక్రమాలు మహిళల ద్వారానే చేపడుతుందన్నారు. ఈ అవకాశాలు వినియోగించుకోని ఆర్థికంగా ఎదగాలన్నారు.



అనంతరం ఇందిరా మహిళా శక్తికి ఆర్థిక బలం, మెప్మా ఆధ్వర్యంలో 225 స్వయం సహాయక సంఘాలకు రూ.72,78,405/ వడ్డీ లేని రుణాల చెక్కును మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, తహశీల్దార్ అద్దంకి నరేష్, సమితిసింగారం ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, పట్టణ అధ్యక్షులు శివసైదులు, కూచిపూడి బాబు, సీనియర్ నాయకులు పోలమూరు రాజు, 14 టైర్ యూనియన్ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రేలిసియస్ రెస్టారెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్, జనవరి 19 (భారత శక్తి): వనస్థలిపురంలో జమీల్ వారి పుత్రుడు జావెద్ కొత్తగా ఏర్పాటు చేసిన గ్రేలిసియస్ రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు మధు గౌడ్,జగన్నాథ్,రోషన్ తదితరులు పాల్గొన్నారు.

# 582 మహిళా సంఘాలకు ₹1.91 కోట్ల చెక్కులు పంపిణీ చేసిన ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 19: కామారెడ్డి పట్టణంలోని కళాభారతి ఆడిటోరియం సోమవారం జనసందడిగా మారింది. మహిళా సాధికారతకు 'చేయూత'.. కామారెడ్డిలో వడ్డీ లేని రుణాల సందడి! 582 మహిళా సంఘాలకు ₹1.91 కోట్ల చెక్కులు ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ పంపిణీ చేసారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో జరిగిన వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమం మహిళా లోకంలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా విచ్చేసి, 582 స్వయం సహాయక సంఘాలకు కలిపి రూ. 1,91,83,496 (ఒక కోటి 91 లక్షల 83 వేల 496 రూపాయల) చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, మహిళల ఆర్థిక ఎదుగుదలే ప్రభుత్వ లక్ష్యం. ప్రతికుటుంబానికి వెన్నెముక మహిళ. ఒక ఇంటి అభివృద్ధి ఆ ఇంటి ఆడపడుచు ఆర్థిక స్థితిగతులపైనే ఆధారపడి ఉంటుంది. మీరు ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతోనే మా ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను అందిస్తోంది. ఈ నిధులు మీ వ్యాపారాలకు, మీ పిల్లల



భవిష్యత్తుకు పెట్టుబడి కావాలి. గతంలో వడ్డీలు కట్టలేక మహిళా సంఘాలు పడ్డ ఇబ్బందులు నాకు తెలుసు. కానీ ఇప్పుడు ఆ భయం వద్దు. పైసా వడ్డీ లేకుండా ప్రభుత్వం మీకు అండగా నిలుస్తోంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా ఎదగాలి. కామారెడ్డిని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెడతాం. ముఖ్యంగా మహిళా సాధికారత విషయంలో ఎలాంటి రాజీ పడబోం. మెప్మా ద్వారా ఇలాంటి ఎన్నో పథకాలను నేరుగా మీ దరికి చేరుస్తాం. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఈ రుణాలను మహిళలు సరైన మార్గంలో పెట్టుబడి పెట్టి ఆర్థికంగా నిలదొక్కుకోవాలి. తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించడం ద్వారా మరిన్ని నిధులు పొందే అవకాశం ఉంటుంది. జిల్లా యంత్రాంగం మహిళా సంఘాల బలోపేతానికి ఎల్లప్పుడూ సహకరిస్తుంది," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మధుమోహన్, మెప్మా పీడీ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో, ఎమ్మార్వో, ఇతర శాఖల అధికారులు, భారీ సంఖ్యలో మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. లబ్ధి పొందిన మహిళలు మహమ్మద్ షబ్బీర్ అలీ కి కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ భూమికి 'హైడ్రా' కంచె!

* **నల్లమల్లారెడ్డి ఆక్రమణలపై ఉక్కుపాదం..**
* **ఘట్‌కేసర్ మండలంలో 6.12 ఎకరాల స్వాధీనం**

హైదరాబాద్ ఘట్‌కేసర్, జనవరి 19 (భారత శక్తి) : ప్రభుత్వ భూములను ఆక్రమించి, అక్రమ లేఅవుట్లు వేసే అక్రమార్కులపై హైడ్రా (HYDRAA) మరోసారి తన ప్రతాపం చూపింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం కాచవాణి సింగారంలో ఆక్రమణకు గురైన రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని సోమవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విద్యాసంస్థల అధినేత నల్లమల్లారెడ్డి కబ్జా చేసిన 6.12 ఎకరాల స్థలానికి చుట్టూ కంచె వేసి, ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

**మళ్లీ ఆయనే.. అదే లేఅవుట్!**

సరిగ్గా ఏడాది క్రితం ఇదే దివ్యానగర్ లేఅవుట్‌లో అక్రమంగా నిర్మించిన అడ్డుగోడలను హైడ్రా కూల్చివేసింది. నాటి ఘటన మరువక ముందే, అదే విద్యాసంస్థల అధినేత నల్లమల్లారెడ్డి మళ్లీ హైడ్రాకు చిక్కడం గమనార్హం. కాచవాణి సింగారం సర్వే నంబరు 66/2, 3, 4, 5 పరిధిలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించిన ఆయన, నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లుగా మార్చి విక్రయించినట్లు ఫిర్యాదులు అందాయి.



**సర్వే నివేదికతో రంగంలోకి..**

ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన హైడ్రా, రెవెన్యూ మరియు ల్యాండ్ రికార్డ్స్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ నేతృత్వంలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. సర్వే నివేదికలో ఆ భూమి ప్రభుత్వానిదేనని తేలడంతో అధికారులు తక్షణమే చర్యలు చేపట్టారు. నల్లమల్లారెడ్డి ఏర్పాటు చేసిన సుమారు 50 ప్లాట్లను తొలగించి, మొత్తం 6.12 ఎకరాల స్థలాన్ని కాపాడారు.

అడ్డుకునే ప్రయత్నం విఫలం


* **హైడ్రా చర్యలను నల్లమల్లారెడ్డి అడ్డుకునే ప్రయత్నం చేశారు.**

నోటీసులు ఇవ్వకుండా కంచె ఎలా వేస్తారని అధికారులతో వాగ్వాదానికి దిగారు. అయితే, ప్రభుత్వ భూమి ఆక్రమణ విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేసిన అధికారులు.. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఫెన్సింగ్ పనులను పూర్తి చేశారు. ఈ స్థలం ప్రభుత్వానిదని, ఎవరైనా కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# నూతన సర్పంచ్‌లు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

: **జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 19 (భారతశక్తి) : కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం బాసర ఐఐఐటీ సమావేశ హాల్లో నూతనంగా ఎన్నికైన భైంసా, లోకేశ్వరం మండలాల సర్పంచ్‌లకు నిర్వహించిన శిక్షణ శిబిరానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాభివృద్ధిలో సర్పంచ్ పదవి అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు పంచాయతీరాజ్ చట్టం, సర్పంచ్ విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సర్పంచ్‌లు కృషి చేయాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన



అమలు, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సర్పంచ్‌లు నిత్యం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ, స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అధికారులతో సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కరించేలా చూడాలని సూచించారు. సర్పంచ్‌లకు అవసరమైన సంపూర్ణ సహకారం జిల్లా యంత్రాంగం నుంచి అందిస్తామని, ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. శిక్షణ తరగతుల్లో అధికారులు తెలియజేసే అంశాలను శ్రద్ధగా విని, తమ విధులపై మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లను వారి విధులు, బాధ్యతలపై ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, శిక్షణ తరగతుల రాష్ట్ర పరిశీలకులు శ్రీనివాస్, డిపిఓ శ్రీనివాస్, తహసిల్దార్ పవన్ చంద్ర, ఎంపీఓ తిరుపతి రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి తో సీఎం చంద్రబాబు బృందం భేటీ

ఆంధ్రప్రదేశ్, జనవరి 19 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో సీఎం చంద్రబాబు బృందం స్విట్జర్లాండ్ కు తరలివెళ్లింది. ఈ క్రమంలో వారు స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్‌తో జ్యూరిచ్‌లో సమావేశమయ్యారు. దీనిపై లోకేశ్ ట్వీట్ చేశారు. ఏపీస్విట్జర్లాండ్ మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడం, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు స్విస్ కంపెనీలను ప్రోత్సహించడంపై ఈ భేటీలో ఫలవంతమైన చర్చలు జరిపినట్లు లోకేశ్ తెలిపారు. టెక్నాలజీ, మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, రైల్వే, ఆర్ అండ్ డీ, ఇన్నోవేషన్ వంటి కీలక రంగాల్లో స్విస్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలను ఈ సందర్భంగా లోకేశ్ వివరించారు. పారిశ్రామిక రంగంతో



పాటు విద్యా రంగంలోనూ సహకారంపై చర్చించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఫార్మా, వైద్య పరికరాలు, స్టార్టప్‌ల రంగాల్లో స్విట్జర్లాండ్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో ఏపీలోని విద్యా సంస్థల భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై దృష్టి సారించారు. దీని ద్వారా ఏపీకి చెందిన నిపుణులు, విద్యార్థులు, తెలుగు ప్రవాసులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఇటీవలే కుదిరిన ఇండియా EFTA (ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్) ఒప్పందం ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు, ఉద్యోగాలు, ఆవిష్కరణల పరంగా ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభిస్తుందని మంత్రి లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం ఏపీకి స్విస్ పెట్టుబడులు రావడానికి మార్గాన్ని సుగమం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ట్రంప్ వ్యాఖ్యల ఎఫెక్ట్..
# రికార్డు స్థాయికి చేరిన పసిడి, వెండి

ఢిల్లీ, జనవరి 19 (భారత శక్తి): సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం, వెండి ధరలు ఈరోజు చరిత్రాత్మక గరిష్ఠ స్థాయికి చేరాయి. గ్రీన్‌లాండ్ వివాదం నేపథ్యంలో పలు యూరోపియన్ దేశాలపై కొత్తగా సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడంతో ఇన్వెస్టర్లు బంగారం వైపు పరుగులు పెట్టారు. దీంతో అంతర్జాతీయంగా, దేశీయంగా పసిడి, వెండి ధరలు కొత్త రికార్డులు సృష్టించాయి. దేశీయ మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (MCX)లో ఫిబ్రవరి ఫ్యూచర్స్ బంగారం ధర 1.68 శాతం పెరిగి 10 గ్రాములకు రూ. 1,44,905 పలికింది. అలాగే మార్చి ఫ్యూచర్స్ వెండి ధర ఏకంగా 4.39 శాతం వృద్ధితో కేజీకి రూ. 3,00,400 వద్ద ఆల్ టైమ్ హై రికార్డును నమోదు చేసింది. అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో కూడా ఔన్స్ బంగారం ధర 1.6 శాతానికి పైగా పెరిగి 4,700 డాలర్ల స్థాయిని తాకింది. గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేసేందుకు అమెరికాను అనుమతించే వరకు యూరప్‌లోని ఎనిమిది దేశాల నుంచి దిగుమతులపై సుంకాలు పెంచుతామని ట్రంప్ హెచ్చరించారు. ఈ పరిణామంతో ఇన్వెస్టర్లలో ఆందోళన పెరిగి, వారు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం, వెండి వైపు మళ్లించారు. రాజకీయ అస్థిరత, అమెరికా ద్రవ్య విధానంపై నెలకొన్న సందేహాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కూడా బంగారం ధరల పెరుగుదలకు దోహదపడ్డాయని మెహతా ఈక్విటీస్ ఉపాధ్యక్షుడు రాహుల్ కలాంత్రి తెలిపారు. సౌరశక్తి, ఎలక్ట్రిక్ వాహనాలు, ఏఐ వంటి రంగాల్లో వెండికి పెరుగుతున్న డిమాండ్ కూడా దాని ధరల పెరుగుదలకు కారణమవుతోంది. డాలర్ ఇండెక్స్‌లోని ఒడుదొడుకులు, సుంకాలపై యూఎస్ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ వారం కూడా బులియన్ మార్కెట్ లో ఒడుదొడుకులు తప్పవని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## యూఏఈ అధ్యక్షుడికి, ఆయన కుటుంబానికి
# అపురూపమైన కానుకలు ఇచ్చిన ప్రధాని మోదీ

భారత పర్యటనకు వచ్చిన యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఘన స్వాగతం పలికారు. ప్రొటోకాల్‌ను పక్కనపెట్టి, ఢిల్లీ విమానాశ్రయానికి స్వయంగా వెళ్లి ఆయనను ఆత్మీయంగా ఆహ్వానించారు. అనంతరం ఇద్దరు నేతలు ఒకే కారులో ప్రయాణించడం వారి మధ్య ఉన్న బలమైన స్నేహబంధానికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా లోక్ కల్యాణ్ మార్గ్‌లోని తన నివాసంలో యూఏఈ అధ్యక్షుడికి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రధాని మోదీ భారతీయ సంస్కృతి, నైపుణ్యానికి ప్రతీకగా నిలిచే ప్రత్యేక కానుకలను అందజేశారు. గుజరాతీ కుటుంబాల్లో తరతరాలుగా బంధాలకు కేంద్రంగా ఉండే, చేతితో చెక్కిన అందమైన చెక్క ఉయ్యాల (ఝూలా)ను బహుకరించారు. యూఏఈ 2026ను 'కుటుంబ సంవత్సరం'గా ప్రకటించిన నేపథ్యంలో ఈ కానుకకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. దీంతో పాటు, కశ్మీర్‌కు చెందిన సుప్రసిద్ధ పష్మీనా శాలువాను తెలంగాణలో తయారైన వెండి పెట్టెలో పెట్టి అందజేశారు. "నా సోదరుడు, యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌కు స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి వెళ్లాను. బలమైన భారత్ యూఏఈ స్నేహానికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఈ పర్యటన తెలియజేస్తోంది" అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. యూఏఈ అధ్యక్షుడి తల్లి షేఖా ఫాతిమాకు కూడా పష్మీనా శాలువాతో పాటు, వెండి పెట్టెలో కశ్మీరీ కుంకుమపువ్వును బహూకరించారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన రంగాల్లో బలమైన సంబంధాలు ఉన్నాయి. ఈ పర్యటన ద్వారా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంతో పాటు, ప్రాంతీయ,



అంతర్జాతీయ అంశాలపై చర్చించనున్నారు. గత దశాబ్ద కాలంలో యూఏఈ అధ్యక్షుడు భారత్‌లో పర్యటించడం ఇది ఐదోసారి కావడం గమనార్హం.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్...
# మరణించిన ఆరుగురు మావోయిస్టుల గుర్తింపు

ఛత్తీస్ గఢ్, జనవరి 19 (భారత శక్తి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఉత్తరపశ్చిమ ప్రాంతంలో భద్రతా బలగాలు మరో కీలక విజయాన్ని సాధించాయి. భోపాలపట్నంఫర్సేగఢ్ సరిహద్దుల్లోని అటవీ, కొండ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేషనల్ పార్క్ ఏరియా కమిటీ ఇంచార్జ్ డీవీసీఎం దిలీప్ బెండ్జా సహా మొత్తం ఆరు మంది మావోయిస్టులు హతమయ్యారు. మృతుల్లో నలుగురు మహిళా మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మావోయిస్టుల కదలికలపై అందిన నమ్మకమైన సమాచారంతో డీఆర్‌జీ బీజాపూర్, డీఆర్‌జీ దంతేవాడ, ఎస్‌టీఎఫ్, కోబ్రా బలగాలు (202, 206, 210 బెటాలియన్లు), సీఆర్‌పీఎఫ్ 214 బెటాలియన్‌కు చెందిన సంయుక్త బృందాలు ఈనెల 17న ప్రత్యేక సర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ ఆపరేషన్‌లో జనవరి 17 ఉదయం నుంచి 18 సాయంత్రం వరకు మధ్య తీవ్ర కాల్పులు చోటుచేసుకున్నాయి. మృతులను దిలీప్ బెంజా (రివార్డు రూ.8 లక్షలు), మాధవి కోసా (రూ.5 లక్షలు), పాలో పోడియం (రూ.5 లక్షలు), లఖీ మద్కం (రూ.5 లక్షలు), జుగ్గో బంజం (రూ.2 లక్షలు), రాధా మెట్ట (రూ.2 లక్షలు)గా గుర్తించారు. వీరిపై మొత్తం రూ.27 లక్షల రివార్డు ఉందని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పత్తిలింగం తెలిపారు. కీలక నేత దిలీప్ బెంజాపై బీజాపూర్ జిల్లాలో 135 క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఘటనాస్థలంలో నుంచి రెండు ఏకే 47లు, ఒక ఇన్సాస్, రెండు 0.303 రైఫిళ్లు, ఒక కార్బైన్‌తో పాటు పేలుడు పదార్థాలు, వైర్‌లెస్ సెట్లు, మావోయిస్టు సాహిత్యం స్వాధీనం చేసుకున్నారు. దిలీప్ బెండ్జాపై 135కు పైగా కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు పేర్కొన్నారు.

# టీం 11 ముఖం చూసి ఎవరైనా పెట్టుబడులు పెడతారా?

"ఏపీలో ఉన్న టీం 11' ముఖం చూసి ఎవరైనా పెట్టుబడులు పెట్టడానికి వస్తారా? అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా ప్రశ్నించారు. పెట్టుబడుల కోసం తాము ప్రయత్నిస్తుంటే, ఏపీకి రావొద్దని ఆ 'ఏడుపుగొట్టు టీం' కంపెనీలకు ఈమెయిల్స్ పెడుతోందని ఆరోపించారు. కోడికత్తి, బాబాయి హత్య, ప్రజాధనంతో ప్యాలెస్ కట్టుకున్న క్రెడిట్ మాత్రమే వారికి దక్కుతుందని ఎద్దేవా చేశారు. దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో పాల్గొనేందుకు స్విట్జర్లాండ్ వెళ్లిన ఆయన, జ్యూరిచ్ లో ఏపీఎన్‌ఆర్టీ ఆధ్వర్యంలో జరిగిన యూరప్ తెలుగు డయాస్పోరా సమావేశంలో సీఎం చంద్రబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, పరోక్ష విమర్శలు గుప్పించారు. "ఏపీలో టీం 11 ఉంది. అర్థమైందా రాజా? అదో ఏడుపుగొట్టు టీం. పెట్టుబడులు తీసుకువస్తామంటే ఏడుస్తారు. పెట్టుబడుల కోసం సింగపూర్ కు వెళితే.. ఏపీకి రావద్దని ఆ ఏడుపుగొట్టు టీం ఈమెయిల్స్ పెట్టే పరిస్థితి. కొన్ని కంపెనీలను కలిస్తే ఏపీకి రావొద్దంటూ వారికి కూడా ఈమెయిల్స్ పెడుతున్నారు. సీఎం చంద్రబాబు గారిని చూసి సదరు కంపెనీలు వస్తే మాత్రం క్రెడిట్ తీసుకోవాలనుకుంటారు. మళ్లీ క్రెడిట్ చోరీ అంటారు. టీం 11 ముఖం చూసి ఎవరైనా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వస్తారా? కోడికత్తికి వారికి క్రెడిట్ ఇవ్వాలి. బాబాయిని లేపేసిన క్రెడిట్ ఇవ్వాలి. చెల్లినీ, తల్లినీ గెంటేసిన క్రెడిట్ ఇవ్వాలి. రూ.700 కోట్ల ప్రజాధనంతో విశాఖలో ప్యాలస్ కట్టుకున్న క్రెడిట్ ఏడుపుగొట్టు టీంకి ఇవ్వాలి" అంటూ లోకేశ్ సెటైర్ల వర్షం కురిపించారు. గత 18 నెలల్లో ప్రజా ప్రభుత్వం రూ.23.50 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకుందని, దీని ద్వారా 16 లక్షలకు పైగా ఉద్యోగాలు రాబోతున్నాయని లోకేశ్ తెలిపారు. దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే రావడం గర్వకారణమని, పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ఇప్పుడు నంబర్ 1 స్థానంలో ఉందని అన్నారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడి, ఢిల్లీని సైతం దద్దరిల్లేలా చేసిన వ్యక్తి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని కొనియాడారు. ఆయన తెలుగుదేశం పార్టీని స్థాపించడం వల్లే తెలుగుజాతికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందన్నారు. ఎన్టీఆర్ ఆశయాలకు అభివృద్ధిని జోడించి రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు అని లోకేశ్ అన్నారు. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ కంపెనీలు నేడు ఏపీ వైపు చూస్తున్నాయంటే దానికి కారణం 'బ్రాండ్ సీబీఎన్' అని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబుకు ఉన్న విజన్ కారణంగా ఆయన్ను ఏ విషయంలో అయినా గుడ్డిగా అనుసరించవచ్చని లోకేశ్ అన్నారు. ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా కొందరు విమర్శిస్తారని, కానీ భవిష్యత్తులో అవే అభివృద్ధి ఫలాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు జీపీఎస్ లాంటివారని, ఆయన నాయకత్వంలో తామంతా ఒక యంగ్ టీంగా ఎటువంటి ఈగోలు లేకుండా పనిచేస్తున్నామని తెలిపారు. ఆయన విజన్ సాధన కోసం అహర్నిశలు శ్రమిస్తున్నామన్నారు. 'బ్రాండ్ సీబీఎన్', 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్', ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని 'డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్' వల్లే కంపెనీలు ఏపీకి క్యూ కడుతున్నాయని వివరించారు. గుజరాత్, ఒడిశా మాదిరిగా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ కొనసాగింపు చాలా ముఖ్యమని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఈ ప్రభుత్వం కనీసం 15 ఏళ్లు కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల బండిలా సాగుతున్నాయని, డీఎస్సీ పూర్తి చేయడం, కానిస్టేబుల్ ఉద్యోగాలు కల్పించడం వంటి హామీలను నిలబెట్టుకున్నామని తెలిపారు. ఒకే రాజధాని అమరావతి, అభివృద్ధి వికేంద్రీకరణ తమ ప్రభుత్వ అజెండా అని స్పష్టం చేశారు. చిత్తూరుకడపను ఎలక్ట్రానిక్స్ హబ్‌గా, కర్నూలును రెన్యువబుల్ ఎనర్జీ హబ్‌గా, ఉత్తరాంధ్రను ఫార్మా, ఐటీ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారంతా ఆంధ్రప్రదేశ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా మారి, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని లేదా తాము పనిచేస్తున్న కంపెనీలను ఏపీకి తీసుకురావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మంత్రి టీజీ భరత్, ఏపీఎన్‌ఆర్టీ అధ్యక్షుడు డా. వేమూరు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో రథసప్తమికి విస్తృత ఏర్పాట్లు

తిరుమల, జనవరి 19 (భారత శక్తి): తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక రథసప్తమి ఉత్సవాలకు టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సకల జీవకోటికి వెలుగునిచ్చే సూర్య భగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఒకే రోజులో స్వామివారు ఏడు వేర్వేరు వాహనాలపై మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వడం ఈ పర్వదినం యొక్క ప్రధాన ప్రత్యేకత. అందుకే రథసప్తమిని 'అర్ధ బ్రహ్మోత్సవం'గా కూడా పిలుస్తారు. ఉత్సవాలు తెల్లవారుజామున సూర్యోదయ వేళ సూర్యప్రభ వాహన సేవతో ప్రారంభమవుతాయి. అనంతరం చిన్నశేష వాహనం, గరుడవాహనం, హనుమంత వాహనం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం మీద స్వామివారు వరుసగా భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి చంద్రప్రభ వాహన సేవతో ఈ మహోత్సవం ఘనంగా ముగుస్తుంది. ఒక్కరోజులోనే స్వామివారి ఏడు వాహన సేవలను దర్శించుకునే అరుదైన అవకాశం లభించడంతో దేశవ్యాప్తంగా లక్షలాది భక్తులు తిరుమలకు తరలిరానున్నారు.

# హిందువులపై దాడులు.. స్పందించిన బంగ్లాదేశ్ ప్రభుత్వం

బంగ్లాదేశ్, జనవరి 19: తమ దేశంలో హిందువులు, ఇతర మైనారిటీలపై జరుగుతున్న దాడులపై బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం స్పందించింది. తమ దేశంలో మైనారిటీలకు సంబంధించిన ఘటనల్లో చాలా వరకు నేరపూరిత స్వభావం కలిగిన వ్యక్తులు చేసినవేనని, వాటిలో మతపరమైన ఉద్దేశాలు లేవని తెలిపింది. మైనారిటీలకు సంబంధించి గత ఏడాది 645 ఘటనలు చోటు చేసుకున్నాయని పేర్కొంది. ఈ మేరకు ఆ దేశ తాత్కాలిక ప్రధాని మహమ్మద్ యూనస్ కార్యాలయం వివరాలు వెల్లడించింది. వాటిలో 71 ఘటనల్లో మతపరమైన కోణాలు ఉన్నట్లు పేర్కొంది. ఆలయాలపై దాడులకు సంబంధించి 38 ఘటనలు నమోదైనట్లు తెలిపింది. ఆ 71 ఘటనలకు సంబంధించి 50 అంశాల్లో పోలీసులు కేసు నమోదు చేసినట్లు వెల్లడించింది. మిగిలిన 21 ఘటనలపై తగిన చర్యలు తీసుకున్నామని పేర్కొంది. నేరం ఏదైనా తీవ్రంగానే పరిగణిస్తున్నామని బంగ్లాదేశ్ స్పష్టం చేసింది. మరోవైపు, ఈ ప్రకటనను బంగ్లాదేశ్ హిందూ, బుద్ధిస్ట్, క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్ తీవ్రంగా ఖండించింది. ఇలాంటి ప్రకటనలు నేరస్థులను ప్రోత్సహించి, వారికి శిక్షపడదనే భావనను కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. గత మూడు వారాల వ్యవధిలోనే 10 మందికి పైగా హిందువులు బంగ్లాదేశ్‌లో హత్యకు గురయ్యారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం..

హైదరాబాద్, జనవరి 19 (భారత శక్తి): ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తునకు ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో రేపు (మంగళవారం) ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్‌లోని పోలీస్ స్టేషన్‌కు విచారణ నిమిత్తం హాజరు కావాలని సిట్ హరీశ్ రావుకు ఇచ్చిన నోటీసుల్లో పేర్కొంది. మాజీ మంత్రి ప్రస్తుతం సిద్దిపేట పర్యటనలో ఉన్నారు. ఆయన ఇంట్లో లేని సమయంలో సిట్ ఈ నోటీసులు ఇచ్చింది. ఈ కేసులో ఇప్పటికే పలువురికి నోటీసులు ఇచ్చిన దర్యాప్తు బృందం వారిని విచారించింది.

## నలుగురు దొంగలను
# అరెస్ట్ చేసిన మల్కాజ్గిరి కమీషనరేట్ పోలీసులు

ఎల్బీనగర్, జనవరి 19 (భారత శక్తి): హైదరాబాద్ నగరంలోని ఆర్టీసీ బస్సుల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసిన ఎల్బీనగర్ పోలీసులు. నలుగురు నిందితుల అరెస్ట్, 60 గ్రాముల బంగారు గాజుల స్వాధీనం. తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల ముఠాను ఎల్బీనగర్ పోలీసులు విజయవంతంగా పట్టుకున్నారు. జనవరి 8, 2026 న శ్రీమతి కె. కృష్ణ నందిత అనే మహిళ ఎల్బీ నగర్ చౌరస్తా వద్ద బస్సు ఎక్కుతుండగా, ఆమె బ్యాగులో ఉన్న 60 గ్రాముల (6 తులాల) బంగారు గాజులను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, జనవరి 18, 2026 సాయంత్రం ఎల్బీనగర్ ఎక్స్ రోడ్ వద్ద కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. పోలీసులను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించిన నిందితులను వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద నుండి చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన నిందితులందరూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, నంద్యాల జిల్లా, ఆత్మకూరు



మండలం, ముస్తపల్లి గ్రామానికి చెందినవారు. తమ్మిశెట్టి వాణి @ చిట్టి పాత నేరస్థురాలు (తిరుపతి, నందికొట్కూరులో గతంలో కేసులు ఉన్నాయి). గోగుల దానమ్మ 1987 నుండి పలు దొంగతనాల కేసుల్లో నితమ్మిశెట్టి రాజు తమ్మిశెట్టి నాగమణి.ఈ ముఠా అత్యంత చాకచక్యంగా దొంగతనాలకు పాల్పడేవారు.వీరు నెలకు రెండు మూడు సార్లు ఆంధ్రప్రదేశ్ నుండి హైదరాబాద్‌కు వచ్చి, రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సు రూట్లను ఎంచుకునేవారు. తమ్మిశెట్టి వాణి, గోగుల దానమ్మ ఇద్దరు కలిసి బస్సు ఎక్కేటప్పుడు ఫుట్‌బోర్డు వద్ద ప్రయాణికులను తోస్తూ, రద్దీని ఆసరాగా చేసుకుని మహిళల హ్యాండ్‌బ్యాగుల జిప్పులు తీసి నగలను దొంగిలించేవారు.తమ్మిశెట్టి రాజు, నాగమణి నిఘా ఉంచడం దొంగిలించిన సొత్తును దాచిపెట్టడంలోసహాయపడేవారు

- **స్వాధీనం చేసుకున్న సొత్తు:**

సుమారు ₹8,50,000 విలువైన 60 గ్రాముల (4) బంగారు గాజులు.ఇతర కేసులు: విచారణలో నిందితులు అదే రోజు (జనవరి 8) వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని బి.ఎన్. రెడ్డి నగర్ వద్ద మరో మహిళ నుండి 10 గ్రాముల బంగారు గొలుసు దొంగిలించినట్లు అంగీకరించారు.ముఖ్యంగా మహిళా ప్రయాణికులు బస్సులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు కోరుతున్నారు. మీ హ్యాండ్‌బ్యాగులను భద్రంగా ముందు వైపు ఉంచుకోవాలని మరియు రద్దీగా ఉన్న ప్రాంతాల్లో అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# బాలాపూర్‌లో జనవరి 24న 'ధర్మ రక్షణ సభ'



* రోహింగ్యాల అక్రమ చొరబాట్లపై 'అఖిల పక్షం' సమరభేరి..
* భద్రతపై రాజీలేని పోరాటం చేద్దాం: కాంగ్రెస్ నాయకులు చిగిరింత నరసింహారెడ్డి పిలుపు.

బాలాపూర్, జనవరి 19 (భారత శక్తి) : రంగారెడ్డి జిల్లా బాలాపూర్ పరిసర ప్రాంతాల్లో రోహింగ్యాలు అక్రమంగా మన దేశంలోకి చొరబడి స్థిరపడ్డారు, తద్వారా పొంచి ఉన్న భద్రతా ముప్పుపై స్థానిక నాయకులు గళమెత్తారు. గణేష్ సేన ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన నిర్వహించ తలపెట్టిన 'ధర్మ రక్షణ సభ' ద్వారా తమ నిరసనను గట్టిగా వినిపించాలని అఖిల పక్షం నిర్ణయించింది. సోమవారం బాలాపూర్ గణేష్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశంలో నాయకులు పాల్గొని సభ ఏర్పాట్లపై చర్చించారు.

*** పార్టీలకు అతీతంగా పోరాడదాం**

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి మాట్లాడుతూ.. బాలాపూర్ పరిసరాల్లో అక్రమంగా స్థిరపడుతున్న రోహింగ్యాల వల్ల స్థానికులు తీవ్ర అభద్రతా భావానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. "చొరబాటుదారులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇది కేవలం ఒక వర్గానికి సంబంధించిన సమస్య కాదు, స్థానిక ముస్లిం సోదరులు కూడా దీనివల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుకే రాజకీయాలకు అతీతంగా ఏకతాటిపైకి వచ్చి పోరాడాల్సిన అవసరం ఉంది" అని ఆయన పిలుపునిచ్చారు.

*** పార్లమెంటులో చర్చకు డిమాండ్:**

అక్రమ వలసల అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, కేంద్రంపై కూడా ఒత్తిడి పెంచాలని నాయకులు తీర్మానించారు. ఈ సమస్యపై పార్లమెంటులో చర్చ జరిగేలా అన్ని రాజకీయ పార్టీల సహకారం కోరతామని వెల్లడించారు. బాలాపూర్ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, చొరబాటుదారుల ఏరివేతలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కోలన్ శంకర్ రెడ్డి, సింగిరెడ్డి పెంటారెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి, గుండుజి రఘునందన్ చారి, వంగేటి లక్ష్మారెడ్డి, పోరేటి శ్రీనివాస్ రెడ్డి, బలింగని జంగయ్య, నవారు శ్రీనివాస్ రెడ్డి, బోర్ర రవి, మేకల సంజీవ, గిరికటి కృష్ణంరాజు గౌడ్, కొంతం ప్రకాశ్ రెడ్డి, టేకుల శశిధర్ రెడ్డి, కోటగిరి మురళి, కల్లెం లక్ష్మారెడ్డి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు. 24న జరిగే సభను భారీ ఎత్తున విజయవంతం చేయాలని వారు కోరారు.



## ప్రజావాణి దరఖాస్తులను
# త్వరితగతిన పరిష్కరించాలి

**: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్..**

హైదరాబాద్, జనవరి 19: భారత శక్తి ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, విన్నపాలను ఏమాత్రం జాప్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన స్వయంగా పాల్గొని బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. ఒకే సమస్యపై అర్జీదారులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదని, హెచ్ఓడీలు ప్రత్యేక శ్రద్ధ వహించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

**మొత్తం 168 ఫిర్యాదులు:**

నగరవ్యాప్తంగా వివిధ జోన్ల పరిధిలో జరిగిన ప్రజావాణిలో మొత్తం 168 అర్జీలు అందాయి.

**వీటి వివరాలు ఇలా ఉన్నాయి:**

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం: 41
శంషాబాద్ జోన్: 53
మల్కాజ్ గిరి జోన్: 32
కుత్బుల్లాపూర్ జోన్: 23
కూకట్‌పల్లి జోన్: 17
శేరిలింగంపల్లి జోన్: 11
ఎల్బీనగర్ జోన్: 08
రాజేంద్రనగర్ జోన్: 07
సికింద్రాబాద్ జోన్: 06
గోల్కొండ జోన్: 05
ఉప్పల్ జోన్: 04
చార్మినార్ జోన్: 02

ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు రఘు ప్రసాద్, సత్యనారాయణ, వేణు గోపాల్, అలివేలు మంగతాయారు, పంకజ, యూబీడీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సీసీపీ శ్రీనివాస్, చీఫ్ వాల్యుయేషన్ ఆఫీసర్ రజినీకాంత్ రెడ్డి, జాయింట్ కమిషనర్ తిప్పర్తి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ ఆరోగ్య సంరక్షణకు 'అభా' కీలకం..

* వైదేహి నగర్‌లో కార్డుల నమోదు కార్యక్రమంలోపాల్గొన్న కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి..



బి.ఎన్.రెడ్డి నగర్, జనవరి 19 (భారత శక్తి) : ప్రజల ఆరోగ్య వివరాలను సాంకేతిక రూపంలో భద్రపరచుకోవడానికి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతా (ABHA) కార్డులు ఎంతో దోహదపడతాయని బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వైదేహి నగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన 'అభా' కార్డుల నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**రికార్డుల తిప్పలు తప్పవు..**

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు వెళ్లే సమయంలో పాత వైద్య పత్రాలు, రిపోర్టులు వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఇకపై ఉండదని తెలిపారు. ఆభా ఖాతా ద్వారా వైద్యులు నేరుగా రోగి యొక్క పూర్తి ఆరోగ్య చరిత్రను పరిశీలించే వీలుంటుందని వివరించారు. దీనివల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, అత్యవసర సమయాల్లో త్వరితగతిన చికిత్స పొందే అవకాశం ఉంటుందని చెప్పారు.

**బీమా పథకాలకు అనుసంధానం**

ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకాలకు కూడా ఈ కార్డు అనుసంధానమై ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మౌనికతో పాటు కాలనీ ప్రతినిధులు దామోదర్ రెడ్డి, కోటేశ్, హిమవంత్ రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**: కమిషనర్ ఆర్.వి. కర్ణన్..**





హైదరాబాద్, జనవరి 19 ( భారత శక్తి) : భాగ్యనగరంలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు అదనపు, జోనల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన 'వెబ్ ఎక్స్' దృశ్య మాధ్యమ సమీక్షలో ఆయన అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ మరియు వివిధ విభాగాల ఉన్నతాధికారులతో నగరంలో సాగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గత నెల 29న ప్రారంభమైన ప్రత్యేక డ్రైవ్ ఈ నెల 31న ముగియనుందని, రానున్న రోజుల్లో ఈ కార్యక్రమాన్ని మరింత ప్రభావవంతంగా నిర్వహించాలని సూచించారు. అధికారులు కేవలం పర్యవేక్షణకే పరిమితం కాకుండా, స్వయంగా క్షేత్ర తనిఖీలు చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్యంతో పాటు పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించి, వారి భాగస్వామ్యంతో హైదరాబాద్‌ను పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

*** ముమ్మరంగా మెగా సానిటేషన్ డ్రైవ్:**

జీహెచ్ఎంసీ పరిధిలో మెగా సానిటేషన్ డ్రైవ్ యుద్ధ ప్రాతిపదికన సాగుతోంది. ఇప్పటివరకు జరిగిన పనుల వివరాలు ఇలా ఉన్నాయి:

నిర్వహించిన ప్రాంతాలు: 300 వార్డుల్లోని 3,613 ఏరియాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్లు, పార్కులు మరియు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు.

వ్యర్థాల తరలింపు: ఇప్పటివరకు మొత్తం 5,641 మెట్రిక్ టన్నుల అదనపు వ్యర్థాలను తొలగించారు. ఇందులో 4,243 మెట్రిక్ టన్నుల సాధారణ వ్యర్థాలు కాగా, 1,398 మెట్రిక్ టన్నుల నిర్మాణ వ్యర్థాలు ఉన్నాయి. జోనల్ మరియు డిప్యూటీ కమిషనర్లు ఈ పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారని కమిషనర్ వెల్లడించారు.



# మున్నూరు కాపు క్యాలెండర్ ఆవిష్కరణ

ఎల్బీనగర్, జనవరి 19 (భారత శక్తి): ఎల్బీనగర్ నియోజకవర్గం దిల్ సుఖ్ నగర్ మున్నూరు కాపు సంఘ సభ్యుల ఆధ్వర్యంలో కాపు కుటుంబసభ్యులతో కలిసి చైతన్యపురిలోని విశ్వ ప్రేమ్ కుమార్ అదాలత్ కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘ ముఖ్య సలహాదారులు పుటం పురుషోత్తం రావు, కోట్ల శ్రీనివాస్, పులిపాటి త్రివేది, ఎక్కా రమేష్ కార్య నిర్వాహక అధ్యక్షులు తోట రాజు, అధ్యక్షులు అనంతుల నవీన్ కుమార్, చక్రం నాగరాజు, బాకారం సత్యనారాయణ, ఆరే క్రాంతి కుమార్, కోట్ల వేణు గోపాల్, పుటం విజయ్ కుమార్ ధరణికోట శ్రీధర్ తదితర కాపు సోదరులు పాల్గొన్నారు.

# విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం: సీఎం రేవంత్ రెడ్డి

* నర్సింగ్ కళాశాలలో జపనీస్, జర్మన్ భాషలు నేర్పేందుకు చర్యలు
* 108 కోట్ల 60 లక్షలతో నిర్మించే జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు శంకుస్థాపన
* 162 కోట్ల 54 లక్షలతో మున్నేరు నుండి పాలేరు లింక్ కెనాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన
* 45 కోట్ల 50 లక్షలతో కూసుమంచి 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన
* 25 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు ప్రారంభోత్సవం
* 19 కోట్ల 90 లక్షల 50 వేలతో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రారంభోత్సవం



ఖమ్మం బ్యూరో, భారత శక్తి, జనవరి 19: విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు వాకాటి శ్రీహరి, నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు లతో కలిసి పర్యటించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ ఘన స్వాగతం పలికారు.

**పాలేరు నియోజకవర్గ పరిధి ఏదులాపురం**

మునిసిపాలిటీ పరిధిలో 108 కోట్ల 60 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నూతన భవనాలకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసి భూమి పూజ నిర్వహించారు. కూసుమంచిలో 5 ఎకరాల విస్తీర్ణంలో 45 కోట్లతో నిర్మించనున్న 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి, 162 కోట్ల 54 లక్షలతో మున్నేరు పాలేరు లింక్ కేనాల్ నిర్మాణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే 25 కోట్ల రూపాయలతో 5 ఎకరాల విస్తీర్ణంలో నూతనంగా నిర్మించిన నర్సింగ్ కళాశాలను, మద్దులపల్లిలో 23 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు 20 కోట్ల రూపాయలతో నిర్మించిన మార్కెట్ యార్డును ప్రారంభించారు. అనంతరం నర్సింగ్ కళాశాలలో విద్యార్థులతో సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థినులకు నర్సింగ్ కళాశాల నూతన భవన ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్య, వైద్యం ప్రజా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన విద్య, నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని అన్నారు.



# ఘనంగా యోగి వేమన జయంతి వేడుకలు

వైఎస్ ఆర్ కడప,జనవరి 19(భారత శక్తి): వేమన శతకం తెలుగు సాహిత్యంలో ఓ కీర్తి కిరీటమని జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా పేర్కొన్నారు. సోమవారం జిల్లా సచివాలయం లోని సభా భవన్ నందు యోగి వేమన జయంతి సందర్భంగా యోగి వేమన చిత్రపటానికి జిల్లా జాయింట్ కలెక్టర్, డి ఆర్ ఓ విశ్వేశ్వర నాయుడు, తదితరులు నివాళులర్పించారు. ఈసందర్భంగా జేసి మాట్లాడుతూ యోగి వేమన పేరు తెలియని తెలుగువారుండరని ప్రాథమిక విద్య తెలుగు వాచకంలో వేమన పద్యం పాఠ్యాంశం తప్పనిసరిగా ఉంటుందని వేమన శతకం తెలుగు సాహిత్యంలో ఓ కీర్తి కిరీటమని పేర్కొన్నారు. 17వ శతాబ్దంలో ఆనాటి సమాజంలోని అసమానతలను చూసి తనదైన శైలిలో పద్యాలతో అప్పటి సామాజిక పరిస్థితులపై ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు ప్రయత్నం చేశారనీ తెలిపారు. అక్షరాయుధంతో సామాజిక విప్లవం తెచ్చిన సహజ కవి వేమన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు జెడ్పి సీఈఓ ఓబులమ్మ, డిఆర్డిఏ మెప్మా పీడీలు రాజ్యలక్ష్మి కిరణ్ కుమార్ జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు..

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.